దేశరాజధాని ఢిల్లీలో
ఈరోజు బంగారం ధర
తులం బంగారం (10 గ్రాములు)
1,42,700/- (22 క్యారెట్స్)
1,55,680/- (24 క్యారెట్స్)

ప్రజా వాయిస్

PRAJA VOICE ఇది ప్రజల గొంతుక
/ PRAJA VOICE
WWW.PRAJAVOICE.IN
సంపుటి: 02 | సంచిక: 64 | ఎడిటర్: మేనం శ్యామ్ | మంగళవారం 22-09-2026 | పేజీలు: 10

సిరా చుక్క

జెన్ జీ పెళ్లంటే వద్దంటున్నారు...
సంసార బాధ్యతలు
మోయలేమంటున్నారు...
స్వేచ్ఛగా బతకడమే జీవితమంటున్నారు...
కో లివింగ్ బెటర్ అంటున్నారు...
ఓయో రూములంటూ, కో లివింగ్ హాస్టల్స్
అంటూ ఒకే రూములో
కొత్త ప్రపంచం వెతుకుతున్నారు...
క్షణిక సుఖాల వెంట పరుగులు తీస్తూ,
బంధాల కన్నా స్వేచ్ఛే మిన్నంటున్నారు...
బాధ్యతల కన్నా తమ ఇష్టాలకే
విలువ ఇస్తున్నారు..తప్పు కాదు..
కాలం మారింది..ఆలోచనలు మారాయి,
జీవనశైలి మారింది..తల్లిదండ్రుల ఆశలు
మాత్రం మారలేదు..కొలివింగులో బిడ్డ
తన స్వేచ్ఛను వెతుకుతుంటే.. ఇంట్లో తల్లి
కన్నీళ్లతో ఎదురుచూస్తోంది..
"నా బిడ్డ పెళ్లి చూడాలి"అన్న కల
కళ్ళముందే మసకబారుతుంది....
తండ్రి అడగలేదు.. అడ్డుకోలేదు..
తన గుండె బాధను మౌనంగా
మోస్తున్నాడు.. ."బిడ్డ సంతోషంగా ఉంటే
చాలు"అంటూనే... తన వృద్ధాప్య
ఒంటరితనాన్ని దాచుకుంటున్నాడు...
ఇంటి గోడలు అలాగే ఉన్న.. బిడ్డ కోసం
ఎదురుచూసే గుండెల్లో మాత్రం
రోజురోజుకు వెలితి పెరుగుతుంది.స్వేచ్ఛగా
బతకడం మీ హక్కే, కానీ మీకోసం కన్నీరు
దాచుకొని, ఎదురుచూసే రెండు
హృదయాలను మాత్రం మరవకండి...
రమేష్ గాండ్ల వర్ధన్నపేట

దానం తర్వాత కడియం శ్రీహరిపై గురి..

బీఆర్ఎస్ న్యాయ పోరాటం

- దానం అనర్హతతో ఫిరాయింపు ఎమ్మెల్యేలపై పెరిగిన ఒత్తిడి
- కడియం శ్రీహరిపై అనర్హత పిటిషన్‌పై కొనసాగుతున్న న్యాయ ప్రక్రియ
- కాంగ్రెస్ అభ్యర్థిగా కుమార్తె కావ్య పోటీ అంశంపై బీఆర్ఎస్ వాదనలు
- కోర్టులో ఆధారాలను ప్రస్తావించేందుకు సిద్ధమవుతున్న గులాబీ పార్టీ
- పోచారం శ్రీనివాస్ రెడ్డి వ్యవహారంపైనా బీఆర్ఎస్ దృష్టి

హైదరాబాద్, ప్రజా వాయిస్: తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేసిన నేపథ్యంలో బీఆర్ఎస్.. ఇతర ఫిరాయింపు ఎమ్మెల్యేలపై న్యాయపరమైన పోరాటాన్ని కొనసాగించేందుకు సిద్ధమవుతోంది. దానం నాగేందర్ వ్యవహారంలో హైకోర్టు తీర్పు నేపథ్యంలో కడియం శ్రీహరి కేసుపై కూడా ఆసక్తి నెలకొంది.

దానం తర్వాత కడియం అంశం..

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి 2023లో బీఆర్ఎస్ తరఫున గెలిచారు. ఆయనపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అనర్హత పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఫిబ్రవరి 2026లో కడియం శ్రీహరికి నోటీసులు జారీ చేశారు.

కుమార్తె కావ్య పోటీ అంశం..

2024 లోక్‌సభ ఎన్నికల్లో కడియం శ్రీహరి కుమార్తె కడియం కావ్య కాంగ్రెస్ అభ్యర్థిగా వరంగల్ నుంచి పోటీ చేశారు. ఈ అంశంతో పాటు కడియం శ్రీహరి కాంగ్రెస్‌తో అనుబంధంగా వ్యవహరించారనే అంశాలను బీఆర్ఎస్ తన పిటిషన్‌లో ప్రస్తావించింది. 2025లో సుప్రీంకోర్టులో నమోదైన కేసు వివరాల్లోనూ కడియం శ్రీహరి 2024 మార్చి 31న కాంగ్రెస్‌లో చేరినట్లు ఫిర్యాదుదారుల ఆరోపణగా నమోదైంది.

స్పీకర్ నిర్ణయంపై తదుపరి దశ..

కడియం శ్రీహరిపై దాఖలైన అనర్హత పిటిషన్‌ను స్పీకర్ గడ్డం

ప్రసాద్ కుమార్ మార్చి 2026లో కొట్టివేశారు. తగిన ఆధారాలు లేవని స్పీకర్ పేర్కొన్నట్లు సమాచారం. అనంతరం దానం నాగేందర్ వ్యవహారంలో హైకోర్టు స్పీకర్ నిర్ణయాన్ని పక్కనపెట్టి అనర్హత వేటు వేయడంతో, మిగిలిన ఫిరాయింపు కేసులపై కూడా న్యాయపరమైన పరిణామాలు ఎలా ఉండబోతున్నాయనే చర్చ మొదలైంది.

దానం కేసులో కీలక తీర్పు..

2023లో బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. ఈ వ్యవహారంపై దాఖలైన పిటిషన్లను విచారించిన తెలంగాణ హైకోర్టు సెప్టెంబర్ 18న ఆయనను అనర్హుడిగా ప్రకటించి ఖైరతాబాద్ స్థానాన్ని ఖాళీగా ప్రకటించింది. దానం నాగేందర్ ఈ తీర్పును సవాల్ చేస్తూ సెప్టెంబర్ 21న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అత్యవసర విచారణకు ఆయన తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గి ప్రస్తావించగా, పిటిషన్‌ను అత్యవసరంగా జాబితా చేసేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది.

పోచారం శ్రీనివాస్ రెడ్డి అంశంపైనా చర్చ..

మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి వ్యవహారాన్ని కూడా బీఆర్ఎస్ న్యాయపరంగా పరిశీలిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే ఆయనపై ప్రస్తుతానికి ఎలాంటి తుది న్యాయ నిర్ణయం వెలువడినట్లు ఆధారం లేదు. కడియం శ్రీహరి సహా ఇతర ఫిరాయింపు ఎమ్మెల్యేలపై పెండింగ్‌లో ఉన్న న్యాయ ప్రక్రియలు, సంబంధిత కోర్టుల నిర్ణయాల ఆధారంగానే తదుపరి పరిణామాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది.

ఖైరతాబాద్‌లో కొత్త రాజకీయం

- సుప్రీం తీర్పుపై దానం భవితవ్యం
- హైకోర్టు అనర్హతపై సుప్రీం కోర్టును ఆశ్రయించిన దానం
- సెప్టెంబర్ 23న పిటిషన్‌పై విచారణ
- బీఆర్ఎస్ అభ్యర్థిగా సాయి కిరణ్ పేరు పరిశీలన
- కాంగ్రెస్‌లో రోహిన్ రెడ్డి, విజయారెడ్డి పేర్లపై చర్చ
- సుప్రీం విచారణ తర్వాత కాంగ్రెస్ తుది నిర్ణయం

ఖైరతాబాద్, ప్రజా వాయిస్: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంతో నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. పార్టీ ఫిరాయింపుల కేసులో తెలంగాణ హైకోర్టు దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేసిన నేపథ్యంలో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై సెప్టెంబర్ 23న ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం విచారణ చేపట్టనుంది. హైకోర్టు తీర్పుపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని దానం తరఫు న్యాయవాదులు కోరుతున్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిగా సాయి కిరణ్ పేరు..

ఖైరతాబాద్ ఉప ఎన్నిక జరిగే పరిస్థితుల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తనయుడు తలసాని సాయి కిరణ్ యాదవ్ పేరును పార్టీ పరిశీలిస్తున్నట్లు తాజా కథనాలు పేర్కొంటున్నాయి. సాయి కిరణ్ పేరును దాదాపు ఖరారు చేసినట్లు కొన్ని వార్తా కథనాలు వెల్లడించాయి.

కాంగ్రెస్‌లో అభ్యర్థిపై చర్చ..

దానం నాగేందర్‌కు హైకోర్టు అనర్హత వేటు పడటంతో కాంగ్రెస్ తరఫున తదుపరి అభ్యర్థి ఎవరనే అంశంపై చర్చ మొదలైంది. దానం నాగేందర్‌నే మళ్లీ బరిలోకి దింపుతారా లేదా ప్రత్యామ్నాయ అభ్యర్థిని ఎంపిక చేస్తారా అనేది సుప్రీంకోర్టు విచారణ అనంతరం స్పష్టత వచ్చే అవకాశం ఉందని వార్తా

మిగతా 2లో

ట్యాంక్‌బండ్‌పై గణేశ్ నిమజ్జనానికి అనుమతించాలి.. బండి సంజయ్

- నిమజ్జనంపై ఆంక్షలు విధించడం దారుణమన్న కేంద్ర మంత్రి
- భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధుల అరెస్ట్‌పై అభ్యంతరం
- ఏటా ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనం నిర్వహించడం ఆనవాయితీ అని వ్యాఖ్య
- ఈసారి కూడా ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనానికి అనుమతి ఇవ్వాలని డిమాండ్
- శశిధర్ సహా అరెస్టైన వారిని బేషరతుగా విడుదల చేయాలని విజ్ఞప్తి

2లో

సంతోష్ రావు ఆస్తులపై రమ్యారావు సంచలన ఆరోపణలు

- కేటీఆర్‌కు వరుస ప్రశ్నలు
- వందల ఎకరాల్లో తమ వాటా ఎక్కడో చెప్పాలని కేటీఆర్‌ను ప్రశ్నించిన రమ్యారావు
- కుదురుపాకలో సంతోష్ కుటుంబానికి 8 ప్లాట్లు ఉన్నాయని ఆరోపణ
- 2018 రాజ్యసభ అఫిడవిట్‌లో ఒక్క ప్లాట్‌నే చూపించారని వ్యాఖ్య
- మార్కుక్, బంజారాహిల్స్, కొండాపూర్ ఆస్తులపై ప్రశ్నలు
- నానక్‌రామ్‌గూడలో సంతోష్ భార్య పేరుతో భవనంపై నిలదీత

పొలిటికల్ డెస్క్, ప్రజా వాయిస్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా పాలన చేస్తూ ప్రజల మద్దతు పొందుతుంటే.. బీఆర్ఎస్ మాత్రం '22ఏ' అంశంతో రాజకీయాలు చేస్తోందని టీపీసీసీ సీనియర్ నేత రమ్యారావు విమర్శించారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం అడ్డగోలుగా ఆస్తులు కూడబెట్టిందని ఆమె ఆరోపించారు. సోమవారం గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన రమ్యారావు.. కేటీఆర్‌పై పలు ప్రశ్నలు సంధించారు.

వందల ఎకరాల్లో మా వాటా ఏది..

తమ కుటుంబానికి వందల ఎకరాల భూములు ఉన్నాయని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై రమ్యారావు స్పందించారు. తాను కేసీఆర్ అన్న కుమార్తెనని, కేటీఆర్ చెబుతున్న వందల

మిగతా 2లో

మాదన్నపేట్‌లో గణేష్ అన్నదానంలో కలకలం

- మాంసం వేయడంతో ఉద్రిక్తత
- 2 బీహెచ్‌కే హౌజింగ్ సొసైటీ వద్ద ఘటన
- అన్నదాన కార్యక్రమంలో మాంసం వేసినట్లు ఆరోపణ
- ఆగ్రహంతో స్థానికులు, భక్తుల నిరసన
- ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- పలు సెక్షన్ల కింద కేసు.. రిమాండ్‌కు తరలింపు

సాగునీటి ప్రాజెక్టులకు నిధుల వరద

- భూసేకరణకు రూ.6 వేల కోట్లు
- పెండింగ్ భూసేకరణపై కలెక్టర్లతో మంత్రుల వీడియో సమావేశం
- ఇప్పటికే రూ.2,550 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- 2026-27లో రూ.6 వేల కోట్ల వరకు కేటాయింపు
- లబ్ధిదారులకు పరిహారం వెంటనే చెల్లించాలని ఆదేశం
- రైతులకు న్యాయం జరిగేలా భూసేకరణ చేపట్టాలని సూచన

హైదరాబాద్, ప్రజా వాయిస్: రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, అటవీ భూముల పరిహారం, పునరావాసం-పునరావాస పునరుద్ధరణ పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ అంశాలపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

భూసేకరణకు రూ.6 వేల కోట్లు..

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, పునరావాస పనులకు అవసరమైన నిధులను పూర్తిస్థాయిలో విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి అంగీకరించినట్లు తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో భూసేకరణ కోసం రూ.6 వేల కోట్ల వరకు నిధులు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే రూ.1,050 కోట్లు, తాజాగా మరో రూ.1,500 కోట్లు కలిపి మొత్తం రూ.2,550 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు.

లబ్ధిదారులకు పరిహారం చెల్లించాలి..

విడుదల చేసిన రూ.2,550 కోట్లలో అధిక భాగం ఇప్పటికీ అధికారుల ఖాతాల్లోనే ఉండి లబ్ధిదారులకు చేరకపోవడం ఆందోళనకరమని మంత్రి అన్నారు. జిల్లా కలెక్టర్లు భూసేకరణ లబ్ధిదారులకు పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని ఆదేశించారు. నిధులు సరిపోకపోయినా, ఇతర కారణాలతో చెల్లింపులు సాధ్యం కాకపోయినా ఆ వివరాలను ప్రభుత్వానికి పంపి అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు.

ప్రత్యేక అధికారులకు బాధ్యతలు..

విడుదలైన నిధులను అధికారుల వద్ద ఉంచి పనులను పెండింగ్‌లో పెట్టవద్దని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. భూసేకరణ పనులకు

మిగతా 2లో

బండ్లగూడ ఆర్టీవో కార్యాలయంలో ఏసీబీ సోదాలు

- ముగ్గురు అధికారులపై సస్పెన్షన్ వేటు
- వాహనదారుల ఫిర్యాదులతో రంగంలోకి దిగిన ఏసీబీ
- కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన అధికారులు
- చాంబర్‌లో నగదు లెక్కిస్తున్న కానిస్టేబుల్ అరుణ్
- రవాణా శాఖలో ముగ్గురు అధికారులపై సస్పెన్షన్ వేటు
- వైరల్‌గా మారిన నగదు లెక్కింపు దృశ్యాలు

2లో



మాదన్నపేట్‌లో గణేష్ అన్నదానంలో కలకలం

మాదన్నపేట్, ప్రజా వాయిస్: హైదరాబాద్‌లో గణేష్ నిమజ్జనాలు, అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్న వేళ మాదన్నపేట్‌లో ఉద్రిక్తత చోటుచేసుకుంది. మాదన్నపేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 2 బీహెచ్‌కే హౌజింగ్ సొసైటీ వద్ద నిర్వహించిన గణేష్ అన్నదాన కార్యక్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు మాంసం వేసినట్లు ఆరోపణలు రావడంతో కలకలం రేగింది. దీంతో స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని నిరసనకు దిగారు.

ఘటనతో ఉద్రిక్తత..

అన్నదాన కార్యక్రమంలో మాంసం వేసిన విషయం తెలియడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద సంఖ్యలో ప్రజలు సంఘటనా స్థలానికి చేరుకుని నిరసన చేపట్టారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు.

రంగంలోకి డీసీపీ కిరణ్ ఖరే..

చార్మినార్ జోన్ డీసీపీ కిరణ్ ఖరే నేతృత్వంలో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. స్థానికులతో మాట్లాడి పరిస్థితిని సామరస్యంగా చక్కదిద్దారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని డీసీపీ స్పష్టం చేశారు.

ముగ్గురు అదుపులో..

ఈ ఘటనకు సంబంధించి అదే హౌజింగ్ సొసైటీలో నివాసం ఉంటున్న మహమ్మద్ ఇమ్రాన్ ఖురేషీ, అర్షియా బేగం, సమీనా అనే ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పుకార్లు నమ్మొద్దన్న పోలీసులు..

ఘటన నేపథ్యంలో స్థానికులు, హిందూ సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. మతపరమైన కార్యక్రమాల వద్ద మాంసాహార పదార్థాలను వేయడం తమ మనోభావాలను దెబ్బతీసిందని పేర్కొంటూ నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని, ఆ ప్రాంతంలో రాకపోకలు సాధారణంగా కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో పుకార్లు నమ్మవద్దని, నిర్ధారణ లేని సమాచారాన్ని ప్రచారం చేయవద్దని ప్రజలకు సూచించారు.

వాహనం చోరీ అయితే ఇక టెన్షన్ అవసరం లేదు

- క్షణాల్లో గుర్తించే సరికొత్త సాంకేతికత
- చోరీ వాహనాల గుర్తింపునకు 'టీజీ ఈ-టికెట్' యాప్
- రాష్ట్రంలో ఏటా 7–8 వేల వాహనాల చోరీ కేసులు
- చోరీ వాహనాల్లో 90 శాతం వరకు ద్విచక్ర వాహనాలే
- ఫొటో తీస్తే చాలు.. చోరీ వాహనమో కాదో వెంటనే గుర్తింపు
- హైదరాబాద్‌లో ఇప్పటివరకు 90కిపైగా వాహనాల గుర్తింపు

హైదరాబాద్, ప్రజా వాయిస్: ఎంతో కష్టపడి కొనుగోలు చేసిన బైక్ లేదా కారు చోరీకి గురైతే వాహన యజమానులు తీవ్ర ఆందోళనకు గురవుతారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన తర్వాత వాహనం ఎప్పుడు దొరుకుతుందోనని ఎదురుచూడాల్సి ఉంటుంది. అయితే ఇకపై చోరీకి గురైన వాహనాలను వేగంగా గుర్తించేందుకు తెలంగాణ పోలీసులు సాంకేతికతను వినియోగిస్తున్నారు. ఇందులో భాగంగా చోరీ వాహనాలను గుర్తించేందుకు 'టీజీ ఈ-టికెట్' యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.

ఏటా వేల వాహనాల చోరీ..

రాష్ట్రంలో ఏటా సుమారు 7 వేల నుంచి 8 వేల వరకు వాహన చోరీ కేసులు నమోదవుతున్నాయి. వీటిలో దాదాపు 90 శాతం వరకు ద్విచక్ర వాహనాలే ఉంటున్నాయి. ఒక ప్రాంతంలో వాహనాలను చోరీ చేసి మరో ప్రాంతానికి తరలించే ముఠాల కదలికలను గుర్తించేందుకు పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు.

ఫిర్యాదు చేస్తే డేటాబేస్‌లో నమోదు..

వాహనం చోరీకి గురైన వెంటనే యజమాని సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించుకోవాలి. ఎఫ్ఐఆర్ నమోదైన వెంటనే వాహనం నంబర్, నమూనా తదితర వివరాలు సంబంధిత డేటాబేస్‌లో చేరతాయి. దీంతో చోరీకి గురైన వాహనాన్ని గుర్తించే అవకాశం మరింత సులభమవుతుంది.

ఫొటో తీస్తే చాలు..

ట్రాఫిక్, శాంతిభద్రతల పోలీసులు తమ ట్యాబ్‌లలో ఈ యాప్‌ను వినియోగిస్తున్నారు. వాహన తనిఖీల సమయంలో అనుమానాస్పద వాహనం కనిపిస్తే దాని ఫొటో తీసి యాప్‌లో పరిశీలిస్తే సరిపోతుంది. ఆ వాహనం ఇప్పటికే చోరీ కేసులో నమోదై ఉంటే యాప్ వెంటనే హెచ్చరిక జారీ చేస్తుంది. దీంతో పోలీసులు వాహనాన్ని అదుపులోకి తీసుకుని తదుపరి దర్యాప్తు చేపట్టవచ్చు.

ఖైరతాబాద్‌లో కొత్త రాజకీయం

మొదటి పేజీ తరువాయి

కథనాలు పేర్కొంటున్నాయి.

రోహిన్ రెడ్డి పేరు తెరపైకి..

కాంగ్రెస్‌లో రోహిన్ రెడ్డి పేరు కూడా వినిపిస్తోంది. ఆయనతో పాటు విజయారెడ్డి, విజయలక్ష్మి పేర్లు కూడా చర్చలో ఉన్నట్లు కథనాలు వెల్లడించాయి. అయితే వీటిలో ఏ పేరుపైనా పార్టీ అధికారికంగా తుది నిర్ణయం ప్రకటించినట్లు ఆధారం లేదు.

సుప్రీం విచారణపై ఉత్కంఠ..

దానం నాగేందర్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై సెప్టెంబర్ 23న విచారణ జరగనుంది. పార్టీ ఫిరాయింపుల కేసులో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఆయన ఈ పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు నిర్ణయం అనంతరం ఖైరతాబాద్ ఉప ఎన్నికపై తదుపరి రాజకీయ పరిణామాలు, కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై సర్వే

- నేడు కీలకంగా రెవెన్యూ నివేదిక
- సర్వే నంబర్ 325లో 388.05 ఎకరాల భూముల పరిశీలన
- కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాల్లో ప్రభుత్వ, అసైన్డ్ భూములపై ఆరా
- రైతులకు నోటీసులు.. ఆధారాలతో హాజరు కావాలని ఆదేశం
- నాలుగు బృందాలతో కొనసాగుతున్న భూసర్వే
- భూముల హద్దులు, యాజమాన్యంపై నివేదికకు సిద్ధమవుతున్న అధికారులు

సిద్దిపేట, ప్రజా వాయిస్: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసర భూముల వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి, శివారు వెంకటాపూర్, వరదరాజుపూర్ ప్రాంతాల్లో రెవెన్యూ, సర్వే అధికారులు భూముల రికార్డులు, హద్దులను పరిశీలిస్తున్నారు. సర్వే నంబర్ 325లోని 388 ఎకరాలకుపైగా భూములపై ఈ సర్వే కొనసాగుతోంది.

ప్రభుత్వ, అసైన్డ్ భూములపై ఆరా..

సర్వే నంబర్ 325లోని భూముల్లో ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు ఎంతమేర ఉన్నాయి.. ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఉన్నాయి అనే అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. డిజిటల్ సర్వే పద్ధతులతో భూముల హద్దులను గుర్తిస్తున్నారు. ఈ భూముల్లో సుమారు 60 ఏళ్ల క్రితం పేద దళితులకు కేటాయించిన అసైన్డ్ భూములు కూడా ఉన్నట్లు అధికారుల పరిశీలనలో వెల్లడైంది.

రైతులకు నోటీసులు..

సర్వే నంబర్ 325లో భూములు కలిగి ఉన్న రైతులకు అధికారులు నోటీసులు జారీ చేశారు. తమ ఆధీనంలోని భూములకు సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఇతర చట్టబద్ధమైన పత్రాలతో అధికారుల ఎదుట హాజరుకావాలని సూచించారు. సోమవారం నాటికి 204 మంది రైతులకు సంబంధించిన 388 ఎకరాలకుపైగా భూములపై సర్వే కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

నాలుగు బృందాలతో సర్వే..

రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి భూములను పరిశీలిస్తున్నారు. సోమవారం ఒక్కరోజే 80 మంది రైతుల భూములను సర్వే చేసినట్లు సమాచారం. మిగిలిన రైతులకు నోటీసులు అందించి వారి భూముల హద్దులను కూడా పరిశీలించేందుకు అధికారులు చర్యలు కొనసాగిస్తున్నారు.

వెంకటాపూర్ రైతుల అభ్యంతరాలు..

సర్వే నంబర్ 325లోని భూముల్లో సుమారు 180 ఎకరాలు తమ గ్రామ పరిధికి చెందినవేనని శివారు వెంకటాపూర్ రైతులు చెబుతున్నారు. పాత రెవెన్యూ రికార్డుల ఆధారంగా భూముల హద్దులను నిర్ధారించాలని వారు కోరుతున్నారు. దీంతో ఎర్రవల్లి, వెంకటాపూర్, వరదరాజుపూర్ గ్రామాల పరిధిలోని భూముల రికార్డులు, సరిహద్దులపైనా అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు.

నివేదిక తర్వాతే స్పష్టత..

ఎర్రవల్లి భూముల వ్యవహారంలో ప్రస్తుతం అధికారుల సర్వే, రికార్డుల పరిశీలన కొనసాగుతోంది. భూముల వాస్తవ యాజమాన్యం, ప్రభుత్వ లేదా అసైన్డ్ భూముల విస్తీర్ణం, ప్రస్తుత ఆక్రమణలు వంటి అంశాలపై పూర్తి వివరాలు సేకరించిన తర్వాతే తదుపరి చర్యలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కాగా, కేసీఆర్ ఫామ్‌హౌస్‌లోనే అసైన్డ్ భూములు ఉన్నట్లు తేలిందనే ప్రచారానికి ప్రస్తుతం అధికారిక తుది నివేదిక వెలువడలేదు. తాజాగా అందుబాటులో ఉన్న నివేదికల ప్రకారం అధికారులు ప్రధానంగా ఫామ్‌హౌస్ పరిసరంలోని సర్వే నంబర్ 325లో 388 ఎకరాల భూములపై సర్వే నిర్వహిస్తున్నారు.

సంతోష్ రావు ఆస్తులపై రమ్యారావు సంచలన ఆరోపణలు

మొదటి పేజీ తరువాయి

ఎకరాల్లో తమ వాటా ఎక్కడ ఉందో చెప్పాలని ప్రశ్నించారు. తాను, కవిత కుటుంబ సభ్యులమని పేర్కొంటూ.. సంతోష్ రావు కేసీఆర్‌కు ఎందుకు సన్నిహితంగా ఉన్నారో, ఆయన ఆస్తులపై కేటీఆర్ ఎందుకు స్పందించడం లేదో ప్రశ్నించారు.

కుదురుపాకలో 8 ప్లాట్ల ఆరోపణ..

2013లో సంతోష్ రావుకు క్వారీలో 25 శాతం వాటా ఉండేదని రమ్యారావు ఆరోపించారు. 2015లో ప్రాజెక్టు ముంపు పేరుతో కుదురుపాక గ్రామంలో సంతోష్ రావు, ఆయన కుటుంబ సభ్యులు కలిసి 8 ప్లాట్లు పొందారని ఆమె పేర్కొన్నారు. 2018లో రాజ్యసభకు ఎన్నికైన సందర్భంగా సమర్పించిన అఫిడవిట్‌లో మాత్రం ఒక్క ప్లాట్‌నే చూపించారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని ప్రశ్నించారు.

ఆస్తులు ఎలా వచ్చాయంటూ నిలదీత..

కరీంనగర్‌లో ఉన్న సమయంలో సంతోష్ రావుకు పెద్దగా ఆస్తులు లేవని చెబుతూ.. ఇప్పుడు కోట్ల రూపాయల ఆస్తులు ఎలా వచ్చాయని రమ్యారావు ప్రశ్నించారు. మార్కుక్‌లో 9 ఎకరాల భూమి, బంజారాహిల్స్ రోడ్ నంబర్ 14లో భూమి, ఇల్లు, కొండాపూర్‌లో ఆస్తులు ఎలా వచ్చాయని నిలదీశారు. నానక్‌రామ్‌గూడలో సంతోష్ రావు భార్య రోహిణి పేరుతో ఉన్నట్లు ఆమె పేర్కొన్న వాణిజ్య భవనంపైనా ప్రశ్నలు సంధించారు.

ఆరోపణలపై వివరణ ఇవ్వాలని డిమాండ్..

సంతోష్ రావు ఆస్తుల విషయంలో కేటీఆర్ మౌనం వహిస్తున్నారని రమ్యారావు విమర్శించారు. అక్కను, చెల్లిని ఇంటి నుంచి బయటకు పంపి సంతోష్ రావును ఎందుకు పక్కన పెట్టుకున్నారని ప్రశ్నించారు. కాగా, రమ్యారావు చేసిన ఈ ఆరోపణలను స్వతంత్రంగా నిర్ధారించే ఆధారాలు ప్రస్తుత వార్తా నివేదికల్లో వెల్లడికాలేదు.

కాంగ్రెస్ నేతల కాన్వాయ్‌పై రాళ్ల దాడి

- మంత్రి పొంగులేటి అనుచరుల కార్లే టార్గెట్
- నరేష్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి వాహనాలపై రాళ్ల దాడి
- అద్దాలు ధ్వంసం.. తృటిలో తప్పిన ప్రమాదం
- దుండగుల కోసం పోలీసుల గాలింపు
- రాజకీయంగా కలకలం

ప్రజా వాయిస్,ఖమ్మం: తిరుమలాయపాలెం మండలంలో కాంగ్రెస్ నేతల కాన్వాయ్‌పై ఆదివారం రాత్రి రాళ్ల దాడి కలకలం రేపింది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరులు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు రామసహాయం నరేష్‌రెడ్డి, మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తంబూరి దయాకర్‌రెడ్డి ప్రయాణిస్తున్న వాహనాలపై గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో వాహనాల అద్దాలు ధ్వంసమయ్యాయి. వాహనాల్లో ఉన్న నేతలు తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు.మండలంలోని శుద్ధవాగు తండాలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాల్లో నరేష్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు ముగించుకుని తిరిగి వెళ్తుండగా మార్గమధ్యంలో కొందరు వ్యక్తులు మాటువేసి ఒక్కసారిగా కాన్వాయ్‌పై రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఊహించని ఘటనతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

పోలీసుల దర్యాప్తు ముమ్మరం

సమాచారం అందుకున్న తిరుమలాయపాలెం పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఘటనపై కేసు నమోదు చేసి దాడికి పాల్పడిన వ్యక్తులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. దాడికి కారణం ఏమిటి? ముందస్తు ప్రణాళికతోనే దాడి చేశారా? అనే కోణాల్లోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

రాజకీయంగా వేడి

మంత్రి పొంగులేటి అనుచరులుగా ఉన్న కాంగ్రెస్ నేతల వాహనాలపై రాళ్ల దాడి జరగడంతో నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఘటన వెనుక రాజకీయ కారణాలున్నాయా, ఇతర కారణాలేమైనా ఉన్నాయా అన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

బండ్లగూడ ఆర్టీవో కార్యాలయంలో ఏసీబీ సోదాలు

హైదరాబాద్, ప్రజా వాయిస్: హైదరాబాద్‌లోని బండ్లగూడ ఆర్టీవో కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆర్టీవో కార్యాలయంలో అధికారులు, సిబ్బంది తీరుపై వాహనదారుల నుంచి పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఏసీబీ రంగంలోకి దిగినట్లు సమాచారం.

కాగితాలు ఉన్నా తిప్పుతున్నారని ఆరోపణలు..

తమ వద్ద అన్ని సరైన పత్రాలు ఉన్నప్పటికీ కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని పలువురు వాహనదారులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈ ఫిర్యాదులపై ఏసీబీ అధికారులు కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు.

నగదు లెక్కింపు దృశ్యాలు వైరల్..

ఈ క్రమంలో కానిస్టేబుల్ అరుణ్ కార్యాలయంలోని ఒక చాంబర్‌లో నగదు లెక్కిస్తున్న దృశ్యాలు వీడియోలో రికార్డయ్యాయి. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో రవాణా శాఖ ఉన్నతాధికారులు స్పందించారు.

ముగ్గురిపై సస్పెన్షన్ వేటు..

బండ్లగూడ ఆర్టీవో కార్యాలయ ఘటనలో ముగ్గురు అధికారులపై రవాణా శాఖ కమిషనర్ సస్పెన్షన్ వేటు వేశారు. ఎంవీఐ భీమ్ సింగ్, ఆర్టీవో రామచందర్, కానిస్టేబుల్ అరుణ్‌లపై చర్యలు తీసుకున్నారు. ఏసీబీ తనిఖీల అనంతరం రవాణా శాఖ ఉన్నతాధికారుల సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

సాగునీటి ప్రాజెక్టులకు నిధుల వరద

మొదటి పేజీ తరువాయి

ప్రత్యేక అధికారులను నియమించి బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు. నీటిపారుదల శాఖ ప్రధాన ఇంజినీర్లు, రెవెన్యూ అధికారులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ భూసేకరణ పురోగతిని ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు.

రైతులతో నేరుగా చర్చించాలి..

ఇప్పటికే విడుదలైన రూ.2,550 కోట్లను పూర్తిగా వినియోగించిన అనంతరం అవసరాన్ని బట్టి అదనపు నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. భూసేకరణ ప్రక్రియలో రైతుల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. కలెక్టర్లు, ఉన్నతాధికారులు రైతులతో నేరుగా చర్చించి స్నేహపూర్వక వాతావరణంలో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.

మార్కెట్ విలువకు సమీపంగా పరిహారం..

భూసేకరణ నిబంధనల ప్రకారం ప్రక్రియ కొనసాగాలని, రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. పరిహారం సాధ్యమైనంత వరకు మార్కెట్ విలువకు సమీపంగా ఉండేలా చూడాలని సూచించారు. నీటిపారుదల ప్రాజెక్టుల కోసం ముఖ్యమంత్రి బడ్జెట్‌కు అదనంగా ఇతర వనరుల నుంచి నిధులు సమకూర్చి మంజూరు చేస్తున్నందున అధికారులు భూసేకరణ, అటవీ భూముల పరిహారం, పునరావాస పనులను అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.

ట్యాంక్‌బండ్‌పై గణేశ్ నిమజ్జనానికి అనుమతించాలి.. బండి సంజయ్

హైదరాబాద్, ప్రజా వాయిస్: హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి విధించిన ఆంక్షలపై వివాదం కొనసాగుతోంది. నిమజ్జనానికి అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు ట్యాంక్‌బండ్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బారికేడ్లను తొలగించే ప్రయత్నం చేయడంతో పోలీసులు అడ్డుకుని పలువురు ప్రతినిధులను అదుపులోకి తీసుకున్నారు.

నిమజ్జనానికి అనుమతి ఇవ్వాలి..

ఈ పరిణామంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ స్పందించారు. ట్యాంక్‌బండ్‌పై గణేశ్ నిమజ్జనాన్ని నిషేధించడం దారుణమని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఏడాది ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని, ఈసారి కూడా అక్కడ నిమజ్జనానికి అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అరెస్టులపై అభ్యంతరం..

ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులను అరెస్ట్ చేయడం సరికాదని బండి సంజయ్ అన్నారు. సమితి ప్రధాన కార్యదర్శి శశిధర్‌తో పాటు అరెస్టు చేసిన వారందరినీ బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ట్యాంక్‌బండ్ వద్ద ఉద్రిక్తత..

నిమజ్జనంపై ఆంక్షలను వ్యతిరేకిస్తూ ఉత్సవ సమితి ప్రతినిధులు ట్యాంక్‌బండ్ వద్ద ఆందోళనకు దిగారు. బారికేడ్లను తొలగించే ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. దీంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

ఆంక్షలపై అధికారుల వాదన..

హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనాలపై విధించిన ఆంక్షలు పర్యావరణ పరిరక్షణ, కోర్టు ఆదేశాల నేపథ్యంలో అమలు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు ట్యాంక్‌బండ్ సంప్రదాయ నిమజ్జన ప్రాంతమని ఉత్సవ సమితి ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఈ అంశంపై ప్రభుత్వం, ఉత్సవ సమితి మధ్య భిన్నాభిప్రాయాలు కొనసాగుతున్నాయి.

ఐటీ మంత్రి నియోజకవర్గంలో సిగ్నల్ కష్టాలు

- 'బ్లాక్ హోల్'లో మంథని సరిహద్దు గ్రామాలు
- సాఫ్ట్ వేర్ ఉద్యోగుల తిప్పలు.. ఇంటర్నెట్ కోసం పట్టణానికి ప్రయాణం
- శాస్త్రుల్లపల్లి రోడ్డు అధ్వానం.. నిత్యం ప్రమాదాల ముప్పు
- పరిష్కారానికై ప్రజా వాయిస్ ద్వారా మంత్రి శ్రీధర్ బాబుకు విజ్ఞప్తి

ప్రజా వాయిస్ మంథని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న మంథని నియోజకవర్గంలో పలు గ్రామాలు నేటికీ ప్రాథమిక సదుపాయాల లేమితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. నియోజకవర్గ కేంద్రమైన మంథనికి కేవలం ఐదారు కిలోమీటర్ల పరిధిలోనే ఉన్న శాస్త్రుల్లపల్లి, కాకర్లపల్లి వంటి గ్రామాలు సరైన మొబైల్ నెట్‌వర్క్ సిగ్నల్స్ లేక బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయిన పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. మంథని ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం శ్రమిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు స్పందించి తమ గ్రామాల కష్టాలను తీర్చాలని గ్రామస్థులు ప్రజా వాయిస్ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నారు.

సాఫ్ట్ వేర్ ఉద్యోగులకు తిప్పలు..

సిగ్నల్ కోసం మంథనికి పయనం!గ్రామాల్లో సరైన నెట్‌వర్క్ కవరేజ్ లేకపోవడం వల్ల విద్యార్థులు, యువతతో పాటు హైదరాబాద్, ఇతర మెట్రో నగరాల నుండి స్వగ్రామాలకు వచ్చిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కాకర్లపల్లి గ్రామానికి చెందిన బడుగు మహేష్ అనే యువకుడు మాట్లాడుతూ, డిజిటల్ శకంలో కూడా గ్రామాల్లో కనీస సిగ్నల్స్ లేకపోవడం వల్ల ఆన్‌లైన్ చదువులు, పోటీ పరీక్షల ప్రిపరేషన్ మరియు డిజిటల్ లావాదేవీలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని తెలిపారు. వర్క్ ఫ్రమ్ హోమ్ చేసుకునే ఉద్యోగులు కూడా పనుల నిమిత్తం ప్రతిరోజూ ఇంటర్నెట్ సిగ్నల్ కోసం మంథని పట్టణానికి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధ్వానంగా రహదారి.. పెరిగిన ప్రమాదాలునెట్‌వర్క్ సమస్యతో పాటు శాస్త్రుల్లపల్లి గ్రామానికి రాకపోకలు సాగించే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని పెద్ద పెద్ద గుంతలమయంగా మారడం మరో పెద్ద సమస్యగా తయారైంది. గతంలో వేసిన రోడ్డు కాలక్రమేణా దెబ్బతినడంతో ద్విచక్ర వాహనదారులు, బాటసారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అత్యవసర వైద్య పరిస్థితుల్లో అంబులెన్సులు సైతం గ్రామానికి రావడానికి రాకపోకల సమస్య అడ్డంకిగా మారుతోందని గ్రామస్థులు చెబుతున్నారు.

మంత్రి శ్రీధర్ బాబుకు విజ్ఞప్తి.. సానుకూల స్పందనపై ఆశలు

ఈ సమస్యలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ప్రజా వాయిస్ ద్వారా గ్రామస్థులంతా ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకి ప్రత్యేక విజ్ఞప్తి చేస్తున్నారు. మంథని నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న మంత్రి, శాస్త్రుల్లపల్లి, కాకర్లపల్లి గ్రామాల్లో మొబైల్ సిగ్నల్స్ మెరుగుపడేలా సంబంధిత టెలికాం సంస్థలను ఆదేశించి కొత్త టవర్లు మంజూరు చేయించాలని కోరుతున్నారు. అలాగే శాస్త్రుల్లపల్లి దెబ్బతిన్న రోడ్డుకు నిధులు మంజూరు చేసి నూతన రహదారి నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజా సమస్యలపై ఎల్లప్పుడూ సానుకూలంగా స్పందించే మంత్రి శ్రీధర్ బాబు ప్రజా వాయిస్ ద్వారా తెలుసుకున్న తమ గ్రామాల పరిస్థితిపై త్వరితగతిన స్పందించి, సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తారని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

యువజన కాంగ్రెస్ కదలాలి.. ఎమ్మెల్సీ గెలుపు సాధించాలి

- గ్రాడ్యుయేట్ ఓటర్లను నమోదు చేయించేలా క్షేత్రస్థాయిలో కార్యాచరణ
- యువజన కాంగ్రెస్ శ్రేణులకు రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి దిశానిర్దేశం

మొయినాబాద్ (ప్రజావాయిస్):రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా యువజన కాంగ్రెస్ శ్రేణులు పని చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి పిలుపునిచ్చారు. గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని చురుగ్గా పనిచేయాలని సూచించారు. రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి అధ్యక్షతన మొయినాబాద్ లో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, రాష్ట్ర ఇన్‌చార్జ్ ఖాలీద్, సహాయ ఇన్‌చార్జ్ భవ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో యువజన కాంగ్రెస్ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి, రాబోయే కార్యక్రమాలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు.ఈ నెల 29న హైదరాబాద్‌లోని రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించనున్న గిగ్ వర్కర్ల సమావేశాన్ని విజయవంతం చేయాలని శివచరణ్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో మొయినాబాద్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు లక్ష్మీకాంత్, గుర్రం శ్యామ్‌చరణ్ రెడ్డి, నియోజకవర్గాల అధ్యక్షులు మహిపాల్ యాదవ్, మహేశ్ గౌడ్, సికిందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనతా వైన్స్‌లో 'అధిక' దందా!

- ఎమ్మార్పీ కంటే ఎక్కువ వసూలు చేస్తున్నారంటూ మద్యం ప్రియుల ఆగ్రహం
- పట్టిక బోర్డులకే పరిమితం
- ఆబ్కారీ శాఖ నిద్రను వీడి స్పందించాలంటున్న వినియోగదారులు

ప్రజా వాయిస్ మంథని పట్టణంలోని 'జనతా వైన్స్'లో మద్యం బాటిళ్లపై ఉన్న నిర్ణీత ధరల కంటే అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని పలువురు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. దుకాణంలో ప్రదర్శించిన ధరల పట్టిక కేవలం చూపించడానికే పరిమితమైందని, బిల్లు వేసే సమయంలో మాత్రం అదనపు బాదుడు బాదుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నిబంధనల ప్రకారం ప్రదర్శన బోర్డులో పేర్కొన్న ధరలకే మద్యం విక్రయించాల్సి ఉండగా, నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యసనపరుల జేబులు గుల్ల చేస్తున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి, సదరు వైన్స్ షాప్‌లో ఆకస్మిక తనిఖీ లు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఎమ్మార్పీని మించి విక్రయాలు జరుపుతున్నట్లు తేలితే నిబంధనల ప్రకారం వైన్స్ లైసెన్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, నిరంతరం పర్యవేక్షణ ద్వారా ఇలాంటి దోపిడీకి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

సంత నిర్వహణ మాది.. వసూళ్లు వారివా?

- మేకల సంత ఆదాయం పంచాయతీకే ఇవ్వాలంటూ అధికారులకు వినతి

ప్రజా వాయిస్/మోమిన్‌పేట్: మోమిన్ పేట్ గ్రామపంచాయతీ పరిధిలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న మేకల వారపు సంత ఆదాయాన్ని గ్రామపంచాయతీకే అందేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులు కోరారు.

ఈ మేరకు గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామపంచాయతీ సమావేశం నం.11లో తీర్మానం చేసి, మండల అభివృద్ధి అధికారికి వినతిపత్రం అందజేశారు.గ్రామపంచాయతీ పరిధిలోని స్థలంలో మేకల సంత నిర్వహిస్తున్నప్పటికీ, సంతకు సంబంధించిన వసూళ్లను మార్కెట్ కమిటీ వారు చేపడుతున్నారని పంచాయతీ అధికారులు పేర్కొన్నారు. సంత అనంతరం ఏర్పడే చెత్తాచెదారం, వ్యర్థాలను మాత్రం గ్రామపంచాయతీ సిబ్బందే శుభ్రం చేస్తున్నారని తెలిపారు.తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం–2018 ప్రకారం మేకల సంత ద్వారా వచ్చే ఆదాయం గ్రామపంచాయతీకి చెందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు తగిన నిర్ణయం తీసుకోవాలని పంచాయతీ ప్రతినిధులు సర్పంచ్ సంధ్యా సుభాష్ వార్డు మెంబర్ అఫ్సర్ పంచాయతీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

యూరియా బుకింగ్‌కు బ్రేక్.. జిల్లాలో రైతుల అవస్థలు!

- పది రోజులుగా మీసేవ కేంద్రాల్లో సేవలకు అంతరాయం
- కేంద్రాల్లో జియో లొకేషన్ సమస్యతో లాగిన్ లు ఓపెన్ కాక ఇబ్బందులు
- ప్రత్యామ్నాయ మార్గం చూపాలని రైతుల విజ్ఞప్తి

ప్రజా వాయిస్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా: జిల్లాలోని పలు మండలాల్లో యూరియా బుకింగ్ సేవలకు అంతరాయం ఏర్పడటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు మీసేవ, సీఎస్‌సీ (కామన్ సర్వీస్ సెంటర్) కేంద్రాల నిర్వాహకులు తెలిపారు. గత పది రోజులుగా పలు అధీకృత మీసేవ కేంద్రాల్లో యూరియా బుకింగ్ సేవలు సక్రమంగా అందుబాటులో లేవని పేర్కొంటున్నారు.రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం మీసేవ కేంద్రాలతో పాటు కామన్ సర్వీస్ సెంటర్ (CSC) కేంద్రాల్లోనూ యూరియా బుకింగ్, ఫార్మర్ రిజిస్ట్రేషన్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే కొన్ని సీఎస్‌సీ కేంద్రాల్లో నిర్దిష్ట ప్రదేశానికి సంబంధించిన జియో లొకేషన్ అప్‌డేట్ సమస్యల కారణంగా లాగిన్‌లు ఓపెన్ కావడం లేదని నిర్వాహకులు చెబుతున్నారు.దీంతో యూరియా బుకింగ్ కోసం రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా నిరక్షరాస్యులైన రైతులు, కీప్యాడ్ మొబైల్ ఉన్నవారు, యాప్ నిర్వహణపై అవగాహన లేని రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కొంతమంది మీసేవ, సీఎస్‌సీ, ఇదే అవకాశంగా ఆన్‌లైన్ కేంద్రాల పలువురు నిర్వాహకులు వ్యక్తిగతంగా ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ సిటిజన్ యాప్‌లో రైతులకు రిజిస్ట్రేషన్ చేసి యూరియా బుకింగ్ ద్వారా అదనపు ఆదాయం పొందుతున్నారనే ఆరోపణలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. ఈ అంశంపై అధికారులు విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాలని రైతులు కోరుతున్నారు. జిల్లాలో యూరియా బుకింగ్ సేవల్లో ఏర్పడిన సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని, రైతులకు ప్రత్యామ్నాయ మార్గంలో బుకింగ్ సౌకర్యం కల్పించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పలు మండలాల రైతులు ప్రభుత్వాన్ని, జిల్లా ఉన్నతాధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆసుపత్రిలో డాక్టర్ లేక పేషెంట్లు విలవిలా!?

- గత పది రోజుల నుండి వైద్యులు లేక ఇబ్బందులు!
- బదిలీ అయ్యారో! లేక సెలవులు పెట్టారో! తెలియదు అంటున్న సిబ్బంది.?
- ఏజెన్సీ ప్రాంతం కావడంతో ప్రశ్నించేవాడు లేక విధి నిర్వహణలు!
- కలెక్టర్ సాప్ మా వైద్యశాల వైపు చూడరు?

ప్రజా వాయిస్ అశ్వారావుపేట ఆసుపత్రిలో డాక్టర్ లేక పేషెంట్లు విలవిలా!?గత పది రోజుల నుండి వైద్యులు లేక ఇబ్బందులు!బదిలీ అయ్యారో! లేక సెలవులు పెట్టారో! తెలియదు అంటున్న సిబ్బంది.?ఏజెన్సీ ప్రాంతం కావడంతో ప్రశ్నించేవాడు లేక విధి నిర్వహణలు!కలెక్టర్ సాప్ మా ఆసుపత్రి వైపు చూడరు?ప్రజా వాయిస్ అశ్వారావుపేటభద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని గుమ్మడవెల్లి గ్రామ సమీపంలో బచ్చు వారి గూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వైద్యులు లేక రోగులు ఇబ్బందులు గురవుతున్నారు గత పది రోజుల నుంచి డాక్టర్ లేక ఆసుపత్రికి కేవలం ఒక్కరే సిబ్బంది ఉండటం గమనర్హం గుమ్మడవెల్లికి చుట్టుపక్కల సుమారు ఐదు నుంచి పది గ్రామాలకి అతి సమీపంలో ఉన్న ప్రాథమిక వైద్యశాల అంతేకాకుండా ప్రమాదవశాత్తు ఏదైనా జరిగిన అశ్వారావుపేట చేరుకోవాలంటే సుమారు గంటల వ్యవధి పడుతుంది దీని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఆసుపత్రి నిర్మిస్తే వైద్యులు రాక రోగులు ఇక్కట్లు గురవుతున్నారని అంతేకాకుండా కేవలం ఒకరి సిబ్బంది ఉన్నప్పటికీ అరకొరి మందులతోనే కాలం వెళ్లిపోతున్నారు తప్ప ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే పరిస్థితి కనిపించడం లేదని ప్రజానీకం ప్రశ్నిస్తుంది మంగళవారం కొందరు మీడియా మిత్రులు ఆసుపత్రి సిబ్బంది గూర్చి వివరణ కోరెందుకు ప్రయత్నించగా సిబ్బంది ఒకరు ససేమేరా మాట్లాడేది లేదంటూ మౌనం వహించడం దురదృష్టకరంగా మారింది ఏది ఏమైనా ఏజెన్సీ ప్రాంతాల్లో అమాయక గిరిజనులకు ప్రభుత్వం వైద్యం అందించేందుకు తగు సిబ్బందిని మరియు పరికరాలు మందులు వంటి వస్తువులను అందుబాటులో తీసుకొచ్చినప్పటికీ వైద్యులు లేక రోగులు ఇక్కట్లు పడుతున్నారు అన్నమాట వాస్తవమేనని తేటతెల్లమవుతుంది జిల్లా కలెక్టర్ సాప్ మా బచ్చువారిగూడెం ప్రాథమిక వైద్యశాల నందు సందర్శించి సిబ్బంది కొరత లేకుండా చూడాలని గుమ్మడవెల్లి మరియు బచ్చువారిగూడెం గ్రామస్తులు కోరుకుంటున్నారు.

జీవో 76పై కాంగ్రెస్ చిల్లర డ్రామాలు

- ఎన్నికల లబ్ది కోసమే కమిటీల పేరిట నాటకాలు
- కార్మికుల సొంతింటి కల నెరవేర్చిన ఘనత కేసీఆర్ దే
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ , మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తీవ్ర ధ్వజం

ప్రజా వాయిస్ గోదావరిఖని సింగరేణి కార్మికుల సొంతింటి హక్కుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పచ్చి అబద్ధాలు చెబుతూ, డ్రామాలు ఆడుతోందని మాజీ మంత్రి, టిబిజికేఎస్ గౌరవ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌లు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జీవో నెంబర్ 76, జీవో 29ల ద్వారా గత బీఆర్ఎస్ ప్రభుత్వమే వేలాది మంది కార్మికులు, ప్రజలకు ఇళ్ల పట్టాలు అందించిందని... ఇప్పుడు కాంగ్రెస్ నేతలు కమిటీల పేరుతో కొత్త నాటకాలకు తెరలేపారని మండిపడ్డారు. సోమవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో టిబిజికేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వ్యాల్ల హరీష్‌రెడ్డిలతో కలిసి వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

కేసీఆర్ హయాంలోనే చారిత్రాత్మక నిర్ణయం

సింగరేణి ప్రాంతంలో దశాబ్దాలుగా నివాసముంటున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి గతంలో కేసీఆర్ ప్రభుత్వం జీవో 76, జీవో 29లను తీసుకొచ్చి దాదాపు 30,000 మందికి పట్టాల రూపంలో హక్కులు కల్పించిందని కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో సింగరేణి సంస్థను తీవ్ర సంక్షోభంలోకి నెడుతున్నారని, సోలార్ టెండర్లు, ఓబీ కాంట్రాక్టులు, బొగ్గు నిల్వల అవకతవకలతో వేల కోట్ల కుంభకోణాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అలాగే మెడికల్ బోర్డులను నీరుగార్చి కార్మికుల ఆరోగ్యాన్ని గాలికి వదిలేశారని, దీనిపై సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ప్రజలను మళ్లీ వంచించేందుకు కాంగ్రెస్ నాటకాలు

మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ.. సింగరేణి ప్రాంత ప్రజలను, కార్మికులను మళ్లీ మోసగించేందుకే కాంగ్రెస్ నాయకులు కొత్త డ్రామాలకు తెరలేపారని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో, బిఆర్ఎస్ హయాంలో విట్టల్ నగర్, 18 ఇంక్లైన్ కాలనీల వంటి అనేక ప్రాంతాల్లోని ప్రతి ఇంటికి సింగరేణి ద్వారా భూమి హక్కులు ఇప్పించి పట్టాల పంపిణీ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామని గుర్తుచేశారు. అప్పట్లో అప్లికేషన్లు పెట్టుకుని ఫీజులు చెల్లించిన అర్హులైన వారందరికీ పట్టాలు అందజేశామని తెలిపారు. అర్హులకు ఇంకా పట్టాలు అందకపోతే ఆ ప్రక్రియను కొనసాగించాలే తప్ప, పట్టాల పేరుతో రాజకీయం చేయడమేంటని ప్రశ్నించారు. ఒకవైపు చిన్నచిన్న వ్యాపారుల స్థలాలను, ఇళ్లను కూల్చివేస్తూ.. మరోవైపు కొత్తగా పట్టాలు ఇస్తామనడం పచ్చి మోసమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ వంచనను, నాటకాలను సింగరేణి ప్రాంత ప్రజలు గమనించాలని, వారి మోసాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు,టిబిజికేఎస్ నాయకులు, కార్పొరేటర్లు మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈనెల 25న నిర్వహించే కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో పారదర్శకత ఏదీ?

- ఈనెల నిర్వహించే సమావేశానికి మీడియాను అనుమతించాలి
- పత్రికా గ్యాలరీలోకి అనుమతించాలి
- నేరుగా లైవ్ ప్రసారాలు చేయాలి
- నోటీస్ బోర్డులో 'అజెండా' అందుబాటులో ఉంచాలి
- రామగుండం ప్రజల డిమాండ్

ప్రజా వాయిస్ గోదావరిఖని రామగుండం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో స్థానిక పాలన, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జరగనున్న కౌన్సిల్ సమావేశాల్లో పారదర్శకత కరువైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 25న నిర్వహించనున్న ద్వితీయ కౌన్సిల్ సమావేశం నేపథ్యంలో... గతంలో మాదిరిగానే మీడియాకు ప్రవేశం కల్పించకపోవడంపై పాత్రికేయులు, ప్రజా సంఘాల ప్రతినిధులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ధర్నాలు చేసిన నేతలే.. నేడు మౌనమా?

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మునిసిపల్ కౌన్సిల్ సమావేశాలకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులను అనుమతించకపోవడాన్ని నిరసిస్తూ ప్రస్తుత మేయర్ మాంకాలి స్వామితో పాటు పలువురు నాయకులు నాడు ధర్నాలు, ఆందోళనలు నిర్వహించిన విషయాన్ని ఈ సందర్భంగా పలువురు గుర్తు చేస్తున్నారు. సమాజంలో అత్యంత కీలకమైన పత్రికా రంగాన్ని పక్కన పెట్టి, సభలో ఏం జరుగుతుందో ప్రజలకు తెలియకుండా చేయడం సరికాదని అభిప్రాయపడుతున్నారు. అసెంబ్లీ, మండలి సమావేశాల తరహాలోనే మునిసిపల్ కౌన్సిల్ ప్రక్రియ కూడా పారదర్శకంగా సాగాలని, అందుకోసం మీడియా గ్యాలరీలోకి విలేకరులను అనుమతించడంతో పాటు నేరుగా లైవ్ ప్రసారాలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. నేటి సోషల్ మీడియా కాలంలో డిజిటల్ మీడియా, ఇన్ఫ్లుయెన్సర్లకు కూడా ప్రాధాన్యమిచ్చి ప్రజలకు విషయాలను స్పష్టంగా చేరవేయాల్సిన బాధ్యత పాలకవర్గంపై ఉందన్నారు.

అజెండా వివరాలు పబ్లిక్ డొమైన్ లో పెట్టాలి

కౌన్సిల్ సమావేశానికి ముందు చర్చించే అంశాలకు సంబంధించిన 'అజెండా' ప్రతిని పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని, మునిసిపల్ కార్యాలయ నోటీస్ బోర్డులో ప్రదర్శించాలని సూచిస్తున్నారు. అప్పుడే ఏ అంశాలపై చర్చ జరుగుతోంది, ప్రజాధనం ఏ విధంగా వెచ్చిస్తున్నారనే విషయాలు సామాన్య ప్రజలకు తెలుస్తాయన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలకవర్గం, మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, కమిషనర్ స్పందించి ఇప్పటికైనా మీడియా ప్రతినిధులను కౌన్సిల్ సమావేశాలకు అనుమతించి, పారదర్శక పాలనకు బాటలు వేయాలని రామగుండం పౌరులు, జనహిత కోరుతున్నారు.

మీ సేవా కేంద్రంమా.. ఎరువుల దుకాణమా.!

- ప్రజలకు ఆన్ లైన్ సేవలు అందాల్సిన చోట ఎరువుల బస్తాలు
- దరఖాస్తుదారులకు తప్పని అయోమయం..
- ఉద్యోగ నోటిఫికేషన్ల నేపథ్యంలో ఆన్ లైన్ సెంటర్లకు పెరిగిన రద్దీ
- కేంద్రం నిర్వహణపై విచారణ చేపట్టాలని స్థానికుల డిమాండ్

ప్రజా వాయిస్, బయ్యారం: ప్రజలకు వివిధ ప్రభుత్వ సేవలను ఆన్‌లైన్ ద్వారా అందించాల్సిన మీ సేవా కేంద్రం ఎరువుల విక్రయ కేంద్రంగా మారిందంటూ గార్ల మండలం సత్యనారాయణపురం గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం దరఖాస్తులు, ధ్రువపత్రాలు తదితర సేవల కోసం ప్రజలు వచ్చే కేంద్రంలో ఎరువుల బస్తాలు కనిపించడంతో దరఖాస్తుదారులు అవాక్కవుతున్నారని చెబుతున్నారు.ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పలు నోటిఫికేషన్లు జారీ చేయడంతో ఉద్యోగాలు, ఇతర సేవలకు దరఖాస్తు చేసుకునేందుకు యువత ఆన్‌లైన్ కేంద్రాలకు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలో సత్యనారాయణపురంలోని మీ సేవా కేంద్రం వద్ద మాత్రం దరఖాస్తు చేసుకోవాలా.. ఎరువులు కొనుగోలు చేయాలా అన్నట్లుగా పరిస్థితి నెలకొందని స్థానికులు పేర్కొంటున్నారు.ప్రజలకు సేవలందించాల్సిన మీ సేవా కేంద్రంలో ఎరువుల విక్రయాలు ఎందుకు జరుగుతున్నాయనే దానిపై అధికారులు విచారణ చేపట్టాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు. కేంద్రం నిర్వహణ, అక్కడ జరుగుతున్న కార్యకలాపాలపై సంబంధిత అధికారులు దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యార్థుల ఆందోళనకు తలొగ్గిన సర్కార్!

- పాలిటెక్నిక్ ల విలీనంపై వెనక్కి అడుగు
- 35 రోజుల పోరాటానికి ఫలితం
- హర్షం వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్
- ప్రభుత్వం స్పష్టమైన విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలని సూచన

ప్రజావాయిస్/వికారాబాద్ బ్యూరో: పాలిటెక్నిక్ విద్యార్థులు, అధ్యాపకులు 35 రోజులుగా సాగించిన పోరాటం ఫలించిందని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పేర్కొన్నారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను విలీనం చేయాలన్న ప్రతిపాదనపై ప్రభుత్వం వెనక్కి తగ్గడం స్వాగతించదగిన పరిణామమన్నారు.ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ఇకపై సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగనున్నాయని, సాంకేతిక విద్యాశాఖ కమిషనరేట్, స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ యథాతథంగా కొనసాగనున్నట్లు స్పష్టత రావడం విద్యార్థులు, అధ్యాపకులకు ఊరటనిచ్చే అంశమన్నారు.డిప్లొమా కోర్సుల నిర్వహణలో ప్రస్తుత విధానాన్ని కొనసాగించడం, ఏఐసిటిఈ నిబంధనలు, పరీక్షలు, అకడమిక్ విధానాలపై స్పష్టత ఇవ్వడం విద్యార్థుల పోరాటానికి లభించిన ఫలితంగా భావించవచ్చన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని శాంతియుతంగా పోరాడిన విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులను అభినందించారు.అధ్యాపకులు చేపట్టిన సహాయ నిరాకరణ కార్యక్రమం కూడా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు ఐక్యంగా 35 రోజుల పాటు చేసిన పోరాటం కారణంగానే ప్రభుత్వం పునరాలోచనకు వచ్చిందని పేర్కొన్నారు.విద్యార్థుల విద్యా హక్కులు, భవిష్యత్తు, ఉద్యోగ అవకాశాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం స్పష్టమైన విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలని డాక్టర్ మెతుకు ఆనంద్ కోరారు.

దుకాణాల వేలం పాట ఎప్పుడు??

- ఐదు నెలలు గడుస్తున్న వేలంపాట జరగని వైనం
- పంచాయతీ ఆదాయానికి గండి
- జిల్లా, మండల అధికారులు మౌనం
- నోటీసులు ఇచ్చినా ఫలితం శూన్యం

ప్రజా వాయిస్ బూర్గుంపాడు బూర్గుంపాడు గ్రామ పంచాయతీకి చెందిన మూడు రూములదుకాణాల వేలం వ్యవహారం రోజురోజుకూ అనేక అనుమానాలకు, ప్రశ్నలకు తావిస్తోంది. మార్చి నెలలో జరగాల్సిన దుకాణాల వేలం ప్రక్రియ సెప్టెంబర్ ఆఖరి వరకు వచ్చినా పూర్తికాకపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.ఐదు నెలలుగా వేలం ప్రక్రియ పెండింగ్?...పంచాయతీకి చెందిన వాణిజ్య దుకాణాలను నిర్ణీత కాలానికి వేలం వేసి, తద్వారా పంచాయతీకి ఆదాయం సమకూర్చాల్సి ఉంటుంది. అయితే మార్చిలో జరగాల్సిన వేలం ప్రక్రియ నెలలు గడుస్తున్నా ముందుకు సాగకపోవడంపై అధికారుల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఒక సాధారణ వేలం ప్రక్రియను పూర్తి చేయడానికి ఇంత సమయం ఎందుకు పడుతోంది? మూడు రూములకు సంబందించి వేలానికి సంబంధించిన నిబంధనలు పూర్తయ్యాయా? లేక ఉద్దేశపూర్వకంగానే ప్రక్రియను నెమ్మదిస్తున్నారా? ఇంత వ్యవహారం జరుగుతున్న అటు జిల్లా, మండల స్థాయి అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారో అంటూ, స్థానికులు చర్చించుకుంటున్నారు.

పంచాయతీ ఆదాయానికి గండి...

పంచాయతీకి ఆదాయం సమకూర్చే దుకాణాలే నెలల తరబడి వేలం కాకుండా ఉండటం వల్ల పంచాయతీ ఆదాయంపై ప్రభావం పడుతుంది అంటూ స్థానిక ప్రజలు ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు.వేలం ద్వారా ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, ప్రక్రియ ఆలస్యం చేయడం వల్ల పంచాయతీకి ఆర్థిక వ్యవస్థ దెబ్బతినే అవకాశాలు మెండుగానే ఉన్నాయని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.గత వేలం ద్వారా ఒక్కొక్క దుకాణానికి ఎనిమిది వేల రూపాయల పైచిలుకు కిరాయి చెల్లించే వారని ప్రస్తుతం నూతన పాలక వర్గం ఏర్పడిన తర్వాత దుకాణాల నుంచి ప్రతి నెల ఎటువంటి అద్దెలు రాకపోవడం పై పంచాయతీ ఆదాయానికి భారీగా గండి పడే అవకాశం ఉందనే విమర్శలు వెల్లివెత్తుతున్నాయి.

అధికారుల పని తీరు పై పలు అనుమానాలు...

దుకాణాల అద్దెలు,వేలం ప్రక్రియ పెండింగ్‌లో ఉన్న ఈ ఐదు నెలల కాలంలో దుకాణాలను ఏ అధికారి అనుమతితో నిర్వహిస్తున్నారు? అద్దెలు చెల్లించకుండా దుకాణాలు కొనసాగుతున్నట్లయితే మండల స్థాయి అధికారులు ఎందుకు స్పందించడం లేదు అనే అనుమానాలు స్థానిక ప్రజలలో రేకెత్తిస్తున్నాయి.పంచాయతీ అధికారు నోటీసులు జారీ చేసిన గాని ఫలితం మాత్రం శూన్యం అంటున్నారు స్థానిక ప్రజలు.ఈ వ్యవహారం అంత జిల్లా అధికారిని(డీపీవో)దృష్టికి చేరిన ఇంకా అధికారులు ఎందుకు కాలయాపన చేస్తున్నారో అంతు చిక్కని ప్రశ్న లాగా ఉంది అంటున్నారు స్థానికులు ఇప్పటికైనా జిల్లా పంచాయతీ శాఖ అధికారులు ఈ వ్యవహారంపై దృష్టి సారించాలని స్థానిక ప్రజల కోరుకుంటున్నారు.

ప్రజావాణి ఫిర్యాదులకు పరిష్కారం ఎప్పుడు?

- పెండింగ్ సమస్యలపై జిల్లా యంత్రాంగం సమాధానం చెప్పాలి
- ఫిర్యాదు ఇచ్చిన వారికి సమాచారం అందుతుందా?
- శాఖల వారీగా పెండింగ్ వివరాలు బహిర్గతం చేయాలి
- భూ సమస్యలతో ప్రజల ప్రదక్షిణలు ఎన్నాళ్లు?
- గడువులోగా పరిష్కారం చూపని అధికారులపై చర్యలేవీ?
- ప్రజావాణి లక్ష్యం నెర వేరుతున్నదా..?
- ప్రజలకు న్యాయం జరుగుతున్నదా?

ప్రజా వాయిస్/జనగామ జిల్లా బ్యూరో (సెప్టెంబర్ 21) ప్రజల సమస్యలకు పరిష్కారం చూపించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు ఎంతవరకు న్యాయం జరుగుతుందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్ పరిధిలో నిర్వహించే ప్రజావాణిలో భూ సమస్యలు, రెవెన్యూ వివాదాలు, పింఛన్లు, సంక్షేమ పథకాలు, రహదారులు, విద్య, వైద్యం తదితర అంశాలపై ప్రజలు ఫిర్యాదులు అందజేస్తున్నారు. తమ సమస్యలు పరిష్కారమవుతాయనే ఆశతో అధికారులను ఆశ్రయిస్తున్నప్పటికీ, ఫిర్యాదుల పరిష్కారానికి పట్టే సమయం, పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల సంఖ్య, శాఖల వారీగా తీసుకున్న చర్యలపై స్పష్టమైన సమాచారం అందాల్సిన అవసరం ఉంది.

పరిష్కారానికి ఎంత సమయం?

ప్రజావాణిలో ఫిర్యాదు స్వీకరించిన తర్వాత సంబంధిత శాఖకు ఎంత సమయంలో పంపిస్తున్నారు? ఫిర్యాదును పరిశీలించి, క్షేత్ర స్థాయిలో విచారణ నిర్వహించి, పరిష్కారం చూపించేందుకు నిర్దేశించిన గడువు ఎంత? ఆ గడువులోగా సమస్య పరిష్కారం కాకపోతే బాధ్యత వహించే అధికారి ఎవరు? అనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ఫిర్యాదుల స్వీకరణ తోనే ప్రక్రియ ముగియ కుండా, తుది పరిష్కారం వరకు పర్యవేక్షణ ఉండాలని ప్రజలు కోరుతున్నారు.

శాఖల వారీగా పెండింగ్ వివరాలు వెల్లడించాలి.

జిల్లాలో ప్రజావాణి ద్వారా ఇప్పటివరకు ఎన్ని ఫిర్యాదులు అందాయి? ఎన్ని పరిష్కరించారు? ఎన్ని తిరస్కరించారు? ఎన్ని పెండింగ్ లో ఉన్నాయి? రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్య, వైద్యం, సంక్షేమం తదితర శాఖల్లో పెండింగ్ దరఖాస్తులు ఎన్నెన్ని ఉన్నాయనే వివరాలను జిల్లా యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉంచాలి. నెలవారీగా ఫిర్యాదుల పరిష్కార స్థితిని వెల్లడిస్తే అధికారుల పనితీరుపై ప్రజలకు స్పష్టత లభిస్తుంది.

భూ సమస్యల పరిష్కారంలో జాప్యం ఎందుకు?

భూ సమస్యలు, పట్టాదారు పాసుపుస్తకాలు, భూ రికార్డుల సవరణలు, సరిహద్దు వివాదాలు, ఆక్రమణల ఆరోపణలు వంటి అంశాలపై ప్రజలు ప్రజావాణిలో ఫిర్యాదులు చేస్తున్నారు. భూమికి సంబంధించిన సమస్యలు కుటుంబాల జీవ నోపాధితో ముడిపడి ఉండటంతో పరిష్కారంలో జాప్యం ప్రజలకు ఇబ్బందులను కలిగించే అవకాశం ఉంది. భూ సమస్యలపై అందిన ఫిర్యాదులలోఎన్ని పరిష్కరించారు? ఎన్ని విచారణలో ఉన్నాయి? ఎన్ని పెండింగ్ లో ఉన్నాయనే వివరాలను సంబంధిత అధికారులు వెల్లడించాలి.

ఫిర్యాదు ఇచ్చిన వారికి సమాచారం అందు తుందా?

ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన వ్యక్తికి దరఖాస్తు సంఖ్య, సంబంధిత శాఖ వివరాలు, తీసుకున్న చర్యలు, పరిష్కార స్థితి గురించి సమాచారం అందుతున్నదా? సమస్య పరిష్కరించామని నమోదు చేసిన ఫిర్యాదులపై ఫిర్యాదు దారుల నుంచి నిర్ధారణ తీసుకుంటున్నారా? ఫిర్యాదు దారుడు సంతృప్తి చెందని సందర్భాల్లో పునఃపరిశీలన కు అవకాశం ఉందా? అనే అంశాలపై జిల్లా యంత్రాంగం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

ప్రజావాణిలో దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న ఫిర్యాదులను గుర్తించి శాఖల వారీగా సమీక్షించాలి. పరిష్కారం కాని సమస్యలకు కారణాలు, సంబంధిత అధికారుల వద్ద ఉన్న దశ, తదుపరి చర్యల వివరాలను నమోదు చేయాలి. నిబంధనల ప్రకారం పరిష్కరించలేని సమస్యలకు కూడా కారణాలను ఫిర్యాదు దారులకు తెలియజేయడం ద్వారా పరిపాలనలో పారదర్శకత పెంచే అవకాశం ఉంది.

ప్రజావాణి పై జిల్లా కలెక్టర్ల జవాబుదారీతనం ఏది?

ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడం మాత్రమే కాకుండా, వాటి పరిష్కారాన్ని పర్యవేక్షించడం కూడా జిల్లా యంత్రాంగం బాధ్యతలో కీలకమైన అంశం. ప్రజావాణి ఫిర్యాదులపై జిల్లా కలెక్టర్లు నిర్వహించే సమీక్షల్లో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారు? పెండింగ్ సమస్యల పరిష్కారానికి శాఖల వారీగా చర్యలు ఏంటి? పరిష్కార గణాంకాలను ప్రజలకు అందుబాటులో ఉంచే విధానం ఉందా? అనే ప్రశ్నలకు అధికారుల నుంచి సమాధానాలు రావాల్సి ఉంది.ప్రజావాణి అంటే ఫిర్యాదులు స్వీకరించే కార్యక్రమం మాత్రమే కాకుండా, ప్రజల సమస్యలకు పరిష్కార మార్గం చూపించే పరిపాలనా వ్యవస్థ. అందులో భాగంగా ఫిర్యాదుల స్వీకరణ నుంచి తుది పరిష్కారం వరకు వివరాలను పారదర్శకంగా వెల్లడించడం ద్వారా ప్రజలకు నమ్మకం కల్పించాల్సిన అవసరం ఉంది. జిల్లా వారీగా, శాఖల వారీగా పెండింగ్ దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించిన ఫిర్యాదులు, పరిష్కారానికి పట్టిన సమయం వంటి వివరాలను జిల్లా యంత్రాంగం ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి అని ప్రజలు కోరుతున్నారు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా ఉచిత బ్యాగుల పంపిణీ

ప్రజా వాయిస్ పెద్ద శంకరంపేట: పెద్ద శంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు ఉచిత బ్యాగుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ శోభారాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఉచితంగా బ్యాగులను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులను విద్యాపరంగా మరింత ప్రోత్సహించడంలో భాగంగా ఈ బ్యాగులను పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరై, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని, తల్లిదండ్రులకు మరియు కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ ప్రోత్సాహకంతో ఉచితంగా బ్యాగులు అందుకున్న విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, సిబ్బంది శ్రీశైలం, ప్రభాకర్, మల్లేశం, రాజు, అనంతరాజ్ శర్మ, రమేష్, మౌనిక, బసవరాజ్ తదితరులతో పాటు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఫార్మర్ ఐడీ తప్పనిసరి

- రైతులకు వ్యవసాయ శాఖ కీలక సూచన
- రైతులకు అలర్ట్.. అక్టోబర్ 1లోగా రిజిస్ట్రేషన్ పూర్తి!
- జిల్లా వ్యవసాయాధికారి కవిత

ప్రజావాయిస్/వికారాబాద్ బ్యూరో: ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, ఎరువులు, విత్తనాలు, ఇతర వ్యవసాయ సేవలను నిరంతరాయంగా పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఐడీ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి కవిత రైతులకు సూచించారు. జిల్లాలోని రైతులందరూ 2026 అక్టోబర్ 1లోగా ఫార్మర్ రిజిస్ట్రీలో తమ వివరాలను నమోదు చేసుకుని రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని కోరారు.ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఐడీ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ వ్యవసాయ పథకాలు, సేవలను సులభంగా పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు తమ రిజిస్ట్రేషన్ స్థితిని ఆన్‌లైన్‌లో పరిశీలించి ఐడీని ధృవీకరించుకోవచ్చని పేర్కొన్నారు.రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోని రైతులు సమీపంలోని డీఎస్సీ/మీసేవ కేంద్రం లేదా వ్యవసాయ విస్తరణాధికారి (ఏఈఓ) ను సంప్రదించాలని సూచించారు. పెండింగ్ రిజిస్ట్రేషన్లను గడువులోగా పూర్తి చేసేందుకు క్లస్టర్ల వారీగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు కవిత తెలిపారు.రైతులు ఆలస్యం చేయకుండా తమ ఫార్మర్ రిజిస్ట్రేషన్ స్థితిని పరిశీలించుకుని, అక్టోబర్ 1లోగా రిజిస్ట్రేషన్ ఐడీ పొందేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

ఎంజీఎంలో రోగులపై పెచ్చులు

- పైకప్పు ఊడిపడి గాయాలు
- ఘటనను పరిశీలించేందుకు వెళ్లిన సిజెపి బృందానికి పోలీసుల అడ్డంకి
- కలెక్టర్ ను కలిసేందుకు అనుమతించలేదన్న ప్రతినిధులు
- సూపరింటెండెంట్ హైదరాబాద్ లో ఉన్నారని పోలీసుల సమాచారం
- ఆసుపత్రి భవనాల భద్రతపై సమగ్ర పరిశీలనకు డిమాండ్
- కొత్త భవనాన్ని డిసెంబరు 31లోగా అందుబాటులోకి తేవాలని విజ్ఞప్తి

ప్రజా వాయిస్, హనుమకొండ: వరంగల్ ఎంజీఎం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఆదివారం పైకప్పు పెచ్చులు ఊడిపడి చికిత్స పొందుతున్న రోగులపై పడటంతో పలువురు గాయపడిన ఘటనపై కాక్రోచ్ జనతా పార్టీ (CJP) ప్రతినిధి బృందం సోమవారం ఆసుపత్రిని సందర్శించింది. ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకోవడంతో పాటు గాయపడిన వారి పరిస్థితి, ఆసుపత్రిలోని మౌలిక సదుపాయాలు, భవనాల భద్రతను పరిశీలించేందుకు సిజెపి సౌత్‌జోన్ ఇన్‌చార్జి, నేషనల్ మీడియా హెడ్ విజయ్ మల్లంగి నేతృత్వంలో బృందం వచ్చింది.

కలెక్టర్ ను కలవకుండా అడ్డుకున్నారు

ఆసుపత్రికి చేరుకున్న సమయంలో జిల్లా కలెక్టర్ అక్కడే ఉన్నారని, ఘటనపై ఆయనను కలిసి మాట్లాడేందుకు ప్రయత్నించగా పోలీసులు అనుమతించలేదని సిజెపి ప్రతినిధులు తెలిపారు. కలెక్టర్ తమతో మాట్లాడకుండానే వెళ్లిపోయారని పేర్కొన్నారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను కలిసేందుకు ప్రయత్నించగా.. ఆయన హైదరాబాద్ వెళ్లారని పోలీసులు చెప్పినట్లు తెలిపారు. అధికారులను కలిసేందుకు అనుమతించకపోవడంపై సిజెపి ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేశారు.

భద్రతకు ప్రాధాన్యమివ్వాలి

విజయ్ మల్లంగి మాట్లాడుతూ.. చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చిన రోగులు అదే ఆసుపత్రిలో గాయపడటం ఆందోళనకరమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో భవనాల భద్రత, మౌలిక వసతులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఎంజీఎంలోని భవనాలను తక్షణమే పరిశీలించి ప్రమాదకర పరిస్థితిలో ఉన్న వాటికి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

డిసెంబరు 31లోగా కొత్త భవనం

ఎంజీఎం సమీపంలో నిర్మాణంలో ఉన్న నూతన ఆసుపత్రి భవనాన్ని ఈ ఏడాది డిసెంబరు 31లోగా పూర్తి చేసి, అవసరమైన వైద్య సదుపాయాలతో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సిజెపి డిమాండ్ చేసింది. గడువులోగా భవనం అందుబాటులోకి రాకపోతే వరంగల్‌లో మహాధర్నా నిర్వహిస్తామని విజయ్ మల్లంగి హెచ్చరించారు.

జర్నలిస్టు సంఘాల్లో పదవుల పందేరం.. సంక్షేమం ఎక్కడ.....?

- సీనియర్లకు మొండిచేయి.. అనుకూల వర్గానికే అందలం
- అర్హతలేని వారికి బాధ్యతలంటూ ఆరోపణలు
- ప్రెస్ క్లబ్ కోసం ఎదురుచూపులు
- వ్యక్తిగత ప్రయోజనాలా? జర్నలిస్టుల సంక్షేమమా?
- అని ప్రశ్నిస్తున్న సీనియర్ పాత్రికేయులు

ప్రజా వాయిస్,సంగారెడ్డి : జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తి గౌరవం కోసం పనిచేయాల్సిన జర్నలిస్టు సంఘాలు, యూనియన్ల వ్యవహారశైలిపై సంగారెడ్డి జిల్లాలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. సంఘాల్లో పదవుల కేటాయింపు నుంచి సభ్యత్వాల వరకు అన్నింటిలోనూ పారదర్శకతకు తిలోదకాలు ఇస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దశాబ్దాలుగా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సీనియర్ పాత్రికేయులను పక్కనపెట్టి, తమకు అనుకూలంగా వ్యవహరించే వారికి పదవులు, బాధ్యతలు కట్టబెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అనుభవం పక్కన.. అనుకూలతకే పెద్దపీట?

జర్నలిజంలో 20–25 ఏళ్లకు పైగా అనుభవం ఉన్నవారు ఉండగానే, ఇటీవల రంగంలోకి వచ్చిన వారికి కీలక బాధ్యతలు ఎలా దక్కుతున్నాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. యూట్యూబ్ ఆధారిత ప్రసారాలకు పరిమితమైన వారికి ఎలక్ట్రానిక్ మీడియా బాధ్యతలు, చిన్న పత్రికల్లో పనిచేసేవారికి సంఘాల్లో కీలక పదవులు, ఇతర వృత్తుల్లో ఉన్నవారికి కార్యవర్గ సభ్యత్వాలు కల్పిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికే మరో జర్నలిస్టు సంఘంలో బాధ్యతలు నిర్వహిస్తున్న వారికి మరొక యూనియన్‌లోనూ పదవులు ఇవ్వడం వెనుక ఉన్న విధానమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఒకే సామాజిక వర్గానికి చెందినవారికే పదవులు, సన్మానాలు, సభ్యత్వ పుస్తకాలు, జ్ఞాపికలు తదితరాల్లో అధిక ప్రాధాన్యం ఎందుకు లభిస్తోందన్న చర్చ కూడా జర్నలిస్టు వర్గాల్లో సాగుతోంది.

కృత్రిమ మేధకు విలువ.. క్షేత్రస్థాయి జర్నలిస్టుకు విలువ లేదా?

కృత్రిమ మేధ ఆధారిత సాధనాలతో వార్తలు, పోస్టర్లు రూపొందించేవారికి ప్రాధాన్యం లభిస్తున్నప్పటికీ, ప్రజల మధ్య తిరుగుతూ వాస్తవాలను సేకరించి వార్తలు అందించే క్షేత్రస్థాయి రిపోర్టర్లకు తగిన గుర్తింపు ఎందుకు లభించడం లేదని సీనియర్ పాత్రికేయులు ప్రశ్నిస్తున్నారు. నిజమైన జర్నలిజం అంటే ప్రజల సమస్యల మధ్య నిలబడి వాస్తవాలను వెలుగులోకి తేవడమా? లేక కంప్యూటర్, ఫోన్ ద్వారా తయారైన వార్తలు, చిత్రాలకే ప్రాధాన్యం ఇవ్వడమా? అని వారు నిలదీస్తున్నారు. అనుభవం, అర్హత, వృత్తి నిబద్ధతలకు బదులుగా వ్యక్తిగత పరిచయాలు, అనుకూలతలు ప్రమాణాలుగా మారితే సంఘాల ఉద్దేశమే దెబ్బతింటుందని హెచ్చరిస్తున్నారు.

ప్రెస్ క్లబ్ లేని జిల్లా కేంద్రం.. ఇదేనా జర్నలిస్టుల సంక్షేమం?

సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జర్నలిస్టులకు శాశ్వత ప్రెస్‌క్లబ్ లేకపోవడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది. ఎండైనా.. వానైనా.. ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో చెట్ల నీడన కూర్చొని అధికారుల కోసం ఎదురుచూస్తూ వార్తల సేకరణ చేయాల్సిన పరిస్థితి కొనసాగుతోందని పాత్రికేయులు చెబుతున్నారు. జర్నలిస్టుల కోసం సంఘాలు నడుపుతున్నామని చెప్పుకునే నాయకత్వాలు ముందుగా ప్రెస్‌క్లబ్ సమస్యను పరిష్కరించాల్సిన అవసరం లేదా? పదవులు, సన్మానాలు, వేడుకలకు ఉన్న ప్రాధాన్యం జర్నలిస్టుల కనీస వసతులకు ఎందుకు ఉండటం లేదని ప్రశ్నిస్తున్నారు.

స్థలాల కేటాయింపులోనూ ప్రశ్నలే!

జర్నలిస్టుల పేరిట స్థలాల కేటాయింపులు జరిగినప్పటికీ, నిజంగా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఎంతమేరకు న్యాయం జరిగిందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. జిల్లాలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న రిపోర్టర్లను పక్కనపెట్టి, ఇతర నియోజకవర్గాలకు చెందినవారికి, అక్రిడిటేషన్ లేని వారికి, జిల్లాలో తక్కువ కాలం పనిచేసినవారికి, జిల్లా కేంద్రంలో కనిపించకపోయినా వార్తలు పంపేవారికి స్థలాలు దక్కాయనే ఆరోపణలపై స్పష్టత ఇవ్వాలని పలువురు కోరుతున్నారు. జర్నలిస్టుల కోసం స్థలాలు సాధించామని చెప్పుకునే వారు, అదే సందర్భంలో జిల్లా కేంద్రంలో అన్ని జర్నలిస్టులకు ఉపయోగపడే ప్రెస్‌క్లబ్ కోసం స్థలం సాధించేందుకు ఎందుకు ప్రయత్నించలేదన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది. వ్యక్తిగత లబ్ధి సాధించుకోవడం ముఖ్యమా? లేక సమష్టి ప్రయోజనం కోసం శాశ్వత వసతి ఏర్పాటు చేయడం ముఖ్యమా? అని పాత్రికేయులు ప్రశ్నిస్తున్నారు.

జర్నలిస్టు సంక్షేమమా.. రాజకీయ ఆశలమా?

జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం పనిచేయాల్సిన సంఘాల నాయకులు రాజకీయ నాయకత్వాలకు దగ్గరవుతూ, నామినేటెడ్ పదవులు, ఇతర రాజకీయ అవకాశాల కోసం ప్రయత్నిస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. జర్నలిస్టుల సమస్యల కంటే రాజకీయ పరిచయాలకు ప్రాధాన్యం పెరిగితే సంఘాల అసలు లక్ష్యం పక్కదారి పట్టే ప్రమాదం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు. జర్నలిస్టుల పేరుతో పదవులు పొందుతూ, అదే జర్నలిస్టుల సమస్యలను పట్టించుకోకపోతే ఆ పదవులకు అర్థమేంటని సీనియర్ పాత్రికేయులు ప్రశ్నిస్తున్నారు.

పుట్టినరోజు వేడుకలకు వేదిక ఉంది.. జర్నలిస్టులకు ప్రెస్ క్లబ్ లేదా?

జర్నలిస్టు సంఘానికి నాయకత్వం వహిస్తున్న వ్యక్తి రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైనప్పటికీ, తన జన్మదిన వేడుకలను నిర్వహించుకునేందుకు కూడా జిల్లా కేంద్రంలో శాశ్వత ప్రెస్‌క్లబ్ అందుబాటులో లేకపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందని పాత్రికేయులు వ్యాఖ్యానిస్తున్నారు.జర్నలిస్టుల సంక్షేమం కోసం ఒక్క శాశ్వత భవనం కూడా ఏర్పాటు చేయలేకపోయిన నాయకత్వం, ఇతర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించి తామేదో జర్నలిస్టుల సమస్యలన్నింటినీ పరిష్కరించినట్లు ప్రచారం చేసుకోవడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు.

ఇకనైనా తీరు మార్చుకోవాలి

జర్నలిస్టు సంఘాలు ఎవరి వ్యక్తిగత వేదికలు కావని, అవి వందలాది మంది పాత్రికేయుల సమష్టి హక్కుల కోసం పనిచేయాల్సిన సంస్థలని సీనియర్ పాత్రికేయులు స్పష్టం చేస్తున్నారు. పదవులు కొందరి చేతుల్లోనే కేంద్రీకృతం కాకుండా, అర్హత, అనుభవం, సీనియారిటీ, క్షేత్రస్థాయి సేవలను ప్రామాణికంగా తీసుకోవాలని కోరుతున్నారు. ప్రశ్నించే జర్నలిస్టులను శత్రువులుగా చూడడం, వారి ప్రశ్నలను తక్కువ చేసి మాట్లాడడం, అసంతృప్తిని వ్యక్తం చేసేవారిని పక్కకు నెట్టడం ఇకనైనా మానుకోవాలని సూచిస్తున్నారు. జర్నలిస్టుల కోసం ఉన్న సంఘాలు.. జర్నలిస్టుల కోసమే పనిచేయాలి. వ్యక్తిగత ప్రయోజనాల కోసం జర్నలిస్టులను పావులుగా మార్చకూడదు. పదవులు శాశ్వతం కావు.. కానీ పాత్రికేయుల సంక్షేమం కోసం చేసిన పని మాత్రమే చరిత్రలో మిగులుతుంది. ఇప్పటికైనా నాయకత్వాలు ఆత్మపరిశీలన చేసుకుని, విభేదాలకు అతీతంగా జర్నలిస్టుల హక్కులు, గౌరవం, సంక్షేమం, ప్రెస్‌క్లబ్ ఏర్పాటు వంటి మౌలిక సమస్యలపై దృష్టి సారించాలని సీనియర్ పాత్రికేయులు కోరుతున్నారు.

ఫామ్‌హౌస్ భూములపై కాంగ్రెస్ ఫోకస్

- మద్దూరులో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ఫామ్ హౌస్ పరిశీలన
- సుమారు 12 ఎకరాల ఇనాం భూమిపై విచారణకు డిమాండ్
- 1950ల నుంచి భూ రికార్డులపై సమగ్ర పరిశీలన
- సీఎంకు నివేదిక ఇస్తామన్న కాంగ్రెస్ నేతలు

ప్రజా వాయిస్,షాబాద్: ప్రభుత్వ, అసైన్డ్, ఇనాం భూముల పరిరక్షణపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా కాంగ్రెస్ నాయకుల బృందం సోమవారం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మద్దూరు గ్రామంలోని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత జగదీశ్‌రెడ్డి ఫామ్‌హౌస్ పరిసరాలను పరిశీలించింది. ప్రజాభవన్ నుంచి బయలుదేరిన నేతలు అక్కడికి చేరుకుని భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించారు.ఫామ్‌హౌస్‌కు సంబంధించిన సుమారు 50 ఎకరాల భూమిలో దాదాపు 12 ఎకరాలు ఇనాం భూమిగా ఉన్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. అయితే భూముల హక్కులు, రికార్డులు, యాజమాన్య వివరాలను అధికారికంగా పూర్తిస్థాయిలో నిర్ధారించాల్సి ఉందన్నారు. ఈ అంశంపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో గత పదేళ్లలో ప్రభుత్వ, ఇనాం, అసైన్డ్ భూములతోపాటు చెరువులు, కుంటలు, ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూముల ఆక్రమణలపై ఆరోపణలు వచ్చాయని కాంగ్రెస్ నేతలు తెలిపారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో విలువైన భూముల విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలితే చర్యలు తీసుకోవాలని కోరారు.భూ రికార్డులను 1950ల నుంచి ప్రస్తుత పరిస్థితి వరకు పరిశీలించి, హక్కుల్లో జరిగిన మార్పులను సమగ్రంగా అధ్యయనం చేస్తామని తెలిపారు. ప్రభుత్వానికి చెందిన భూములు ఆక్రమణకు గురైనట్లు నిర్ధారణ అయితే వాటిని తిరిగి స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. మొత్తం వివరాలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నివేదిక అందజేస్తామని కాంగ్రెస్ నాయకులు వెల్లడించారు.

గురుకులాల్లో నాసిరకం సరుకులు అరికట్టాలి కలెక్టర్ కు వినతి పత్రం అందజేత

- నేకప్ సరఫరాలపై సమగ్ర విచారణ జరిపించాలి
- తెలంగాణ బీసీ ఎస్సీ ఎస్టీ కాంటాక్ట్ జేఏసీ ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షులు గ్యార యాదగిరి

సామాజిక తెలంగాణ కొండమల్లేపల్లి మండలం సెప్టెంబర్ 21 గురుకులాల్లో ఆహార పదార్థాల నాణ్యతకు సంబంధించిన కల్తీపై వస్తువులు సరఫరా చేస్తూ విద్యార్థుల ఆరోగ్యలతో చెలగాటమాడుతున్నారని జిల్లా కలెక్టర్ ను కలసి వినతి పత్రం అందజేశారు గురుకులాల నిత్యావసర సరుకుల కొనుగోలు ప్రక్రియను కేంద్రీకృత విధానాల్లోకి తీసుకురావాలని జి ఓ ఎం ఎస్ ఎన్ ఓ 17 ద్వారా ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ ఏర్పాటు చేసిన విషయం ఉంది ఈ విధానంపై కాంట్రాక్టర్ నుంచి అభ్యంతరాలు వ్యక్తమైన నేపథ్యంలో సరఫరాల నాణ్యత పారదర్శకత ధరలు చిన్న సరఫరాదారులు భాగస్వామివంటి అంశాలను ప్రభుత్వం పునః పరిశీలించాలని గ్యార యాదగిరి కోరారు గురుకులంలో పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల అవసరాలు మరుగుదొడ్ల పరిశుభ్రత తాగునీరు భోజన పదార్థాల నాణ్యత విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు తదితర అంశాలపై చర్చించారు ఈ సమావేశంలో పిపిఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వంటిపాక సుష్మ ఉపాధ్యాయులు శంకర్ సహాయ కార్యదర్శి రామవత్ బాలునాయక్ డేవిడ్ రాజ్ కోశాధికారి సైదాచారి కమిటీ సభ్యులు అందుగుల నాగరాజు రమేష్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

ఎస్సీ ఎస్టీలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- భద్రాద్రి జిల్లా పవిత్రమైన ప్రాంతం
- సీతారామచంద్రస్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయి
- భద్రాద్రి గిరి మార్ట్ ఏర్పాటు ఆదర్శంనీయం
- ఐటీడీఏ పీవో రాహుల్ ను అభినందించిన కమిషన్ చైర్మన్
- అట్రాసిటీస్ అంశాలపై ముగ్గురు కమీషన్ సభ్యులతో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం
- తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల, తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ప్రజా వాయిస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నాడు తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల,తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ల్యాండ్, సర్వీస్ .ఆర్.ఓ.ఆర్, అట్రాసిటీస్ అంశాలపై అధికారులతో సమీక్షా సమావేశం ముగ్గురు కమీషన్ సభ్యులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తూ, రక్షణ చట్టాలను రూపొందించిందని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల, తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలోనే విస్తీర్ణంలో అతి పెద్ద ఏజెన్సీ జిల్లా భద్రాద్రి జిల్లా అని గుర్తుచేశారు. కమిషన్ సమావేశానికి జిల్లాకు రెండోసారి రావడం జిల్లా అధికారులు ఘనస్వాగతం పలకడం మర్చిపోలేని సంఘటనని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, వాటిని అందిపుచ్చుకొని ఆర్థికంగా దినదినాభివృద్ధి చెందాలని సూచించారు. వివిధ శాఖల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీల భూమి సమస్యలు, బ్యాక్ లాగ్ పోస్టులు వివరాలు, ఉద్యోగులు రక్షణ కోసం చట్టాలను, రోస్టర్ విధానాలు,రూపొందించి వాటిని పకడ్బందీగా అమలు చేసేందుకు కమిషన్ చర్యలు చేపడుతుందని గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ ప్రజల పైన ఉద్యోగులపైన ఎటువంటి వేధింపులు కానీ చిత్రహింసలు గాని ఇబ్బందులు గురి చేసిన శాఖ పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కమిషన్ చైర్మన్ హెచ్చరించారు. న్యాయం కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ బాధితులకు ఎఫ్.ఐ.ఆర్, చార్జిషీట్, కమిషన్, కంపన్సేషన్ వరకు పారదర్శకంగా ఉండేందుకు అధికారులు పనిచేయాలని ఆదేశించారు. భద్రాద్రి జిల్లాకు శ్రీ సీతారామచంద్రస్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని, ఎన్నీ సమస్యలు ఉన్న వాటి పరిష్కారం ఆ రాములోరి దయ వలన సత్వరమే తీరిపోతాయని కమిషన్ చైర్మన్ పేర్కొన్నారు. దక్షిణ అయోధ్యగా పేరు గడించిన భద్రాచలం పుణ్యక్షేత్రాన్ని దర్శించుకోవడం ఎంతో భాగ్యమన్నారు. అదేవిధంగా వివిధశాఖల అధికారుల నుంచి వివరాలు తోపాటు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల నివేదిక రాష్ట్ర కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో భద్రాద్రి జిల్లా పోలీస్ శాఖ నివేదికను కమిషన్ చైర్మన్ అడుగగా 2014 నుంచి ఇప్పటివరకు జిల్లాలో 1115 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయాయని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు వివరించారు. అందులో 51 కేసులు ప్రస్తుతం విచారణలో ఉన్నాయని, వాటిలో 20 కేసులో చార్జింగ్ చార్జిషీట్ చేశామని, రెండు హైకోర్టు స్టేలు ఉండగా, 9 కేసులు లీగల్ ఒపీనియన్ కోసం ఉన్నాయని, 20 పెండింగ్ కేసులు ప్రస్తుతం ఉన్నట్లు జిల్స్ ఎస్పీ వివరించారు. ఈ క్రమంలోనే జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ, జిల్లా పంచాయతీ, డీ.ఆర్.డీ.ఓ, ఎస్సీ కార్పొరేషన్, గురుకులాల, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, జిల్లా ప్రజా పరిషత్, ఉపాధి శాఖ మున్సిపల్ శాఖ, వ్యవసాయ శాఖ, పరిశ్రమలు, విద్యుత్, ఆర్డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, పంచాయితీ రాజ్, ఆర్ అండ్ బి, ఎక్సైజ్ జ్యోతిరావు పూలే డిసిఓ, జిల్లా రెవెన్యూ, ఫారెస్ట్, ఐటీడీఏ లో నమోదైన ఎస్సీ ఎస్టీ కేసుల వివరాలు ఉద్యోగుల సమస్యలు ప్రస్తుతం ఉన్న ఉద్యోగుల సంఖ్య భర్తీ కానీ బ్యాక్లాగ్ పోస్టుల వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ ల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని వారి అభ్యున్నతే లక్ష్యంగా వివిధ పథకాల అమలుకు కృషిచేస్తున్నట్లు పేర్కొన్నారు. మండల తాహసిల్దార్లు, ఎంపీడీవోలు, సిడిపివోలు సమన్వయంతో జిల్లా అధికారులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ల సమస్యల పరిష్కారానికి న్యాయం కోసం ఎదురుచూస్తున్న బాధితుల కోసం పని చేయాలని ఆదేశించారు. భద్రాద్రి గిరి మార్ట్ ఏర్పాటు ఆదర్శంనీయమని కమిషన్ చైర్మన్ భద్రాచలం ఐటిడిఏ పిఓ రాహుల్ ను అభినందించారు. గిరిజన మహిళా సంఘాల ఆధ్వర్యంలో వారి సాంప్రదాయ వృత్తి ప్రోత్సహించే ఉద్దేశంలో భాగంగా భద్రాచలంలో ఈ గిరిమార్టును ఏర్పాటు చేయడం గర్వించదగ్గ విషయం అన్నారు. వారి ఉత్పత్తులు ను ఏర్పాటు చేసి, గిరిజనుల జీవనశైలి విధి,విధానాలను కళ్ళకు కట్టే విధంగా చూపించిన మ్యూజియం అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు.ఈ సమావేశంలో భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ రెవిన్యూ వేణుగోపాల్, భద్రాచలం ఐటిడిఏ పి.ఓ రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన,డీ. ఆర్.ఓ పద్మావతి, సిపిఓ సునీత, జిల్లా షెడ్యూలు కులముల అధికారిని శ్రీలత, కార్పొరేషన్ ఈ.డీ ఉపేందర్,జడ్పీ సీఈఓ నాగలక్ష్మి,డీపీఓ అనూష, డీ.ఏ.వో బాబురావు, విద్యుత్ శాఖ ఈ వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేద మంత్రఘోషల మధ్య.. రాజశ్యామల అమ్మవారి వైదిక క్రతువులు

- మహా కుంభాభిషేకానికి ముందస్తు పూజలు ఘనంగా
- అష్టద్రవ్య గణపతి, సుదర్శన, వనదుర్గా హోమాలు
- నవావర్ణ అనుష్ఠానం.. భక్తిశ్రద్ధలతో పాల్గొన్న ప్రముఖులు
- అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు, ప్రముఖులు

ప్రజా వాయిస్,రాజేంద్రనగర్: కోకాపేట నియోపోలిస్‌లో ప్రతిష్ఠించనున్న అష్టభుజి శ్రీ రాజశ్యామల అమ్మవారి మహా కుంభాభిషేకానికి ముందస్తు వైదిక క్రతువులు ఘనంగా జరిగాయి. శ్రీ శారదా పీఠం ప్రాంగణంలో రెండు రోజుల పాటు నిర్వహించిన పూజలు, హోమాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించనున్న మహా కుంభాభిషేక మహోత్సవం విజయవంతంగా సాగాలని సంకల్పిస్తూ పీఠాధిపతులు, వేద పండితులు శాస్త్రోక్తంగా ఈ క్రతువులను నిర్వహించారు.పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి, ఉత్తర పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి సమక్షంలో అష్టద్రవ్య గణపతి, సుదర్శన, వనదుర్గా హోమాలు నిర్వహించారు. అనంతరం ఆశ్లేష బలి పూజ చేపట్టారు. రెండో రోజు నవావర్ణ అనుష్ఠానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, హోమ జ్వాలల నడుమ సాగిన కార్యక్రమాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

ప్రముఖుల ప్రత్యేక పూజలు

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ శ్రవణ్‌కుమార్, జస్టిస్ నంద, జస్టిస్ రామకృష్ణారెడ్డి, జస్టిస్ మాధవీదేవి, తెలంగాణ ఎండోమెంట్స్ కమిషనర్ హనుమంతరావు, ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తగా ఎన్నికైన మల్లికార్జున తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. తెలంగాణ ఎండోమెంట్స్ అడ్వైజర్ గోవిందహరి, ఎమ్మెల్సీ వాణీదేవి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.శారదా పీఠం నియోపోలిస్ కమిటీ అడ్వైజరీ బోర్డు సభ్యులు గోపాల రెడ్డి, గోవిందహరి, వర్కింగ్ కమిటీ సభ్యులు జస్టిస్ బద్రీనాథ్, సురేష్‌రెడ్డి, పీఠం ట్రస్ట్ బోర్డు సభ్యులు నాదెండ్ల సుబ్బారావు తదితరులు హాజరయ్యారు. మహా కుంభాభిషేక మహోత్సవం విజయవంతంగా జరగాలని, ప్రజలకు శాంతి, సౌభాగ్యాలు కలగాలని పీఠాధిపతులు, వేద పండితులు, భక్తులు ఆకాంక్షించారు.



బల్దియాలో లంచం బాగోతం.!

- రూ.15 వేలు తీసుకుంటూ ఇద్దరు ఉద్యోగులు రెడ్ హ్యాండెడ్ గా పట్టివేత
- జూనియర్ అసిస్టెంట్ అశోక్ , ఔట్ సోర్సింగ్ ఉద్యోగి కిరణ్ అరెస్ట్
- బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు
- నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరు.. జ్యుడీషియల్ రిమాండ్

ప్రజా వాయిస్, నిజామాబాద్: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో లంచం తీసుకుంటున్న ఇద్దరు ఉద్యోగులను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అకౌంట్స్ సెక్షన్‌లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ అశోక్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి కిరణ్ రూ.15 వేల లంచం తీసుకుంటుండగా అధికారులు అదుపులోకి తీసుకున్నారు.అకౌంట్స్ సెక్షన్‌లో పని నిమిత్తం డబ్బులు డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగిన అధికారులు.. బాధితుడి నుంచి రూ.15 వేల నగదు తీసుకుంటున్న సమయంలో అశోక్, కిరణ్‌లను పట్టుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి నాంపల్లి ఏసీబీ కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. కోర్టు ఆదేశాలతో ఇద్దరినీ జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

చింతకుంటలో రణరంగం.!

- గణేశ్ నిమజ్జనానికి నీళ్లివ్వాలని బీజేపీ ధర్నా.. పోలీసులతో వాగ్వాదం
- అర టీఎంసీ నీటిని అడిగితే లాఠీచార్జ్ చేస్తారా?
- ఏసీపీ, సీఐ తీరుపై బీజేపీ నేతల ఆగ్రహం
- డిప్యూటీ మేయర్ సునీల్ రావు, జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం అరెస్ట్
- నీళ్లు విడుదల చేసే వరకు ఉద్యమం కొనసాగిస్తాం: బీజేపీ నేతలు

ప్రజా వాయిస్,కరీంనగర్: గణేశ్ నిమజ్జనానికి చింతకుంట కెనాల్‌లో నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ చేపట్టిన 'చలో చింతకుంట' కార్యక్రమం సోమవారం ఉద్రిక్తంగా మారింది. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం చింతకుంటలో ధర్నాకు దిగిన బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు లాఠీచార్జ్ చేశారని బీజేపీ నేతలు ఆరోపించారు.శాంతియుతంగా చేపట్టిన 'చలో చింతకుంట' కార్యక్రమాన్ని పోలీసులు రణరంగంగా మార్చారని బీజేపీ నాయకులు మండిపడ్డారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్‌పై పోలీసులు దాడి చేశారని, కార్యకర్తలను గల్లా పట్టుకుని ఈడ్చుకెళ్లారని ఆరోపించారు. కరీంనగర్ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు సహా పలువురిని పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

'నీళ్లు ఇవ్వకపోవడం దారుణం'

ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూ.. గణేశ్ నిమజ్జనానికి నీటిని విడుదల చేయాలని కోరితే లాఠీలతో కొట్టించడం దారుణమన్నారు. నిమజ్జనానికి నీటిని విడుదల చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. బోయినపల్లి ప్రవీణ్‌రావు మాట్లాడుతూ.. అర టీఎంసీ నీటిని అడిగితే ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. డిప్యూటీ మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేసినా నీటిని విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు.

500 క్యూసెక్కులు.. ఆపై 3 వేల క్యూసెక్కులు

ఇదిలా ఉండగా, గణేశ్ నిమజ్జనానికి చింతకుంట కెనాల్‌లోకి ఎస్సారెస్పీ నుంచి నీటిని విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి. తొలుత 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి, సాయంత్రం మరో 3 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నట్లు పేర్కొన్నాయి. ఈ నీరు మంగళవారం రాత్రిలోపు చింతకుంట కెనాల్‌కు చేరుకునే అవకాశం ఉందని బీజేపీ వర్గాలు తెలిపాయి.నిమజ్జనానికి అవసరమైన నీటి విషయంపై గత వారం నుంచే ప్రజా ప్రతినిధులు, అధికారులు దృష్టి సారించారు. ముందుగానే నీటిని విడుదల చేయాలని పలువురు కోరారు. తక్షణమే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. పోలీసుల లాఠీచార్జ్‌ను వారు తీవ్రంగా ఖండించారు. నీటిని విడుదల చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

60 ఏళ్లుగా నివాసముంటున్న భూమిపై అభాండాలు వద్దు

- పక్కా రికార్డులు ఉన్నా తప్పుడు ప్రచారాలు
- సర్వే నంబర్ 103 స్థల వివాదంపై కలెక్టర్ కు ఫిర్యాదు
- ఆక్రమణల ఆరోపణల్లో నిజం లేదు
- క్షేత్రస్థాయి విచారణ జరిపి న్యాయం చేయండి
- ప్రజావాణి కలెక్టరేట్ లో గుడిమల్కాపురం గ్రామస్తుల వినతి

ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం 60 ఏళ్లుగా తమ స్వాధీనంలో ఉండి, అన్ని రకాల చట్టబద్ధమైన పత్రాలు, ప్రభుత్వ రికార్డులు కలిగి ఉన్న భూమిపై కొందరు వ్యక్తులు కావాలని భూ ఆక్రమణ ఆరోపణలు చేస్తున్నారని, ఈ విషయంలో తక్షణమే స్పందించి తమకు న్యాయం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని గుడిమల్కాపురం గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌ను వేడుకున్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో గ్రామానికి చెందిన బాధితులు అధికారులను కలిసి తమ వాదనను వివరిస్తూ సమగ్ర ఆధారాలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడిమల్కాపురం గ్రామంలోని సర్వే నంబర్ 103 పరిధిలోని భూమిని దాదాపు 60 సంవత్సరాల క్రితమే మన్నే జనార్ధన్ రెడ్డి వద్ద నుంచి గ్రామానికి చెందిన పలువురు కొనుగోలు చేశారు. ఈ కొనుగోలుకు సంబంధించి తమ వద్ద సేల్ డీడీలు, సాదా బైనామాలు, రెవెన్యూ పట్టాలు వంటి ఆధారాలన్నీ భద్రంగా ఉన్నాయని తెలిపారు. అనంతరం ఆ స్థలాలు రెవెన్యూ రికార్డుల్లోనూ క్రమబద్ధంగా ఇళ్ల స్థలాలుగా నమోదయ్యాయని పేర్కొన్నారు. గతంలో అంతటి దేవయ్య కుటుంబానికి సంబంధించిన స్థలంపై వివాదం తలెత్తినప్పుడు కోర్టును ఆశ్రయించగా, 1993లోనే కాంప్రమైజ్ డిక్రీ ఆర్డర్ వచ్చిందని స్పష్టం చేశారు. నాటి నుంచి వారి వారసులైన అంతటి వీరయ్య, యాదయ్య, సత్తయ్యలు అదే స్థలంలో నివాసముంటూ వస్తున్నారు.అంతేకాకుండా, 2015–16లో జరిగిన రివిజన్ రికార్డుల్లోనూ, 2017–18లో రికార్డులు ఆన్‌లైన్ చేసిన సమయంలోనూ తమ ఇళ్లకు, పేర్లకు సంబంధించిన అసైన్మెంట్ నంబర్లు స్పష్టంగా నమోదయ్యాయని గ్రామస్తులు వెల్లడించారు. పాత ఇళ్లు కూలిపోయే స్థితికి చేరడంతో, అందుబాటులో ఉన్న పత్రాలు మరియు గ్రామపంచాయతీ అనుమతులతోనే నూతన గృహాల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. ఇన్ని ఆధారాలు ఉన్నప్పటికీ, ఇటీవల తమపై కావాలని ఆక్రమణదారులంటూ అధికారులకు ఫిర్యాదులు చేయడం తీవ్ర మనస్తాపానికి గురిచేసిందన్నారు.తమ వద్ద ఉన్న సేల్ డీడీలు, రెవెన్యూ రికార్డులు, ఇంటి అనుమతులు, అసెస్‌మెంట్ వివరాలు, పాత కోర్టు తీర్పుల ప్రతులను అధికారులకు సమర్పించిన గ్రామస్తులు, భూమికి సంబంధించిన అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి తమ సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని, 60 ఏళ్లుగా అక్కడ నివాసముంటున్న తమకు పూర్తి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అంతటి వీరయ్య, అంతటి బుచ్చమ్మ, అంతటి సత్తయ్య, అంతటి ధనరాజ్, ముద్దంగుల నరసింహ, మన్నె ఇంద్ర సేన రెడ్డి, మన్నె నర్సిరెడ్డి, మన్నె చిత్రసేన రెడ్డి, వార్డు సభ్యులు ఉడుగు నాగరాజు, వీరమల్ల కార్తీక్ గౌడ్, ఏనుగు రఘుపతి, ఇద్దయ్య సంపంగి, గ్రామ ప్రజలు ఏనుగు బుచ్చిరెడ్డి, సిద్ధగొని శ్రీనివాస్, కారంగా మారయ్య, మన్నె సత్తిరెడ్డి, మన్నె శంకర్ రెడ్డి, అంతటి శంకరయ్య, ఏర్పుల బుచ్చయ్య, కుమ్మరి వెంకటయ్య, కరింగ యాదయ్య, టంగుటూరి బాబు, సిద్దగొని గోపాల్, రేవల్లి ఎల్లయ్య, రేవెల్లి సత్తయ్య, సయ్యద్ నజీర్, ముద్దం యాదయ్య, పల్చం యాదయ్య, అనిమల్లా రాములమ్మ, పల్లె జయలక్ష్మి, అంతటి కిష్టమ్మ, అంతటి యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

తొలి తెలంగాణ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

- ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి

ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురంయాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ పరిధిలో ఆచార్య శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి వేడుకలను విగ్రహ ప్రతిష్టాపన కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి విగ్రహ ప్రతిష్టాపన కమిటీ అధ్యక్షులు సూరపల్లి శివాజీ, వంగరి రఘు, సురపల్లి వెంకటేష్‌లు మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మా గాంధీతో కలిసి పోరాటంలో పాల్గొన్న గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు.తెలంగాణ రాష్ట్రం మాకు కావాలని తొలిసారిగా గొంతు విప్పిన తొలి తెలంగాణ ఉద్యమకారుడని స్మరించుకున్నారు. ఆనాడు ముఖ్యమంత్రి పదవి ఇస్తానన్నా తిరస్కరించి,నాకు పదవి కంటే తెలంగాణే ముఖ్యం అని నిలబడిన గొప్ప రాజకీయ పండితుడు, త్యాగధనుడు లక్ష్మణ్ బాపూజీ అని ఆయన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో విగ్రహ ప్రతిష్టాపన కమిటీ సభ్యులు దోర్నాల అంజయ్య, మేకని రామకృష్ణ, చేనేత సహకార సంఘం అధ్యక్షులు మరియు డైరెక్టర్లు చిలుకూరి శ్రీను, పగిడిమర్రి విష్ణు, దోర్నాల అంజయ్య, సంగిశెట్టి అనంత, మేకని యాదగిరి, దువ్వ విజయలక్ష్మి, సూరపల్లి రాములు, సంగిశెట్టి ధనంజయ, విడం వెంకటేశం, గుర్రం సత్తి, మేకని బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపాల్లో 'ఏఐ' శోభ.!

- నారాయణపురంలో సరికొత్త అలంకరణల సందడి
- పురాతన బురుజులు.. కోటల నమూనాలతో ప్రత్యేక ఆకర్షణ
- అయ్యప్ప, తిరుపతి ఆలయ సెట్లతో భక్తులకు కనువిందు
- సాంకేతికతకు భక్తిని జోడించిన యువత వినూత్న ఆలోచన

ప్రజా వాయిస్,సంస్థాన్ నారాయణపురం: గణేష్ ఉత్సవాలకు ఆధునిక సాంకేతికత తోడైంది. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలో గణేష్ మండపాలు ఈసారి వినూత్న అలంకరణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. గ్రామంలోని పలు వీధుల్లో ఏఐ సాంకేతికతతో రూపొందించిన దేవతామూర్తుల డిజిటల్ చిత్రాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతోపాటు, పురాతన గ్రామ బురుజులు, కోటల నమూనాలను మండపాల ముఖద్వారాలుగా తీర్చిదిద్దారు.ఏఐ డిజైన్లలో దేవతామూర్తుల రూపాల ను అత్యంత ఆకర్షణీయంగా రూపొందించడంతో భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కులదైవాల చిత్రాలతో కూడిన ఫ్లెక్సీలు సైతం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. డిజిటల్ ఆర్ట్ ప్రభావంతో దేవతామూర్తుల రూపాలు సజీవంగా కనిపించేలా ఉండటంతో సందర్శకులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

పుణ్యక్షేత్రాల సెట్లతో కనువిందు

కొన్ని మండపాల్లో తిరుపతి ఆలయం, అయ్యప్ప స్వామి సన్నిధిని తలపించేలా భారీ సెట్లను ఏర్పాటు చేశారు. రంగురంగుల విద్యుద్దీపాల అలంకరణల మధ్య ఈ సెట్లు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సాంకేతికతను వినియోగించుకుంటూనే సంప్రదాయ భక్తి భావాన్ని ప్రతిబింబించేలా యువత చేసిన ఈ ఏర్పాట్లను గ్రామస్థులు, పెద్దలు అభినందిస్తున్నారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా నారాయణపురంలో చోటుచేసుకున్న ఈ 'ఏఐ ట్రెండ్' ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.



కాంగ్రెస్ బహిష్కృతులతో బీఆర్ఎస్ బల ప్రదర్శన

- టికెట్ కోసమే గొంగిడి సునీత డ్రామాలు!
- గొంగిడి సునీత తీరుపై విరక్తి చెందే ప్రజలు కాంగ్రెస్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను 50 వేల భారీ మెజార్టీతో గెలిపించారు
- అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బురదజల్లుతున్నారు
- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాదగిరి గౌడ్ ఫైర్

మోటకొండూరు, సెప్టెంబర్ 21(ప్రజా వాయిస్):–వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆలేరు బీఆర్ఎస్ టికెట్ దక్కించుకోవాలనే ఆరాటంతోనే మాజీ విప్ గొంగిడి సునీత రాజకీయ డ్రామాలకు తెరతీశారని ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరసరపు యాదగిరి గౌడ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎప్పుడో బహిష్కరణకు గురైన వారిని పదేపదే పార్టీలో చేర్చుకుంటూ, మాజీ మంత్రి హరీశ్ రావు ముందు తన బలాన్ని నిరూపించుకునేందుకు సునీత తాపత్రయ పడుతున్నారని ఎద్దేవా చేశారు. మోటకొండూరులో మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరుణి రఘునాథ రాజు అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఆరోగ్య, నీటిపారుదల వంటి కీలక శాఖలు చేపట్టిన హరీశ్ రావు ఆలేరు నియోజకవర్గానికి పైసా పని చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నియోజకవర్గంలో కనీసం 5 కిలోమీటర్ల కొత్త బీటీ రోడ్డు వేయలేదని, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇస్తామని మోసం చేశారని మండిపడ్డారు. గొంగిడి సునీత తీరుపై విరక్తి చెందే ప్రజలు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను 50 వేల భారీ మెజార్టీతో గెలిపించారని గుర్తుచేశారు.ప్రస్తుతం ఎమ్మెల్యే అయిలయ్య ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌పై బురదజల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే 3,500 ఇళ్లను మంజూరు చేసిందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కొంతం మోహన్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ లు నెమ్మాని సుబ్రమణ్యం,నమిలే మహేందర్ గౌడ్, ఇంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ లు గంధమల్ల అశోక్, చీర శ్రీశైలం,మాజీ వైస్ చైర్మన్ పచ్చిమట్ల మధార్ గౌడ్,స్థానిక సర్పంచ్ భూమండ్ల జయమ్మ శ్రీనివాస్,మాజీ సర్పంచ్ బుగ్గ శ్రీశైలం కానుగు బాలరాజు,పట్టణ అధ్యక్షులు బుగ్గ కొమురయ్య, ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ తండ రంగయ్య, బొల్లేపల్లి శ్రీనివాస్, కంకాల ఎలందేర్, జూకంటి మధు, శశిధర్ రెడ్డి, పచ్చిమట్ల మధు, క్యాసగళ్ల చందు, భూమండ్ల ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానంతో సేవాభావం

-కోదాడలో పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు పెరికనగర్‌లో మైలారపు శెట్టి భాస్కర్‌రావు ఆధ్వర్యంలో అన్నదానం
- విజయ గణపతి దేవస్థానంలో భక్తులకు అన్నప్రసాదం వడ్డించిన మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్
- శ్రీరంగాపురంలో ప్రజా యూత్ ఆధ్వర్యంలో అన్నదానం..
- సేవా కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం

ప్రజా వాయిస్,కోదాడ:
ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం కంటే గొప్ప సేవ మరొకటి లేదని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమబాబు అన్నారు. పెరికనగర్‌లో మైలారపు శెట్టి భాస్కర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. సేవా కార్యక్రమాలు సమాజంలో సేవాభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు. కందిబండ ఎలమందరావు, చింతల శ్రీనివాసరావు, రమేష్, విష్ణుమూర్తి, సైదులు, వెంకన్న, హేమంత్, శ్రీనివాస్‌చారి, సైదారావు తదితరులు పాల్గొన్నారు.

విజయ గణపతికి ప్రత్యేక పూజలు: మాజీ ఎమ్మెల్యే బొల్లం
పట్టణంలోని విజయ గణపతి దేవస్థానంలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. లడ్డూ వేలం పాటలో పాల్గొని లడ్డూను దక్కించుకున్న వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మల్లయ్యయాదవ్‌ను సత్కరించారు.

శ్రీరంగాపురంలో అన్నదానం
కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరంగాపురం ఐదో వార్డులో ప్రజా యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని కౌన్సిలర్ కందుల చంద్రశేఖర్ ప్రారంభించారు. యువత సేవా కార్యక్రమాల్లో ముందుండటం అభినందనీయమని అన్నారు. అనంతరం భక్తులు, ప్రజలకు

అన్నప్రసాదం అందించారు. కట్టే కోలా రమేష్‌గౌడ్, చిత్తలూరి శ్రీను, పిల్లి వెంకీ, కే.సురేష్, కందుల రవితేజ, బెక్కం లింగయ్య, దొంగరి వెంకటేశ్వర్లు, ఓం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డిజె లేకపోతే హుషారు లేదు...

- దాన్ని చాటునే ప్రమాదకమైన పరిణామలు

ప్రజా వాయిస్ సంగారెడ్డి :
పండగైనా, పెళ్లైనా, పుట్టినరోజైనా... డిజె లేకపోతే హుషారు లేదు అనుకుంటున్నాం. కానీ ఈ 100o డెసిబెల్స్ సౌండ్ మనకు తెలియకుండానే ఎంత నష్టం చేస్తుందో తెలుసా?" లి ఆరోగ్య సమస్యలపై - మన బాడీ పై ఎఫెక్ట్ చూపుతుది. వినికిడి లోపం, 85 ఎదీ కంటే ఎక్కువ సౌండ్ కు 2 గంటలు ఉంటే చెవి నరాలు దెబ్బతింటాయి. డిజె సౌండ్ 120-150 ఎదీ వరకు ఉంటుంది. గుండె, బీపీ సమస్యలు..పెద్ద శబ్దం వల్ల బీపీ, హార్ట్ బీట్ సడెన్ గా పెరుగుతుంది, స్ట్రెస్ హార్మోన్లు రిలీజ్ అవుతాయి.నిద్రలేమి, తలనొప్పి రాత్రి పూట డిజె వల్ల నిద్ర పట్టదు, మైగ్రేన్, ఆందోళన, చిరాకు వస్తాయి.చిన్న పిల్లలు, గర్భిణీలకు ప్రమాదం. పిల్లల్లో వినికిడి ఎదుగుదల దెబ్బతింటుంది, గర్భంలో బిడ్డకు స్ట్రెస్ వస్తుంది. పర్యావరణ సమస్యలు పక్షులు, జంతువులకు హాని పెద్ద సౌండ్ కి పక్షులు గూళ్లువదిలేస్తాయి, కుక్కలు, ఆవులు భయంతో పారిపోతాయి.సౌండ్ పొల్యూషన్ గాలి, నీటి కాలుష్యం లాగే ఇది కూడా ప్రమాదకర కాలుష్యమే.

సామాజిక, చదువు పై ప్రభావం
విద్యార్థులు, వృద్ధులు ఇబ్బంది పరీక్షల టైంలో, వృద్ధులు, రోగులు ఉన్న ఇళ్లలో ఇది పెద్ద శిక్ష. గొడవలకు కారణం ఊరిలో డిజె పోటీల వల్ల గొడవలు, విద్వేషాలు పెరుగుతున్నాయి.చట్టపరమైన ప్రాబ్లమ్స్. రూల్ ఏంటి అంటే రాత్రి 10 గంటల తర్వాత లౌడ్ స్పీకర్ బ్యాన్. నిబంధనల ప్రకారం రెసిడెన్షియల్ ఏరియాలో 55 ఎదీ పగలు, 45 ఎదీ రాత్రి మించకూడదు.శిక్ష నిబంధనలు అతిక్రమిస్తే పోలీసులు కేసు పెట్టొచ్చు, సౌండ్ సిస్టమ్ సీజ్ చేయొచ్చు, జరిమానా 1 లక్ష వరకు ఉంటుంది."సంతోషాన్ని పంచుకోవడం తప్పు కాదు, కానీ మన సంతోషం ఇంకొకరి బాధ కాకూడదు. డిజె పెట్టండి, కానీ లిమిట్ లో పెట్టండి. బాక్స్ లు తక్కువ, సౌండ్ తక్కువ, హ్యాపీనెస్ ఎక్కువ."

గణనాథుల సేవలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

- వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు చేసిన పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు
- మాజీ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించిన మండప నిర్వాహకులు
- ప్రజలంతా సుఖసంతోషాలతో విలసిల్లాలని ఆకాంక్ష
- 28లో మరోసారి ఎమ్మెల్యే కావాలని అభిమానులు కోరుకున్నారు

ప్రజా వాయిస్ రామగుండం
పారిశ్రామిక ప్రాంతమైన రామగుండం నియోజకవర్గంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. గణపయ్య ఆశీస్సులు రామగుండం నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో విలసిల్లాలని పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రామగుండం నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లు, గోదావరిఖని పట్టణంలోని ప్రధాన కూడళ్లలో స్థానిక యూత్, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో కొలువుదీర్చిన వినాయక మండపాలను ఆయన సందర్శించారు.

ప్రత్యేక స్వాగతం.. ఘన సన్మానం
కోరుకంటి చందర్ రాక సందర్భంగా ఆయా మండపాల వద్ద ఉత్సవ కమిటీ పెద్దలు, నిర్వాహకులు ఆయనకు ఘనంగా, ప్రత్యేక రీతిలో స్వాగతం పలికారు. అనంతరం ప్రతి మండపంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండపాల పెద్దలు ఆయనను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి, దేవుని శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కోరుకంటి చందర్ మాట్లాడుతూ.. ఐక్యతకు, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచే వినాయక చవితి వేడుకలను పారిశ్రామిక ప్రాంత ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో, సోదరభావంతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయకులను పూజించడం అభినందనీయమన్నారు. నియోజకవర్గంలో నవరాత్రి ఉత్సవాలు ఎటువంటి విఘ్నాలు లేకుండా విజయవంతంగా

పూర్తికావాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు, స్థానిక కార్పొరేటర్లు, వినాయక మండపాల పెద్దలు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మంథనిలో ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి

- అంబేద్కర్ సర్కిల్ వద్ద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన బిఆర్ఎస్ నాయకులు
- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహణ
- బహుజనుల అభ్యున్నతికి, తెలంగాణ కోసం పదవిని త్యాగం చేసిన గొప్ప నేత బాపూజీ
- ఏగోలపు శంకర్ గౌడ్

ప్రజా వాయిస్ మంథని
తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఊపిరిలూది, బహుజన శ్రేయస్సే ధ్యేయంగా జీవితాంతం పోరాడిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలను మంథని పట్టణంలో బిఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఆదేశాల మేరకు బిఆర్ఎస్ మంథని మండల అధ్యక్షుడు ఏగోలపు శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నాయి. స్థానిక అంబేద్కర్ సర్కిల్ సమీపంలో ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి బిఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను, తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన వహించిన కీలక పాత్రను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మంథని మండల అధ్యక్షుడు ఏగోలపు శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. చేనేత వర్గాల సంక్షేమానికి, వెనుకబడిన తరగతుల హక్కుల సాధనకు బాపూజీ నిరంతరం శ్రమించారని కొనియాడారు. ఒక సామాన్య పద్మశాలి కుటుంబంలో జన్మించి, రాష్ట్ర మంత్రి స్థాయికి ఎదిగిన గొప్ప నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ. మంత్రి పదవిలో ఉన్నప్పటికీ తెలంగాణ ఆకాంక్ష కోసం, స్వరాష్ట్ర సాధన కోసం తన పదవిని సైతం త్యాగం చేసిన అమరవీరుడు ఆయన అని శంకర్ గౌడ్ పేర్కొన్నారు. కులాలు, వర్గాల మధ్య విభేదాలు లేకుండా బహుజనులందరూ ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధనకు, ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని

పిలుపునిచ్చారు. నివాళులర్పించిన అనంతరం నాయకులంతా జై తెలంగాణ కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి. పుట్ట మధు నాయకత్వం వర్ధిల్లాలి అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ కమిటీ అధ్యక్షులు, పట్టణ నాయకులు పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీలంక పారా త్రోబాల్ గేమ్స్‌కు ఎంపికైన కావేరి జ్యోతికి ఫిట్‌నెస్ ఫ్రీక్స్ జిమ్ అండ

క్రీడాకారిణి కలను నెరవేర్చేందుకు రూ.45 వేల ఆర్థిక సాయం
జిమ్ యాజమాన్యం రూ.30 వేలు.. సభ్యుల నుంచి రూ.15 వేలు

ప్రజా వాయిస్, పలిమెల:
శ్రీలంకలో జరగనున్న అంతర్జాతీయ పారా త్రోబాల్ గేమ్స్‌కు ఎంపికైన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పలిమెల మండల కేంద్రానికి చెందిన కావేరి జ్యోతికి హన్మకొండ లోని 'ఫిట్‌నెస్ ఫ్రీక్స్ జిమ్' యాజమాన్యం, సభ్యులు ఆర్థికంగా అండగా నిలిచారు. గేమ్స్‌కు సంబంధించిన మొత్తాన్ని ఈ నెల 25వ తేదీలోపు చెల్లించాల్సి ఉండగా, ఆమె పరిస్థితిని అర్థం చేసుకున్న జిమ్ యాజమాన్యం రూ.30 వేలు, జిమ్ సభ్యులు రూ.15 వేలు కలిపి మొత్తం రూ.45 వేల ఆర్థిక సహాయం అందించారు.కావేరి జ్యోతి మాట్లాడుతూ.. తాను నెల రోజుల క్రితమే జిమ్‌లో చేరానని, దివ్యాంగురాలినైన తనపై నమ్మకంతో సహాయం చేసిన జిమ్ యాజమాన్యానికి, సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తన కష్టాన్ని అర్థం చేసుకుని, కలను నెరవేర్చుకునేందుకు అండగా నిలిచిన మనోజ్, రాహుల్, కిరణ్, చందు, జిమ్ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు.తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని క్రీడల్లో మరింత ముందుకు సాగేందుకు కష్టపడతానని కావేరి జ్యోతి పేర్కొన్నారు. తనకు అందించిన ప్రేమ, ప్రోత్సాహం, సహాయం ఎప్పటికీ మర్చిపోలేనని తెలిపారు.

హెల్త్ మినిస్టర్ దామోదర్ రాజనర్సింహ సొంత నియోజకవర్గంలో అధ్వానంగా రోడ్లు

గొంగ్లూర్-గంగోజీపేట్ మధ్య గుంతలమయం..
ప్రమాదాల్లో ఇప్పటికే ముగ్గురు మృతి

ప్రజా వాయిస్,సంగారెడ్డి :
సంగారెడ్డి నుంచి సింగూర్ వెళ్లే ప్రధాన రహదారి గొంగ్లూర్--గంగోజీపేట్ మధ్యలో గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి అధ్వాన స్థితి కారణంగా ఇప్పటికే ముగ్గురు ప్రాణాలు కోల్పోయినట్లు స్థానికులు తెలిపారు. తాజాగా ఆదివారం రాత్రి గొంగ్లూర్ గ్రామానికి చెందిన గడ్డమీది శంకరయ్య, ఆయన భార్య రేణుక జోగిపేట నుంచి తిరిగి వస్తుండగా గుంతల కారణంగా ప్రమాదానికి గురయ్యారు. రహదారిపై గుంతలను తప్పించుకునే క్రమంలో ఎదురుగా వచ్చే వాహనాలు కూడా ఒకే వైపు రావడంతో అదుపుతప్పి బైక్‌పై నుంచి పడిపోయిన రేణుక తలకు తీవ్ర గాయమైంది. ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు.ఈ ఘటనపై స్పందించిన పుల్కల్ మండల ఎంఆర్ఓ, ఎస్ఐలు వెంటనే రోడ్డు పరిస్థితిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. తాత్కాలికంగా రహదారిపై మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని కోరారు.గొంగ్లూర్--గంగోజీపేట్ మధ్య రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టి, ప్రయాణికుల భద్రతకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పల్లె కిష్టయ్య, ఆలూరి బ్రహ్మానందరెడ్డి, పుట్టి కిష్టయ్య, పల్లె చంద్ర కిరణ్, గౌండ్ల ముకుంద గౌడ్, సంగళ్ల ప్రవీణ్, ఆరిఫ్, మానయ్య తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శాంతియుతంగా నిమజ్జన వేడుకలు జరుపుకోవాలి

కోరుట్ల సీఐ లక్ష్మీనారాయణ

ప్రజా వాయిస్, కథలాపూర్:
వినాయక నిమజ్జన వేడుకలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరుట్ల సీఐ లక్ష్మీనారాయణ కోరారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సిహెచ్.రవికిరణ్, పోలీస్ సిబ్బందితో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. స్థానిక సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకుంటూ నిమజ్జన ప్రాంతాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని తెలిపారు. నిబంధనల ప్రకారం డీజేలకు అనుమతి లేదని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే డీజే నిర్వాహకులను బైండోవర్ చేసి, చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఊరేగింపుల్లో మైనర్లను అనుమతించవద్దని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటిస్తూ నిర్ణీత సమయంలోనే నిమజ్జనం పూర్తి చేయాలని సూచించారు. మద్యపానానికి దూరంగా ఉంటూ పోలీసులకు సహకరించాలని, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

రైతులు పామాయిల్ సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి

- ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు
- ప్రభుత్వ విప్ విజయరమణ రావు

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :
రైతులందరూ లాభసాటి పంట అయిన పామాయిల్ సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు సూచించారు. ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ సహకారంతో ఎలిగేడు మండలం శివపల్లి గ్రామపంచాయతీ పరిధిలో రెండు ఎకరాల ప్రభుత్వ భూమిలో గ్రామస్తులతో కలిసి పామాయిల్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ భూములు నిరుపయోగంగా ఉండకుండా పామాయిల్ తోటలను ఏర్పాటు చేసి గ్రామపంచాయతీకి ఆదాయం సమకూర్చడంతో పాటు స్థానికులకు ఉపాధి కల్పిస్తామని తెలిపారు. ఎకరానికి సంవత్సరానికి రూ. 2 లక్షలకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉందని, పెద్దపల్లి జిల్లాలో ఇప్పటికే సుమారు 900 ఎకరాల్లో పామాయిల్ సాగు చేపట్టామని పేర్కొన్నారు. త్వరలో 1000 ఎకరాల లక్ష్యాన్ని చేరుకుంటామని తెలిపారు. అంతకుముందు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తడి, పొడి చెత్తను వేరు చేసే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. డ్రైనేజీల్లో చెత్త వేయకుండా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని, డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధుల నివారణకు పారిశుధ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, సర్పంచ్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, పామాయిల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి ఘనంగా నిర్వహణ

ప్రజా వాయిస్ ఆసిఫాబాద్
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో సోమవారం స్వాతంత్ర్య సమరయోధుడు కొండ లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతిని లక్ష్మణ సేవా సదన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరిసర ప్రాంతాల వారికి, బుద్ధ విహార్‌లో అరటిపండ్లు పంపిణీ చేశారు. సొసైటీ చైర్మన్ గాదే అవినాష్ కొండ లక్ష్మణ్ బాపూజీ సేవలను, ప్రజా ఉద్యమాలను ప్రస్తావించారు. బాపూజీ వాంకిడి మండల కేంద్రంలో జన్మించడం గర్వకారణమని, ప్రతి సంవత్సరం ఆయన జ్ఞాపకార్థం జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అశోక్ ముహుల్కర్, మడావి దౌలత్, సాప్రావ్ డోన్డోజి దుర్గే, కోబ్రాగడే తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ ఉద్యమం కేసులో కోర్టుకు హాజరైన వంశీచంద్ రెడ్డి

ప్రజా వాయిస్ కల్వకుర్తి సెప్టెంబర్ 21 :
సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు, ఎస్ఎస్ఏ జాతీయ ఇన్‌చార్జ్ చల్లా వంశీచంద్ రెడ్డి కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ సాధన కోసం 2016లో చేపట్టిన అమరణ నిరాహార దీక్షకు సంబంధించిన కేసులో కల్వకుర్తి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరయ్యారు. 2016లో కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ సాధన కోసం అమరణ నిరాహార దీక్ష చేపట్టిన వంశీచంద్ రెడ్డి దీక్ష నాలుగవ రోజున పోలీసులు అరెస్ట్ చేసి అక్రమ కేసు నమోదు చేశారు. కల్వకుర్తి ప్రజల ఆకాంక్ష కోసం సాగించిన ఆ పోరాటం నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ, పదేళ్లు గడిచినా ప్రజల హక్కుల కోసం నిలిచిన తన సంకల్పం నేటికీ కొనసాగుతోందని వంశీచంద్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజలతో కలిసి సాగించిన పోరాటాల ఫలితంగా కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ ఏర్పడిందని, కల్వకుర్తి ప్రజల హక్కులు, అభివృద్ధి కోసం తన ప్రయాణం నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.

రామగుండం కార్పొరేషన్ తీరుపై సీపీఐ ఆగ్రహం

- కూరుకుపోయిన పారిశుధ్య యంత్రాలు.. రూ.కోట్లలో ప్రజాధనం వృథా
- సాంకేతిక బృందాన్ని ఏర్పాటు చేసి వాహనాలకు మరమ్మతులు చేపట్టాలి
- ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య

ప్రజా వాయిస్ గోదావరిఖని
రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కోట్లాది రూపాయల ప్రజాధనంతో కొనుగోలు చేసిన పారిశుధ్య యంత్రాలు మూలనపడి నిరుపయోగంగా మారడంపై సీపీఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాధనం వృథా అవుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడం దున్నపోతు మీద వాన పడ్డ చందంగా ఉందని ఎద్దేవా చేశారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయం వెనుక భాగంలో చెట్ల పొదల్లో పడి ఉన్న పారిశుధ్య వాహనాలను ఆయన పరిశీలించారు. ?ఈ సందర్భంగా మార్కపురి సూర్య మాట్లాడుతూ.. కార్పొరేషన్ అభివృద్ధి, సుందరీకరణ పేరిట గతంలో ఒక ఐఏఎస్ కమిషనర్ రూ. 2 కోట్లు వెచ్చించి అత్యాధునిక

పారిశుధ్య యంత్రాలను కొనుగోలు చేశారని గుర్తుచేశారు. కొనుగోలు చేసిన ఏడాది గడిచినా వాహనాలు రాకపోవడంతో ఏఐవైఎఫ్, ప్రజాసంఘాల పోరాట ఫలితంగా వాటిని తీసుకువచ్చారని తెలిపారు. అయితే అవి నాసిరకం కావడం వల్ల కొన్ని రోజులకే మూలనపడ్డాయని, ఆ తర్వాత వచ్చిన అధికారులు గానీ, పాలకవర్గం గానీ వాటిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలనే ఆలోచన చేయకపోవడం దారుణమన్నారు. రోడ్లను ఊడ్చడానికి రూ. 65 లక్షలతో కొనుగోలు చేసిన స్వీపింగ్ మిషన్ ఏమాత్రం ఉపయోగపడకుండా మున్సిపల్ కార్యాలయం వెనుక పడి ఉందన్నారు. అలాగే రూ. 60 లక్షలతో కొనుగోలు చేసిన రెండు ట్రక్ మౌంటెడ్ గార్బేజ్ కంపాక్టర్ వాహనాల్లో ఒకదాన్ని మాత్రమే వాడుతూ, చిన్నపాటి సాంకేతిక సమస్యలతో ఉన్న మరొక వాహనాన్ని పొదల్లో వదిలేశారని విమర్శించారు. దీనివల్ల రూ. 30 లక్షల ప్రజాధనం వృథా అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త సేకరణలో కీలకమైన రూ. 70 లక్షల విలువైన రెండు స్టాటిక్ కంపాక్టర్ యంత్రాలను గౌతమినగర్‌లో నిరుపయోగంగా పడేసారని మండిపడ్డారు. వీటితో పాటు హుక్ హోల్డర్ మిషన్లు, చెత్త సేకరణ ట్రాలీలు కోట్ల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసి, నేడు పొదల్లో పడేయడంతో ప్రజల సొమ్ము బూడిదలో పోసిన పన్నీరవుతోందన్నారు. వెంటనే స్పందించి రేపు జరగబోయే జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఈ వాహనాల మరమ్మతులకు సంబంధించి ప్రత్యేక సాంకేతిక బృందాన్ని (టెక్నికల్ టీం) ఏర్పాటు చేసేలా ఖర్చుల అంచనాను అజెండాలో చేర్చి ఆమోదించాలని డిమాండ్ చేశారు. త్వరలోనే ఈ యంత్రాలన్నింటినీ వినియోగంలోకి తీసుకువచ్చేలా నగర మేయర్, కమిషనర్లు తగిన చర్యలు తీసుకోవాలని సూర్య కోరారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి కర్తవ్యం!

నేలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా వన మహోత్సవం

పచ్చదనం వెల్లివిరిసేలా ప్రతీ విద్యార్థి మొక్కలు నాటాలని పిలుపు

ప్రజా వాయిస్ ఖమ్మం:
ప్రకృతిని కాపాడుకోవడం సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యతని, భావి భారత పౌరులైన విద్యార్థులు ఆ బాధ్యతను భుజానకెత్తుకోవాలని ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎన్. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలకేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎల్. వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కే. శ్రీనివాసరావులతో కలిసి డాక్టర్ ఎన్. శ్రీనివాసరావు కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ...

పెరుగుతున్న కాలుష్య కోరల నుంచి భూమిని రక్షించుకోవాలంటే మొక్కలు నాటడం ఒక్కటే మార్గమన్నారు. విద్యార్థులు కళాశాలలోనే కాకుండా, తమ ఇళ్ల పరిసరాల్లోనూ తప్పనిసరిగా ఒక్కొక్క మొక్కను నాటి, దాన్ని సంరక్షించే బాధ్యతను స్వీకరించాలని స్పష్టం చేశారు. మొక్కలు నాటడమే కాదు, వాటిని వృక్షాలుగా

ఎదిగేలా చూడటమే నిజమైన దేశసేవ అని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా పర్యావరణ సమతుల్యత, మొక్కల ఆవశ్యకతపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల లైబ్రేరియన్ ఎం. గోపాలకృష్ణ, అధ్యాపక బృందం, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మరియు విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి

అధికారులకు మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఐఏఎస్ ఆదేశం

ప్రజల సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ వేగంగా పరిష్కారం చూపాలి

మేడ్చల్ జిల్లా, కలెక్టరేట్ / ప్రజా వాయిస్ :
ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, సివిల్ సప్లైస్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 106 దరఖాస్తులను ప్రజల నుంచి స్వీకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..... జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రజావాణికి వచ్చిన అర్జీదారుల సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా స్వీకరించిన దరఖాస్తులపై అధికారులు తీసుకున్న చర్యల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యం లేకుండా

సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో మాలతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను రారాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఉచిత వేరుశనగ విత్తనాల పంపిణీ

ఎలినో ప్రభావం దృష్ట రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజా వాయిస్ తెలకపల్లి సెప్టెంబర్ 21
తెలకపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం (గ్రూజా) ఆధ్వర్యంలో సోమవారం ఉదయం రైతులకు ఉచిత వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి హాజరై తన చేతుల మీదుగా రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి పాల్గొన్నారు. విత్తనాలు అందుకున్న రైతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో, దేశవ్యాప్తంగా ఏలినో (జుశ్రీ చీఱఅశీ) ఎఫెక్ట్ కారణంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ఆయన అన్నారు. దీని కారణంగా భూగర్భ జలాలు, సాగునీటి వనరులు తగ్గిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో రైతులు తెలివిగా వ్యవహరించాలని సూచించారు. నీరు ఎక్కువగా అవసరమయ్యే పంటలకు బదులుగా తక్కువ నీటితో పండే పంటలు వేయాలని కోరారు. ముఖ్యంగా వేరుశనగ వంటి ఆరుతడి పంటలు వేస్తే నష్టపోకుండా లాభాలు పొందవచ్చని వివరించారు. రైతులు ఎవరూ కూడా మోసపోవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రాథమిక సహకార సంఘం కేవలం రుణాలు ఇచ్చే సంస్థగా కాకుండా రైతులకు అన్ని విధాలుగా అండగా ఉండేలా నూతన విధి విధానాలను ప్రవేశపెడుతోందని తెలిపారు. ఇందులో భాగంగానే ఇప్పటికే గానుగ నూనె యూనిట్ ను ప్రారంభించి రైతులకు లాభం చేకూరుస్తున్నామని అన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ఈ యూనిట్ దోహదపడుతుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పాల వ్యాపారాన్ని కూడా ప్రవేశపెట్టబోతున్నామని వెల్లడించారు. పాల సేకరణ కేంద్రాల ద్వారా రైతులకు అదనపు ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇంకా రైతుల సంక్షేమం కోసం ఎన్నో నూతన పథకాలను తీసుకురాబోతున్నామని హామీ ఇచ్చారు. రైతులను రారాజులుగా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని అన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా

వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. సహకార సంఘాలను బలోపేతం చేస్తేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘ చైర్మన్, వైస్ డైరెక్టర్లు, మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కొమ్ము చంద్రశేఖర్ మరియు మండల అధికారి మండల రెవెన్యూ అధికారి విజయకుమార్ వ్యవసాయ శాఖ మండల అధికారి నర్మదా రమేష్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బండ పర్వతాలు ఉప సర్పంచ్ శ్రీనివాసులు వార్డు సభ్యులు స్థానిక నాయకులు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీజేపీ డ్రామా రాజకీయాలు బంద్ చేయాలి..

- ధర్నా చేసిన 5 నిమిషాల్లో నీళ్లు వచ్చాయంటూ చెప్పడం విడ్డురం
- నిమజ్జనశీపై వారం రోజులుగా మంత్రులు సమీక్ష చేస్తున్నారు.
- ఎస్సారెస్పీ లో నీటిని వదిలిన 24 గంట్లో కరీంనగర్ కి నీళ్లు వస్తాయనే అవగాహన లేని బీజేపీ నాయకులు
- బీజేపీ నాయకులు మిడి మిడి జ్ఞానంతో ఇలా చేస్తున్నారంటూ మండిపడిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి

ప్రజా వాయిస్,కరీంనగర్ (సెప్టెంబర్ 21): కరీంనగర్ జిల్లా చింతకుంట కెనాల్ వద్ద గణేష్ నిమజ్జన నీటి విడుదలపై బీజేపీ చేసింది ధర్నా డ్రామా అని మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండిపడ్డారు. మంత్రులు ఎప్పటికప్పుడు గణేశ్ నవరాత్రి ఉత్సలవాలపై నిమజ్జన ఏర్పాట్లపై నీటి విడుదలపై వివిధ సందర్భాలలో వారం రోజులుగా మానిటరింగ్ చేస్తున్నారని మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. నిమజ్జనానికి ప్రభుత్వం నీటిని విడుదల చేయదని తప్పుడు ప్రచారం చేసిన బిజెపి చింతకుంట కెనాల్ వద్దకు చేరుకొని ధర్నా చేయడం ఒక డ్రామా అని మండిపడ్డారు. ఆదివారం నుండే అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే మిషనరీ వచ్చి కెనాల్ లో సిల్ట్ తీసింద్రు, మట్టిని పోసింద్రు ఇవన్నీ ఏర్పాట్లు ఇప్పటికే జరుగుతుంటే బీజేపీ ధర్నా చేయగానే 5 నిమిషాలలో వారి పోరాటంతో ప్రభుత్వం నీటి విడుదలకు నిర్ణయం తీసుకుందని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. బీజేపీ ధర్నా చేసిన 5 నిమిషాలలో ప్రభుత్వం నీటి విడుదల పై నిర్ణయం తీసుకున్నట్టు తప్పుడు ప్రకటనలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. 11 గం లకు ధర్నా అని పెట్టి 11 గంటలకు నీరు విడుదలవుతుందని తెలుసుకొని 10:30 కే ధర్నా చేయడం వీరి డ్రామాకు పరాకాష్ట అని ఎప్పటికీ డ్రామా ఈ ట్రిక్స్ పని చేయవని బీజేపీ వాళ్ళు తెలుసుకోవాలని సూచించారు.కరీంనగర్ అభివృద్ధిపై అన్ని పండుగల నిర్వహణ పై ప్రజలకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మంత్రులు మేము ఎప్పటికప్పుడు చిత్త శుద్ధితో ముందుకెళ్తున్నాము. అన్ని వర్గాల ప్రజల మనోభావాలు గౌరవిస్తాం, ఎవరికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకుంటామని తెలిపారు. గత రెండు సంవత్సరముల నుండి చింతకుంట వద్ద నిమజ్జనం ఏర్పాట్లు చేస్తున్నామని ఇప్పుడే కావాలని రాద్ధాంతం ఎందుకు చేస్తున్నారని ప్రచురించారు. ఎస్సారెస్పీలో నీటిని విడుదల చేస్తే 24 గంటల తర్వాత చింతకుంటకు చేరుకుంటాయని ఈ మాత్రం జ్ఞానం లేని బిజెపి నాయకులు, కార్యకర్తలు ధర్నా చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిమజ్జన ఏర్పాట్లు బతుకమ్మ ఏర్పాట్లు అన్నీ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంటే కళ్ళు లేని కబోదిలా రాజకీయం చేయడం సిగ్గుచేటు అన్నారు. అన్ని ఏర్పాట్లు ఇక్కడ కనిపిస్తుంటే నీళ్లు లేవని ఎలా అనుకున్నారని నీళ్లు లేకుండానే విగ్రహాలను నిమజ్జనం చేస్తారా ఈ మాత్రం సోయి లేదా అని ఎద్దేవా చేశారు. ఇకనుండి ఈ డ్రామా రాజకీయాలు మానుకొని ప్రజల అవసరాలు అభివృద్ధిపై దృష్టి పెట్టాలని నాయకులకు కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సుడా చైర్మన్ తో పాటు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్

- ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డి
- చంద్రశేఖర్ రెడ్డిని ఘనంగా సన్మానించిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

ప్రజా వాయిస్ సంగారెడ్డి :
సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన చంద్రశేఖర్ రెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిని సంగారెడ్డి పట్టణంలోని రామ్‌నగర్ రామ్ మందిర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డిని జగ్గారెడ్డి ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. నిర్మలా జగ్గారెడ్డి డీసీసీ అధ్యక్షురాలిగా ఏడు సంవత్సరాలకు పైగా సుదీర్ఘకాలం పనిచేశారని తెలిపారు. ఆమె హయాంలో జిల్లా కేంద్రంలో ఏ విధంగా పార్టీ కార్యక్రమాలను నిర్వహించామో, అంతకంటే ఎక్కువగా చంద్రశేఖర్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. చంద్రశేఖర్ రెడ్డికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, పీసీసీ... అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాలకు అనుగుణంగా పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని జగ్గారెడ్డి సూచించారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు.

సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు: చంద్రశేఖర్ రెడ్డి...
నూతన డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. తనను డీసీసీ అధ్యక్షుడిగా ఎంపిక చేయడంలో సహకరించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.
నిర్మలా జగ్గారెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ, ఆమె మాదిరిగానే అందరితో సమన్వయం చేసుకుంటూ పార్టీ కోసం పనిచేస్తానని చెప్పారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

అధిష్టానానికి కృతజ్ఞతలు: ఎమ్మెల్యే సంజీవరెడ్డి
నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ.. తన తమ్ముడు చంద్రశేఖర్ రెడ్డిపై నమ్మకంతో డీసీసీ అధ్యక్షుడిగా నియమించిన ఏఐసీసీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే చంద్రశేఖర్ రెడ్డి ఎంపికకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహ, జగ్గారెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరి సహకారంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళులు

14వ వర్ధంతి సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ నివాళులు

ప్రజావాయిస్ / పాలకుర్తి
స్వర్గీయ కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ మరియు పట్టణ పాలకుర్తి పద్మశాలి సంఘ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పాలకుర్తి రాజీవ్ చౌరస్తాలోని బాపూజీ విగ్రహ స్థలం వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం బాపూజీ సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ అధ్యక్షులు డాక్టర్ మేడారపు సుధాకర్, పాలకుర్తి పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు చిలుకమారి వెంకటేశ్వర్లు, పోపా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చిదురాల ఎల్లయ్య మాట్లాడుతూ. కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ప్రజల హక్కుల కోసం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడని అన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. బాపూజీ ఆశయాలు, సామాజిక సేవా స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆయన సేవలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని నాయకులు అన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ గౌరవ అధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వర్లు, పట్టణ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి చిదురాల మార్కండేయ, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి పెనుగొండ రమేష్, విగ్రహ కమిటీ ప్రధాన కార్యదర్శి చిలుకమారి సోమేశ్వర్, ఉపాధ్యక్షులు ఈగ శ్రీనివాస్,కార్యవర్గ సభ్యులు చిలుకమారి శ్రీధర్, ఎనగందుల శ్రీనివాస్, చిదురాల దేవేందర్,చిలుకమారి వరప్రసాద్, మార్గం సతీష్, చిలుకమారి ఆంజనేయులు, వెంకటేష్ లతో తదితరులు పాల్గొన్నారు.

26న ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు

కంబాలపల్లి పెద్ద చెరువు వద్ద ఏర్పాట్లు.
జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్.

ప్రజా వాయిస్ ,మహబూబాబాద్
జిల్లాలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను సెప్టెంబర్ 26,న కంబాలపల్లి చెరువు వద్ద ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.మహబూబాబాద్ జిల్లాలోని సహజ సౌందర్యం, చెరువులు, జలపాతాలు, చారిత్రక, ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక ప్రదేశాలను ప్రజలకు పరిచయం చేయడంతో పాటు, జిల్లాను ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా అభివృద్ధి చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ పేర్కొన్నారు.కంబాలపల్లి చెరువుతో పాటు బయ్యారం చెరువు, గుంజేడు ముసలమ్మ దేవాలయం, కురవి వీరభద్రస్వామి దేవాలయం, బీముడి పాదం జలపాతం తదితర పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, సుందరీకరణ, సందర్శకులకు అనుకూలమైన వాతావరణం ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్యాటక ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, స్థానిక కళలు, సంప్రదాయాలు మరియు జిల్లా సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు, స్థానిక కళాకారులు, హస్తకళాకారులు, చిన్న వ్యాపారులు మరియు ఇతర వర్గాలకు ఆర్థిక అవకాశాలు పెరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.జిల్లా ప్రజలు, యువత, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, పర్యాటక రంగానికి చెందినవారు, అధికారులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.మహబూబాబాద్ జిల్లా ప్రకృతి సౌందర్యం, చారిత్రక, ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక ప్రత్యేకతలను ప్రపంచానికి పరిచయం చేసి, పర్యాటక రంగం ద్వారా స్థానికంగా ఉపాధి మరియు ఆర్థిక అవకాశాలను పెంపొందించడమే లక్ష్యం" అని జిల్లా కలెక్టర్ తెలిపారు.26 సెప్టెంబర్ వేదిక: కంబాలపల్లి చెరువు, మహబూబాబాద్ జిల్లా కార్యక్రమం ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లాలోని యువత, ప్రజలు, పర్యటకులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కలెక్టర్ ఒక్క ప్రకటనలో తెలిపారు.

మంచిరామిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :
సుల్తానాబాద్ మండలం మంచిరామి గ్రామంలో కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి వారిచే గ్రామ సర్పంచ్ ఉప్పు లక్ష్మి, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి తిరుపతి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ బీరకాయల లోకేష్ గ్రామస్థులకు వైద్య సేవలు అందించారు. బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు అందించారు. పరీక్షల ద్వారా వివిధ అనారోగ్య సమస్యలను గుర్తించి తగిన సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, గాదే విద్యాసాగర్, శ్రీనివాస్‌తో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను వారంలోగా పరిష్కరించాలి

68 దరఖాస్తులు స్వీకరణ.. అధికారులకు అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ ఆదేశం

ప్రజా వాయిస్, భూపాలపల్లి:
ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ పి. అశోక్‌కుమార్ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మొత్తం 68 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేసినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యలను వారంలోగా పరిష్కరించాలని సూచించారు. చేపట్టిన చర్యల వివరాలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.ప్రజల అర్జీల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయవద్దని, సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఆర్వో వసంతకుమారి, ఆర్డీవో హరికృష్ణతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజల గొంతుక డా. సతీష్ యాదవ్‌కు ఘన సన్మానం

ప్రజా వాయిస్.. వనపర్తి
హైదరాబాద్-రంగారెడ్డి జిల్లాల హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు డా. సతీష్ యాదవ్ జన్మదినం సందర్భంగా ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని ఎస్ఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో పౌర సన్మానం నిర్వహించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన పలువురు ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. వనపర్తి జిల్లాలో ప్రజా సమస్యలపై పోరాడిన సతీష్ యాదవ్ ప్రస్తుతం హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోనూ మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేయడం అభినందనీయమన్నారు. ప్రజలకు జరిగే అన్యాయాలను ప్రశ్నిస్తూ, అఖిలపక్ష ఐక్యవేదికను విస్తరిస్తూ ప్రశ్నించే గొంతుకగా నిలవడం సంతోషకరమన్నారు. నీతి, నిజాయితీతో ప్రజల కోసం పనిచేయడం అగ్నిపరీక్ష లాంటిదని, దానిని సతీష్ యాదవ్ కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఎంఆర్ అధ్యక్షుడు నర్సిరెడ్డి, రిటైర్డ్ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, పిచ్చయ్య, రిటైర్డ్ ఆర్మీ అధికారి నాగభూషణం రావు, హుబ్లీ విశ్వనాథం, సత్యనారాయణరాజు, ఆత్మకూరు బద్రీనాథ్, రిటైర్డ్ తహసిల్దార్ భాస్కర్‌రెడ్డి, యాదగిరి, టీఆర్‌పీ అధ్యక్షుడు విజయ్‌యాదవ్, జలంధర్, మారం మహేందర్, ప్రదీప్, జమ్ముల శ్రీనివాస్, విశ్వనాథ్, కృష్ణారావు, నాగేందర్, రామశర్మ, పేపర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజా వాయిస్ సంగారెడ్డి :

నా భర్తతో కలిసి లింగంపల్లి కి చక్ర వాహనంపై వెళుతుండగా మార్గమధ్యలో వాహనంపై నుంచి పడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మామిడి పల్లి సమీపంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల కేంద్రంలో చెందిన పోచన్న గారి ఇందిరా ఆంధ్ర ప్రాంతానికి చెందిన సురేష్ తో ప్రేమ పెళ్లి చేసుకుంది. ఇద్దరు కలిసి కొంతకాలం లింగంపల్లిలో నివాసం ఉండేవారు. ఎప్పటిలాగే తన్నా స్వగ్రామమైన పుల్కల్ కు వచ్చి తిరిగి వెళుతుండగా సోమవారం మధ్యాహ్నం మూడున్నర గంటల ప్రాంతంలో మామిడి పల్లి సమీపంలో తన భర్త వాహనాన్ని నడుపుతుండగా మృతురాలు ఇందిరా బైక్ పై నుంచి వెనక్కి పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. అప్పటికే కొనువపుడితో ఉన్న అన్న ఉద్దేశంతో 108లో సంగారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు రూరల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి శవ పంచదామని పోస్టుమార్టం తరలించారు. మృతురాలికి ఒకే ఒక్క కొడుకు.

క్షయ వ్యాధి రహిత జిల్లాగా భూపాలపల్లి

- ఉచిత టీబీ పరీక్షలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి: అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్

- టీబీ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలి

ప్రజా వాయిస్, భూపాలపల్లి:

జిల్లాను క్షయ వ్యాధి రహితంగా తీర్చిదిద్దేందుకు నిర్వహిస్తున్న ఉచిత టీబీ స్క్రీనింగ్ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ పి. అశోక్‌కుమార్ సూచించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో టీబీ పరీక్షలు నిర్వహించి, అనంతరం అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం, రాత్రిపూట చెమటలు, తెమడలో రక్తం, ఛాతీ నొప్పి, ఆయాసం, బరువు తగ్గడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని తెలిపారు. అనుమానితులు సమీపంలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీ లేదా జిల్లా ఆసుపత్రిలో ఉచితంగా ఎక్స్‌రే, తెమడ పరీక్షలు చేయించుకోవచ్చని పేర్కొన్నారు. టీబీ నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం ఉచితంగా మందులు, చికిత్స అందిస్తుందని తెలిపారు. వైద్యుల సూచన మేరకు మందులను పూర్తి కాలం వాడాలని, మధ్యలో నిలిపివేస్తే డ్రగ్ రెసిస్టెంట్ టీబీ వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గని కార్మికులు, మురికివాడల ప్రజలు, మధుమేహం, హెచ్ఐవీ ఉన్నవారిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకుని టీబీ రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఆర్వో వసంతకుమారి, డీఎంహెచ్‌వో డాక్టర్ మధుసూదన్, ఆర్డీవో హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలం నిల్.. మందు వ్యాపారం ఫుల్...

- పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయకుండ నిర్లక్ష్యం వహిస్తున్న ఓనర్స్

- నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వైన్ షాపులపై చర్యలేవి

- రోడ్లపైనే తాగుబోతుల తమషాలు..

- ఇబ్బందులకు గురవుతున్న ప్రయాణికులు

- నిద్రావస్థలో ఎక్సైజ్ శాఖ అధికారులు

ప్రజా వాయిస్, తిమ్మాపూర్ (సెప్టెంబర్ 21): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ నుండి నల్లగొండ రహదారిని అనుకుని ఉన్న రెండు వైన్స్ షాపులకు పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఐ మండల కార్యదర్శి బోయిని తిరుపతి సోమవారం ప్రజావాణిలో పిర్యాదు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వైన్స్ షాప్స్ కి పార్కింగ్ స్థలాలు లేక రహదారిపైనే మద్యం ప్రియుల బండ్లు విచ్చలవిడిగా నిలపడంతో, మద్యం విక్రయాలు జరుగుతున్న సాయంత్రం సమయంలో రహదారి గుండా కుటుంబ సభ్యులతో ప్రయాణాలు చేస్తున్న వారు, స్థానిక ప్రజలు,మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నటువంటి వైన్ షాపులపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో మల్హోత్ర మరియు ఎక్సైజ్ ఎస్సై సింధు లకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.. నిత్యం ఇదే రహదారి గుండా కరీంనగర్ కి వృత్తిరీత్యా, చదువులు, వ్యవసాయ, దేవాలయం లాంటి పనుల కోసం వెళ్తున్నవారు ఇబ్బందులు పడుతున్న ఎక్సైజ్ శాఖ అధికారులు తనిఖీలు చేయడం లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు..

సింగరేణి కార్మికుల బహిరంగ లేఖ

'బాబు' నిర్ణయాలు చారిత్రాత్మకం!

ప్రజా వాయిస్ - మంచిర్యాల/బెల్లంపల్లి: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి సింగరేణి సంస్థ అభివృద్ధిలో 1998లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయాలు అత్యంత కీలకమైనవని సింగరేణి కార్మిక సంఘం నాయకులు స్పష్టం చేశారు. నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న సంస్థను లాభాల బాట పట్టించేందుకు, కార్మికులను భాగస్వాములను చేస్తూ లాభాల్లో వాటా అందించే విప్లవాత్మక విధానాన్ని ఆయన ప్రారంభించారని గుర్తుచేశారు.

10 శాతం నుండి 34 శాతానికి చేరిన వాటా

1998లో తొలిసారిగా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం 10 శాతం లాభాల వాటాను ప్రకటించగా, కాలక్రమేణా అది పెరుగుతూ ప్రస్తుతం 34 శాతానికి చేరిందని నాయకులు వివరించారు. ప్రస్తుత సింగరేణి వార్షిక లాభం రూ.2,360 కోట్లు కాగా, అందులో 34 శాతం వాటా కింద రూ.819 కోట్లను కార్మికులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా ఒక్కో కార్మికుడికి సుమారు రూ.1,95,610 చొప్పున లబ్ధి చేకూరుతోందని లెక్కలతో సహా వివరించారు.

చారిత్రాత్మక నిర్ణయాలు.. ఉపాధి కల్పన

కార్మిక సంఘం ఎన్నికల విధానాన్ని ప్రవేశపెట్టి, యాజమాన్యం మరియు కార్మికుల మధ్య సమన్వయాన్ని చంద్రబాబు పెంపొందించారని కొనియాడారు. అంతకుముందు 1985లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సుమారు 40 వేల మందికి కేవలం 'పరుగు పందెం' ద్వారా పారదర్శకంగా ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఉదంతాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. సింగరేణి చరిత్రలోని ఈ చారిత్రాత్మక పరిణామాలను నేటి తరానికి తెలియజేయాలనే ఉద్దేశంతోనే తాము ఈ బహిరంగ లేఖను విడుదల చేసినట్లు కార్మిక నాయకులు

ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ (టీ.ఎన్.టీ.యూ.సీ.) మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. మణి రామ్ సింగ్, ఎస్‌సీఎల్‌యూ ఉపాధ్యక్షులు గద్దల నారాయణ, గంగాధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మెడిపల్లి భూములపై ఆర్‌డీఓ నివేదిక బోగస్.. 'ప్రజావాణి'లో ఆర్టీఐ సాక్ష్యాలతో నిరూపించిన బాధితుడు

ప్రజా వాయిస్: సిద్దిపేట

సిద్దిపేట జిల్లా రెవెన్యూ అధికారుల రికార్డుల మాయాజాలం, వారు సమర్పించిన నివేదికల్లోని అబద్ధాల పుట్ట సాక్ష్యాధారాలతో సహా బట్టబయలైంది. చిన్నకోడూరు మండలం మెడిపల్లి గ్రామంలోని ముఖిస పాపిరెడ్డి మరియు సత్తనారాయణ రెడ్డికి సంబంధించిన వివాదాస్పద ప్రభుత్వ సర్వే నంబర్లు 11, 76, 96, 97 భూములపై సిద్దిపేట ఆర్‌డీఓ కార్యాలయం సమర్పించిన నివేదిక పూర్తిగా తప్పుడు సమాచారంతో కూడుకున్నదని అన్నారు సోమవారం సిద్దిపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో బాధితుడు నేరుగా జిల్లా కలెక్టర్‌ను కలిసి, ఆర్టీఐ సర్టిఫైడ్ కాపీలతో అధికారుల ఘోర తప్పిదాలను నిరూపించడం జిల్లావ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది.

విచారణలో తేలిన షాకింగ్ నిజాలు

ఎమ్మార్వో ఆఫీసులో అసలు ఫైళ్లే లేవు చిన్నకోడూరు ఎమ్మార్వో కార్యాలయంలో ఈ భూముల ఎన్‌ఓసీ కి సంబంధించిన ఎలాంటి రికార్డులు లేదా అసలు ఫైళ్లే లేవని సమాచార హక్కు చట్టం ద్వారా తీసుకున్న అధికారిక కాపీల ద్వారా రుజువైంది. అసలు కార్యాలయంలో ఫైలే లేనప్పుడు, ఆర్‌డీఓ ఏ రికార్డులను పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారో అర్థం కావడం లేదని బాధితుడు ఆరోపించారు. మోటార్ అర్జీనే ల్యాండ్ ప్రొసీడింగ్స్ ఆర్‌డీఓ కార్యాలయం నుండి తీసుకున్న రికార్డులను పరిశీలించగా, నివేదికలో చూపిన డీఆర్ నంబర్లు పూర్తిగా వేరే మండలానికి చెందినవిగా తేలింది. మరీ ఘోరంగా, అధికారులు కలెక్టర్‌కు పంపిన ప్రతిపాదనల్లో రావురుకుల గ్రామానికి చెందిన కుంభం రాజి రెడ్డి' అనే వ్యక్తి తన బావి మోటార్ కనెక్షన్ గురించి ఇచ్చుకున్న అర్జీ సమాచారం ఉండడం గమనార్హం. ఒక సాదాసీదా మోటార్ అర్జీ నంబర్లను తీసుకొచ్చి, ఇక్కడ మెడిపల్లి భూముల మినహాయింపు ప్రొసీడింగ్స్‌గా అధికారులు చూపించారు. రిఫరెన్స్ లేఖ C/805/2017 లో రికార్డుల తారుమారు: కలెక్టర్‌కు ఆర్‌డీఓ పంపిన ప్రొసీడింగ్ ప్రపోజల్స్ రిఫరెన్స్ లేఖ నెం. C/805/2017 లో పూర్తిగా వేరే గ్రామానికి సంబంధించిన సమాచారాన్ని చొప్పించి, ఉన్నతాధికారులను సైతం తప్పుదోవ పట్టించేలా తప్పుడు నివేదికను సృష్టించారు.

సమగ్ర విచారణకు డిమాండ్

ఎలాంటి క్షేత్రస్థాయి విచారణ చేపట్టకుండా, ఆఫీసులో అసలు ఫైళ్లే లేకుండా, వేరే మండలం మోటార్ అర్జీల నంబర్లను వాడుతూ కలెక్టర్ గారిని సైతం తప్పుదోవ



Reply:
Proceedings pertaining to File No. E1/859/2018 is not found in this office and do not pertain to this office. Copy of the Distribution Register entry pertaining to File No. B/1733/2017 is enclosed herewith.

Encl: As above.

Public Information Officer, and ... Tahsildar, Chinnakodur Mandal.

To
Sri B Anil Kumar R/o Medipally (V) of Chinnakodur (M). Mob: 9573840900

పట్టించిన సిద్దిపేట ఆర్‌డీఓ పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారుడు డిమాండ్ చేశారు. ఈ భూములపై నిష్పక్షపాతంగా మరో ఉన్నతాధికారితో సమగ్ర విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు సమర్పించిన అర్జీలో కోరారు.

సీఎం సహాయనిధితో 52 కుటుంబాలకు ఆర్థిక భరోసా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణి చేసిన ఎమ్మెల్సీ శంకర్ నాయక్.

ప్రజా వాయిస్, మిర్యాలగూడ:

మిర్యాలగూడ పట్టణంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో సోమవారం నియోజకవర్గానికి చెందిన 52 మంది లబ్ధిదారులకు రూ.47,65,400 విలువైన సీఎం సహాయనిధి (జవీ=ఖీ) చెక్కులను ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ పంపిణీ చేశారు. వైద్య చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ నిధులు కొంతమేరకు ఆర్థిక భరోసా కల్పించనున్నాయి. ఈసందర్భంగా ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య చికిత్స సమయంలో సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సీఎం సహాయనిధి అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ సెల్ నల్లగొండ జిల్లా అధ్యక్షులు ముదిరెడ్డి నర్సిరెడ్డి, 25వ వార్డు కౌన్సిలర్ మనోజ్, నాయకులు తలకొప్పుల సైదులు, జవహర్ నాయక్, కొమ్ము దాసు, శ్రీనివాస్, వెంకటరెడ్డి, ద్వైద సురేష్, సేవా నాయక్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

10లక్షల రూపాయల తో సిసి రోడ్ల నిర్మాణం

వీపనగండ్ల గ్రామ సర్పంచ్ మీసాల పార్వతమ్మ

ప్రజా వాయిస్.. వీపనగండ్ల

మంత్రి జూపల్లి కృష్ణారావు సాకారంతో వీపనగండ్ల మండల కేంద్రంలో ప్రతి కాలనీలో సిసి రోడ్లు నిర్మాణం చేపటం జరుగుతదని గ్రామ సర్పంచ్ మీసాల పార్వతి అన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా మంజూరైన 10 లక్షల రూపాయల వ్యయంతో ఆదర్శ కాలనీలో సోమవారం రోజు సీసీ రోడ్ల పనులను మీసాల పార్వతమ్మ నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో అన్ని వీధులకు సీసీ రోడ్లను డ్రైనేజీలను మంత్రి జూపల్లి కృష్ణారావు సాయ సహకారాలతో మంజూరు చేయించుకుని వీపనగండ్ల గ్రామాన్ని అభివృద్ధిని చేపడతామని వారన్నారు. ఇంకా వీపనగండ్ల గ్రామానికి రావలసిన నిధులు అన్నిటిని మంత్రి కృష్ణారావు సహకారంతో గ్రామానికి ఇంకా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె అన్నారు. గ్రామ ప్రజలు గ్రామ అభివృద్ధికి సహకరించాలని ఈ సందర్భంగా సర్పంచ్ పార్వతి అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ మండల నాయకులు పెద్ద వెంకటరెడ్డి పోతల వెంకట్ రెడ్డి రవీందర్ రెడ్డి వార్డు సభ్యులు మహేష్ కావలి మహేష్ సాకలి గోపి గ్రామ ప్రజలు పాల్గొన్నారు

యువతకు స్ఫూర్తిప్రదాత బాపూజీ

- జేపసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పేట భాస్కర్

ప్రజా వాయిస్, కోరుట్ల:

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా కోరుట్లలో ఆయన విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పేట భాస్కర్ మాట్లాడుతూ.. 1969 తెలంగాణ ఉద్యమంలో మంత్రి పదవిని సైతం త్యాగం చేసిన బాపూజీ జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కులోన్నతి సంఘం జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, విగ్రహ కమిటీ అధ్యక్షుడు ముల్క ప్రసాద్, నేతలు గుడ్ల మనోహర్, ఆడెపు మధు, గుండేటి రవి, సుతారి రాములు, కుంచెం శంకర్, గుమ్మడి రమేష్, పసుల కృష్ణ ప్రసాద్, తిప్పిరి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనశీ ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలి..

- అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

ప్రజా వాయిస్, మానకొండూర్ (సెప్టెంబర్ 21): కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల కేంద్రంలోని చెరువు వద్ద వినాయక నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లను తక్షణమే పూర్తి చేసి,భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం చెరువు వద్ద వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి నిమజ్జన ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరీంనగర్‌తో పాటు మానకొండూర్ చుట్టుపక్కల గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు మానకొండూర్ చెరువుకు వచ్చే అవకాశం ఉందన్నారు.ఈ నేపథ్యంలో నిమజ్జన కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.చెరువు పరిసరాల్లో కాంతివంతమైన విద్యుత్ దీపాలు ఏర్పాటు

చేయడంతోపాటు,భారీ విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు అవసరమైన క్రేన్లను అందుబాటులో ఉంచాలని సూచించారు.గజ ఈతగాళ్లను కూడా ముందస్తుగా సిద్ధంగా ఉంచాలని తెలిపారు.భక్తులు, వాహనాల రాకపోకలతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అవసరమైన చోట వాహనాలను దారి మళ్లించాలని పోలీసు అధికారులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్య సేవలు అందించేందుకు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. రెవెన్యూ, పోలీసు, ఫైర్, విద్యుత్, ఇరిగేషన్,మున్సిపల్, వైద్యఆరోగ్య తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బండి రాజేశ్వరి, ఎంపీడీవో వీవీ వరలక్ష్మి, తహసీల్దార్ విజయ్ కుమార్, గ్రామ సర్పంచ్ తాళ్లపల్లి వర్షిణీ, ఎంపీవో సంతోష్ రావు, సీఐ శ్రీలత, మాజీ జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపల్లి సంపత్ గౌడ్, ప్యాక్స్ చైర్మన్లు ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మారెడ్డి, పార్టీ నాయకులు మర్రి ఓదెలు యాదవ్, రామిడి తిరుమల్ రెడ్డి, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, రేవెల్లి రాజలింగం, కిషన్ రావు, బుర్ర శ్రీధర్ గౌడ్, రామడుగు హరీష్, మీస సత్యనారాయణ, బోళ్ల మురళీధర్, గొల్లెన కొమురయ్య, బండి మల్లేషం, సాయిరి దేవయ్య, తాళ్లపల్లి నరేష్, కోంద్ర నరేష్, ఇర్ఫాన్, మాతంగి సహదేవ్, బొంగోని సునిల్, ఎన్.బాపురావు, గుడాల మహేందర్, జేడీ శ్యామ్, ఏగోళం శ్రీనివాస్ గౌడ్, డి.శ్రీనివాస్, బి.రమేశ్, నల్ల సూర్య,ముక్కెర సతీష్ కుమార్, అంజయ్య, తమిశెట్టి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలను నియంత్రించాలి

ంషన్ షాపులో 13 రకాల నిత్యవసర వస్తువులు ప్రజలకు అందించాలి

ఏ ఐ ఎఫ్ డి డబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగాల రాగసుధ

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా హన్మకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేసి కలెక్టర్ కి వినతిపత్రం.ఈ సందర్భంగా అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య(ఏ ఐ ఎఫ్ డి డబ్ల్యూ) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ వంగాల రాగసుధ మాట్లాడుతూ. నిత్యవసర వస్తువుల ధరలు రోజురోజుకు పెరుగుతూ సామాన్య ప్రజల జీవితాలను తీవ్ర సంక్షోభంలోకి నెట్టి వేస్తున్నాయి. బియ్యం, పప్పు, వంట నూనెలు, కూరగాయలు, పాలు, గుడ్లు ఇతర నిత్యవసర వస్తువుల ధరలు పెరగడంతో కుటుంబాల నెలవారి ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయి. ఈ ధరల పెరుగుదల ప్రభావాన్ని మొట్టమొదటిగా అత్యంత తీవ్రంగా ఎదుర్కొంటున్నది మహిళలే ఇంటి బడ్జెట్ ను నిర్వహించే బాధ్యత ఎక్కువగా మహిళపై ఉండటంతో ధరల పెరిగిన ప్రతిసారి తమ కుటుంబాల అవసరాలను తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పిల్లల పోషకాహారం, విద్య, ఆరోగ్యం దుస్తులు వంటి అవసరాలపైన ఖర్చులను తగ్గించుకోవాల్సి వస్తుంది, మంట ఆరిపోకుండా చూడాల్సిన మహిళ చేతిలో నేడు ఖాళీ సంచి మిగులుతుంది కూరగాయల ధరల పెరుగుతే కూర తగ్గుతుంది పప్పు ధరలు పెరుగుతే పప్పు తగ్గుతుంది నూనె ధరలు పెరిగితే వంటలపై కోతపడుతుంది ఇది కేవలం ధరల పెరుగుదల కాదు ప్రజల జీవన హక్కు పై బడుతున్న భారమైన పెద్ద దెబ్బ ప్రభుత్వాలు ప్రజల సంక్షేమాన్ని కాపాడాల్సిన సమయంలో మార్కెట్ ధర నియంత్రణ నిర్లక్ష్యం చేయడం వల్ల దళారులు అక్రమ నిల్వదారులు అధిక లాభ కోసం వ్యవహరించే వ్యాపారాలు ప్రజలను దోచుకునే పరిస్థితి ఏర్పడుతుంది. తక్షణమే నిత్యవసర వస్తువులు రేషన్ షాప్ ద్వారా ప్రజలకు 13 రకాల వస్తువులు ఇవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నాం.లేనియెడల అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి సంధ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నబోయిన ప్రేమలత, ప్రత్యూష, జిల్లా కమిటీ సభ్యులు ఏన్ రెడ్డి రాజేంద్ర, గడ్డం సుధారాణి, అరుణ, లక్ష్మి, దేవి తదితరులు పాల్గొన్నారు.

మద్యపాన నిషేధం పై అక్టోబర్ 2న కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయండి

ఏపూరి వెంకటేశ్వర్ రావు మాదిగ

ప్రజా వాయిస్ ఎల్కతుర్తి

పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్-ఎం ఎస్ పి ఆధ్వర్యంలో సోమవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు అడ్డూరి అనిల్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా ఇన్చార్జి ఏపూరి వెంకటేశ్వర్ రావు మాదిగ, సీనియర్ నాయకుడు ఆరేపల్లి పవన్ మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధి ఏపూరి వెంకటేశ్వర్ రావు మాదిగ మాట్లాడుతూ, మద్యపాన నిషేధాన్ని కోరుతూ అక్టోబర్ 2 న నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మద్యపానంతో అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం మద్యపాన నిషేధం పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న ఈ కార్యక్రమానికి ఎల్కతుర్తి మండలం నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. అదేవిధంగా అక్టోబర్ 7న చలో అమరావతి కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్-ఎం ఎస్ పి నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. అమరావతిలో ఆరోజు నిర్వహించనున్న నూతన మండల జాతీయ సదస్సును విజయవంతం చేసేందుకు ఎల్కతుర్తి మండలం నుంచి భారీగా హాజరుకావాలని సూచించారు. ఎమ్మార్పీఎస్-ఎం ఎస్ పి ఆధ్వర్యంలో చేపట్టే ఉద్యమ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ప్రతి గ్రామం నుంచి నాయకులు కార్యకర్తలు సమన్వయంతో ముందుకు రావాలని ఏపూరి వెంకటేశ్వర్ రావు మాదిగ కోరారు. సీనియర్ నాయకులు ఆరెపల్లి పవన్ మాదిగ

మాట్లాడుతూ, సంగం చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ ఫోరం నాయకుడు బొంకూరి వంశీ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల కార్యదర్శి చిలుముల వినోద్ మాదిగ, మండల నాయకుడు అడ్డూరి నవీన్ మాదిగ, అల్ల కొండ బాలు మాదిగ తో పాటు ఎమ్మార్పీఎస్-ఎం ఎస్ పి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కరాటే బరిలో దుబ్బాక దుమ్మురేపింది!

ప్రజా వాయిస్ దుబ్బాక

పతకాల వేటలో అదరగొట్టిన దుబ్బాక విద్యార్థులు - 7 గోల్డ్ మెడల్స్‌తో ఘన విజయం

దుబ్బాక: జాతీయస్థాయి కరాటే పోటీల్లో సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి సత్తా చాటారు. హైదరాబాద్‌లోని కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం నాకయమా షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇన్విటేషన్ ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో దుబ్బాక విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు.దేశంలోని పలు రాష్ట్రాల నుంచి సుమారు 2,000 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ ప్రతిష్ఠాత్మక జాతీయస్థాయి పోటీల్లో దుబ్బాక పట్టణానికి చెందిన 7 మంది విద్యార్థులు 7 గోల్డ్ మెడల్స్ సాధించి ఘన విజయం నమోదు చేశారు.

దుబ్బాక విద్యార్థుల స్వర్ణ ప్రదర్శన

దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. దిశా స్కూల్‌కు చెందిన ఆరావ్, మాస్టర్ మైండ్ స్కూల్‌కు చెందిన సర్వజ్ఞ, ప్రణవి, రిషి అఖిల్, సరస్వతి గ్లోబల్ స్కూల్‌కు చెందిన రిస్విత, శిల్విత, ఋషి విద్యాలయానికి చెందిన శ్రియన్స్ తమ ప్రతిభతో ప్రత్యర్థులను అధిగమించి గోల్డ్ మెడల్స్ సాధించారు.

విద్యార్థుల విజయానికి అకాడమీ శిక్షణే బలం

విద్యార్థులకు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక దారుఢ్యం, ఏకాగ్రత, పోటీతత్వ స్ఫూర్తిని పెంపొందించేలా నిరంతరం కరాటే శిక్షణ అందిస్తున్న యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ తెలంగాణ వ్యవస్థాపకులు, కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ విద్యార్థుల విజయంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరంతర సాధన, క్రమశిక్షణ, పట్టుదలతో శిక్షణ పొందితే గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు సైతం జాతీయస్థాయిలో తమ ప్రతిభను నిరూపించగలరని అన్నారు. దుబ్బాక విద్యార్థులు సాధించిన ఈ విజయం మరింత మంది పిల్లలకు క్రీడల పట్ల ఆసక్తిని పెంచడంతో పాటు, కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్‌లో రాణించేందుకు స్ఫూర్తినిస్తుందని తెలిపారు.

కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్‌కు ప్రత్యేక సత్కారం

ఈ సందర్భంగా నాకయమా షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్‌ను ఛాంపియన్‌షిప్ కప్‌తో పాటు మాస్టర్ మెమోటోతో ప్రత్యేకంగా సత్కరించారు. జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన దుబ్బాక విద్యార్థులను కూడా అభినందించి వారి ప్రతిభను ప్రశంసించారు.అలాగే విద్యార్థుల ఘన విజయంపై ఆర్ఎస్ఎస్కాయ్ వ్యవస్థాపకులు కరాటే మాస్టర్ నగేష్, జనరల్ సెక్రటరీ నవీన్ కుమార్, సురేందర్ సుబ్బు, నాగేంద్ర తదితరులు కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్‌ను, పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.జాతీయస్థాయిలో దుబ్బాక విద్యార్థులు సాధించిన ఈ ఘన విజయం పట్టణానికి, తల్లిదండ్రులకు, పాఠశాలలకు మరియు కరాటే అకాడమీకి గర్వకారణంగా నిలిచింది.

సింగరాజుపల్లి లో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు...!

ప్రజా వాయిస్ /దేవరుప్పుల

జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి గ్రామంలో సోమవారం ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్బీఐ ఆదేశాల మేరకు విడ్స్ ఎన్జీవో ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ ఊర్మిళ మల్లారెడ్డి హాజరయ్యారు. విశిష్ట అతిథిగా ఆర్బీఐ ఏజియం లక్ష్మి శ్రావ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు బ్యాంకింగ్ సేవలు, పొదుపు అలవాట్లు, డిజిటల్ లావాదేవీలు, ప్రభుత్వ పథకాలు, పీఎంజేజేబివై, పీఎంఎస్బివై, ఎపివై ప్రభుత్వానికి తదితర పథకాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సింగరాజుపల్లి టీజీబి బ్రాంచ్ మేనేజర్ బి. శ్రీనివాస్ నాయక్ గారు, విడ్స్ సీసీ సంతోష్ కౌన్సిలర్లు ప్రశాంత్, రవివర్మ, స్వాతి తదితరులు పాల్గొని ఓటిపి లు, బ్యాంక్ వివరాలు ఎవరికీ ఇవ్వవద్దని సూచించారు.సదస్సులో బ్యాంకు మిత్ర జయసుధ వివో స్వామి మహేశ్వరి మహిళలు, రైతులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులు వేగవంతం చేయాలి

పరిహారం చెల్లింపులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలి: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

పెండ్లిపాకల రిజర్వాయర్ పనులకు అవసరమైన భూసేకరణ పూర్తి చేయాలి

ప్రజా వాయిస్, భూపాలపల్లి:

నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, పునరావాసం-పునరావాస పునరావాస (ఆర్అండ్ఆర్) పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.2026-27 ఆర్థిక సంవత్సరంలో భూసేకరణకు రూ.6 వేల కోట్లు విడుదల చేయనున్నట్లు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే రూ.1,050 కోట్లు, తాజాగా రూ.1,500 కోట్లు కలిపి రూ.2,550 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అవార్డులు జారీ చేసిన భూములకు పరిహారం చెల్లింపులను ముందుగా పూర్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. రైతులతో నేరుగా చర్చించి, నిబంధనల ప్రకారం సాధ్యమైనంత మేరకు మార్కెట్ విలువకు అనుగుణంగా పరిహారం అందించాలని ఆదేశించారు.ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తయ్యేలోపు పెండ్లిపాకల రిజర్వాయర్ పనులు పూర్తయ్యేలా భూసేకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులకు రూ.3,100 కోట్ల విలువైన పనులను గుర్తించగా, రూ.2,514 కోట్లు విడుదల చేసినట్లు ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. వారానికొకసారి సమీక్ష నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు.జిల్లాలో ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పరిహారం చెల్లింపులు, ఇతర పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. సమావేశంలో కాటారం సబ్‌కలెక్టర్ సౌరవ్ శర్మ, ఎస్‌డీసీ రమేష్, ఆర్డీవో హరికృష్ణ, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏరియా వర్క్‌షాప్‌లో ఏసీఈ కంపెనీ ఎస్కార్ట్ ప్రారంభించిన జీఎం కృష్ణయ్య

ప్రజావాయిస్, ఇల్లందు(సెప్టెంబర్21):

సింగరేణి ఇల్లందు ఏరియా వర్క్‌షాప్‌లో ఏసీఈ కంపెనీకి చెందిన ఎస్కార్ట్ వాహనం ప్రారంభోత్సవం సోమవారం ఉదయం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఇల్లందు ఏరియా జనరల్ మేనేజర్ వి.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై ఎస్కార్ట్ వాహనానికి ప్రత్యేకపూజలు నిర్వహించి కొబ్బరికాయ కొట్టి రిబ్బన్ కట్ చేసి ఎస్కార్ట్ వాహనాన్ని జీఎం ప్రారంభించారు. అనంతరం జీఎం స్వయంగా ఎస్కార్ట్‌ను నడిపి పరిశీలించారు.ఈ సందర్భంగా జీఎం కృష్ణయ్య మాట్లాడుతూ.. ఎస్కార్ట్ వాహనాన్ని అత్యంత జాగ్రత్తగా అప్రమత్తంగా నడపాలని సూచించారు. వాహనం నడిపే సమయంలో పరిసరాలను గమనిస్తూ భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. వాహనం సక్రమంగా పనిచేసేలా ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని, ఏవైనా లోపాలు గుర్తిస్తే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ వాహనాలను వినియోగించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ఇడయం లక్ష్మణమూర్తి, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రామదాసు, డీజీఎం వర్క్‌షాప్ నాగరాజునాయక్, ఏరియా స్టోర్ ఆఫీసర్ నాగేశ్వరరావు, పర్చేస్ అధికారి దిలీప్ కుమార్, ఈఈ దేవేందర్ నాయక్, ఫోర్‌మెన్లు, ఎలక్ట్రిషియన్లు, ఫిట్టర్స్, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, అప్రెంటిస్ విద్యార్థులు

వినాయక నిమజ్జన పాయింట్లు,రూట్ మ్యాప్స్ పరిశీలించిన జిల్లా ఎస్పీ నితికా పంత్

ప్రజా వాయిస్ ఆసిఫాబాద్

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వినాయక నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా ఎస్పీ నితికా పంత్ పరిశీలించారు. నిమజ్జన రూట్ మ్యాప్స్, నిమజ్జన పాయింట్లు, తరలించే వినాయక విగ్రహాల సంఖ్య వివరాలను అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పాయింట్ల వద్ద బారికేడింగ్, లైటింగ్, ట్రాఫిక్ నియంత్రణ, పోలీస్ బందోబస్తు, క్రేన్లు, అత్యవసర సేవల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశమై ఏర్పాట్లు, సమస్యలు, సూచనలు తెలుసుకుని పోలీస్ శాఖ తరఫున సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు, వాహనాల నియంత్రణ, భక్తుల భద్రతపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. విద్యుత్ తీగలు, హైటెన్షన్ వైర్ల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండి, ప్రజలు, ఉత్సవ కమిటీలతో సమన్వయంతో పనిచేస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.

చిన్న ముద్దనూరులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజా వాయిస్ చిన్న ముద్దనూర్ సెప్టెంబర్ 21

తెలకపల్లి మండలంలోని చిన్న ముద్దనూరు గ్రామంలో సోమవారం ఉదయం ఉచిత స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి హాజరయ్యారు. లబ్ధిదారులకు తన చేతుల మీదుగా నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో అర్హులకు కార్డులు రాలేదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అర్హులందరికీ న్యాయం చేస్తున్నామని తెలిపారు. సన్నబియ్యం పథకాన్ని కూడా సమర్థవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎవరూ ఆకలితో అలమటించకూడదన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలకపల్లి ఎమ్మార్వో, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్, రుక్సానా ఖదీర్ మరియు వార్డు సభ్యులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. కార్డులు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు లబ్ధిదారుల వివరాలను పరిశీలించి కార్డులను అందజేశారు.

ఖమ్మం ఏఐకేఎంఎస్ మహాసభలకు తరలిరండి నెన్నెలలో పోస్టర్ల విడుదల

రైతులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని రత్నం తిరుపతి పిలుపు

ప్రజా వాయిస్ నెన్నెల/బెల్లంపల్లి

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండల కేంద్రంలో అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నాలుగో జాతీయ మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఉద్యమాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో ఖమ్మంలోని కామ్రేడ్ రాయల, సుభాష్ చంద్రబోస్, రవన్న గ్రౌండ్‌లో జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షుడు కామ్రేడ్ వేములపల్లి వెంకటరామయ్య ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని తిరుపతి కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల నాయకులు సమ్మయ్య, శ్రీనివాస్ , శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరానగర్ గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కు వినతి

ప్రజా వాయిస్ ఎల్కతుర్తి

ఎల్కతుర్తి మండలం ఇంద్రానగర్ గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ గ్రామ సర్పంచ్ అంబాల రాజ్ కుమార్ సోమవారం హైదరాబాదులోని మంత్రి క్వాటర్స్ లో హుస్నాబాద్ శాసనసభ్యులు రాష్ట్ర బీసీ సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు అభివృద్ధి పనులకు నిధులు అవసరమని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణం అంతర్గత రహదారుల అభివృద్ధి డ్రైనేజ్ వ్యవస్థ మెరుగుదల మురుగు కాలువల నిర్మాణం తదితర పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు ప్రతిపాదించిన పనులకు ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ అభివృద్ధికి సంబంధించిన వినతి పత్రాన్ని మంత్రికి అందజేసి పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. గ్రామ సమస్యలను సానుకూలంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చినట్లు గ్రామ సర్పంచ్ అంబాల రాజ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కడారి సురేష్, నల్లగొండ శివప్రసాద్, బొంకూరి ప్రవీణ్ పాల్గొన్నారు.

దోమకొండ ప్రజలకు దుప్పట్ల పంపిణీ

ప్రజా వాయిస్ దోమకొండ సెప్టెంబర్ 21

ప్రస్తుతం ఎల్ నీనో ప్రభావన్నీ దృష్టిలో ఉంచుకొని రాబోయే శీతాకాలానికి దోమకొండ కోట, గ్రామ అభివృద్ధి ట్రస్ట్ ఆధ్వర్యంలో అవసరం ఉన్న కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రతి వార్డు సభ్యులు తమ వార్డులో దుప్పట్లు అవసరం ఉన్న కుటుంబాల వివరాలను అందజేయాలని, ప్రతి వార్డుకు సుమారు 120 దుప్పట్లు కేటాయించామన్నారు. ఇందులో భాగంగా ఈరోజు 15వ వార్డు సభ్యురాలు ఐరేని లత రాజేందర్ చేతుల మీదుగా వార్డులో దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఐరేని నర్సయ్య , ఐరేని లతా రాజేందర్, వాడు ప్రజలు పాల్గొన్నారు.

ముమ్మరంగా సీసీ రోడ్ల పనులు

- రోడ్డు వెడల్పుతో తీరనున్న సమస్యలు

ప్రజా వాయిస్ దౌల్తాబాద్ సెప్టెంబర్ 21:

సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గ్రామంలోని పలు వీధుల్లో రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టడంతో స్థానికుల ఇబ్బందులు తొలగనున్నాయి. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గల్లీ గల్లీలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నారు. వర్షాకాలంలో మట్టి రోడ్ల కారణంగా రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో సీసీ రోడ్ల నిర్మాణంతో సమస్యకు పరిష్కారం లభించనుంది. గ్రామంలో రోడ్ల అవసరం ఉన్న ప్రాంతాలను గుర్తించి దశలవారీగా పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. రోడ్ల వెడల్పు పెంచడంతో పాటు సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతుండటంతో రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. ఈ సందర్భంగా రాయపోల్ సర్పంచ్ మాసంపల్లి రాజు మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో భాగంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని అన్ని వీధుల్లో అవసరమైన చోట సీసీ రోడ్ల నిర్మాణం పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి పార్టీలకు అతీతంగా నిధులు మంజూరు చేయడంలో సహకరించిన మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆసరా పింఛన్లు వెరిఫికేషన్ చేసిన అధికారులు

ప్రజా వాయిస్/ కొడకండ్ల

జనగామ జిల్లా కొడకండ్ల మండలం ఏడునుతుల గ్రామంలో మండల రెవెన్యూ అధికారి అనిల్ బాబు గ్రామ సెక్రెటరీ విద్యాసాగర్ గ్రామ సర్పంచ్ మురారి శెట్టి ఉమారాణి గ్రామ వీఆర్ఏ వట్టిపల్లి వెంకన్న వీరందరూ కలిసి గ్రామంలో ఉన్నటువంటి వితంతువులు వికలాంగులు వృద్ధులు ఆసరా పెన్షన్లకు అప్లై చేసిన వారందరి ఇంటింటికి వెళ్లి అర్హులను గుర్తించి వారికి ఆసరా పింఛన్లు వచ్చేలా చేస్తామని చెప్పడం జరిగింది,

మత సామరస్యానికి ప్రతీక!

- వినాయకుడి సన్నిధిలో సిరాజుద్దీన్ అన్నదానం..

ప్రజావాయిస్/మోమిన్ పేట్

వికారాబాద్ జిల్లా మోమిన్ పేట్ మండల పరిధిలోని చంద్రన్‌పల్లి గ్రామంలో మత సామరస్యానికి ప్రతీకగా కాంగ్రెస్ పార్టీ డీసీసీ జనరల్ సెక్రెటరీ వారాల సిరాజుద్దీన్ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ మందిరం సమీపంలోని వినాయక మండపం వద్ద ఏర్పాటు చేసిన ఈ అన్నదాన కార్యక్రమంలో భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా సిరాజుద్దీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ అన్నదాన కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి పాల్గొన్న ఈ కార్యక్రమం గ్రామంలో సోదరభావం, మత సామరస్యానికి ప్రతీకగా నిలిచింది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సర్పంచ్ శివకుమార్, ఉపసర్పంచ్ వెంకట్, వినాయక మండపం పెద్దలు, గ్రామ పెద్దలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మల్లయ్య, ప్రభాకర్ రెడ్డి, నర్సింలు, ఏజాస్ పటేల్, అఫ్సర్, హాజీ, హశం, తాజ్, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రఘు కుటుంబానికి సీపీఐ, ఏఐటీయూసీ నేతల పరామర్శ

ప్రజా వాయిస్, మెట్‌పల్లి:

తెలంగాణ రక్షణ సేన కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ చిట్నేని రఘు మాతృమూర్తి పుష్పలత మృతికి సీపీఐ జగిత్యాల జిల్లా కార్యదర్శి చెన్నా విశ్వనాథం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఏశమేని గణేష్ సంతాపం తెలిపారు. సోమవారం మెట్‌పల్లిలో రఘు నివాసానికి వెళ్లిన నేతలు పుష్పలత చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కాతా వినయ్, నాయకులు జంగా ధ్యావతి, స్వామి పాల్గొన్నారు.

దోమకొండ ప్రజావాణిలో 10 వినతిపత్రాలు

ప్రజా వాయిస్ దోమకొండ, సెప్టెంబర్ 21

దోమకొండ మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మండల ప్రజల నుంచి 10 దరఖాస్తులు వచ్చాయి. పంచాయతీ రాజు శాఖ - 3 ఇందిరమ్మ హౌసింగ్ - 3,పోలీస్ శాఖ - 2, రెవిన్యూ శాఖ - 2 సంబంధించి మొత్తం 10 దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో మధురిమ తెలిపారు. వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు తమ వినతిపత్రాలను అధికారులకు అందజేశారు . ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అధికారులు, సంబంధిత శాఖల అధికారులకు పంపించి నిబంధనల ప్రకారం సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజావాణిలో ఎంపీడీఓ మధురిమ తాసిల్దార్ స్వప్న ఎంపీవో రవికుమార్ వివిధ శాఖ అధికారులు హాజరైనారు.

భూ దోపిడీపై విచారణ చేసి క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపాలి

- కబ్జా చేసిన భూములను నిరుపేదలకు పంచాలి
- తెలంగాణ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కుతాడి శివరాజ్ డిమాండ్

ప్రజా వాయిస్, కరీంనగర్ (సెప్టెంబర్ 21): తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ దోపిడీపై సమగ్ర విచారణ జరపాలని తెలంగాణ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, కల్వకుంట్ల కవిత రాజకీయాల్లోకి రాకముందు వారి కుటుంబ ఆస్తులు ఎంత? నేడు ఎంత? అనేది తెలంగాణ ప్రజలకు స్పష్టంగా చెప్పాలన్నారు. గతంలో కేసీఆర్ పదేపదే నిజాంను పొగిడారని, లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను రాష్ట్రవ్యాప్తంగా బినామీల పేర్లతో కబ్జా చేసి దోచుకున్నారని ఆరోపించారు. మూడు రోజుల క్రితం స్వయంగా అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారే గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతి జరిగిందని, కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, కవిత తదితరులు భూ కబ్జాలకు పాల్పడ్డారని చెప్పారని, అలా అసెంబ్లీ సాక్షిగా చెప్పిన తర్వాత కూడా ఇప్పటివరకు వారిని అరెస్ట్ చేయకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఒక సామాన్య నిరుపేద ఇల్లు కట్టుకునేటప్పుడు కొంచెం ముందుకు వచ్చినా ఇంటిని కూలగొట్టి క్రిమినల్ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అలాంటిది కోట్లాది రూపాయల విలువైన భూములను కబ్జా చేశారని సీఎం చెప్పిన తర్వాత కూడా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలన్నారు.. కాలయాపన చేయకుండా కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలని, అవినీతికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. స్వాధీనం చేసుకున్న

భూములను నిరుపేద ప్రజలకు పంచాలని కోరారు. ఈ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించకపోతే, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కాశిపాక అజయ్, జిల్లా ఉపాధ్యక్షుడు బెజ్జంకి సంపత్, మొగిలి సతీష్, కొత్తూరు శంకర్, కోడిపెల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ఫారమ్-6, 7, 8 దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

- రానున్న 30-40 రోజులు ఎస్ఐఆర్-2026పై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- అక్టోబర్ 25 నాటికి అన్ని ప్రక్రియలూ పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశం

ప్రజా వాయిస్ పెద్దపల్లి
ఎస్ఐఆర్-2026 (ప్రత్యేక సమగ్ర పరిశీలన) ప్రక్రియలో భాగంగా రాబోయే 30 నుంచి 40 రోజులు ఎంతో కీలకమైనవని, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నిర్దేశిత గడువులోగా ప్రక్రియ మొత్తాన్ని పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. సోమవారం ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో ఎస్ఐఆర్--2026 పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. పెద్దపల్లి సమగ్ర జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీరాములు, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అరుణ శ్రీలతో పాటు ఏఈఆర్ఓలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ?ఈ సందర్భంగా రాష్ట్ర సీఈఓ సుదర్శన్ రెడ్డి

మాట్లాడుతూ, ప్రస్తుతం ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిష్కార వేగం ఆశించిన స్థాయిలో లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. దరఖాస్తులను చివరి క్షణం వరకు పెండింగ్‌లో ఉంచకుండా, ఎప్పటికప్పుడు నోటీసులు జారీ చేస్తూ విచారణ వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్--2026కు సంబంధించిన అన్ని ప్రధాన ప్రక్రియలను అక్టోబర్ 25, 2026 నాటికి పూర్తి చేయాలి. చివరి 10 రోజులను కేవలం అత్యవసర సవరణలు, ఇతర సాంకేతిక ప్రక్రియల కోసమే కేటాయించుకోవాలి. ఓటర్లకు జారీ చేసే నోటీసులను తప్పనిసరిగా బూత్ స్థాయి అధికారులే (బీఎల్ఓ) అందజేయాలి. రాజకీయ పార్టీల ప్రతినిధులను (బీఎల్ఏ) నోటీసుల పంపిణీకి ఉపయోగించకూడదు. బీఎల్ఏలు కేవలం ఇళ్లను గుర్తించడంలో మాత్రమే సహకరించవచ్చు. నిబంధనలు ఉల్లంఘించి బీఎల్ఏలతో నోటీసులు పంపిణీ చేయిస్తే సంబంధిత బీఎల్ఓలపై కఠిన చర్యలు ఉంటాయి. ప్రతి బీఎల్ఓకు స్పష్టమైన లక్ష్యాలను కేటాయించి, వారి పనితీరును క్రమం తప్పకుండా పర్యవేక్షించాలి. ఐదు రోజులకు మించి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే కలెక్టర్లు స్వయంగా సమీక్షించాలి. వయోవృద్ధులు, దివ్యాంగులు, ఎన్ఆర్ఐ ఓటర్ల విచారణ సమయంలో వారి తరఫున కుటుంబ సభ్యులు హాజరై అవసరమైన పత్రాలను సమర్పించేందుకు అనుమతించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్థానిక అధికారులతో సమావేశమయ్యారు. సీఈఓ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో పెండింగ్ ఫారమ్‌ల పరిశీలన వేగవంతం చేయాలని సూచించారు. అక్టోబర్ 25 గడువును దృష్టిలో ఉంచుకుని రోజూవారీ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని, బీఎల్ఓ స్థాయిలో 5 రోజుల కంటే ఎక్కువ రోజులు దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఊరు పేరు కోసం ఉద్యమిస్తాం

- ముంపు గ్రామాల పాత పేర్లనే కొనసాగించాలి
- రెవెన్యూ రికార్డుల్లో పేర్ల మార్పుతో ఇబ్బందులు
- గుర్తింపు కార్డులు, ధ్రువీకరణ పత్రాల జారీలో సాంకేతిక సమస్యలు
- ప్రభుత్వ పథకాలు, నష్టపరిహార దరఖాస్తుల్లోనూ అవాంతరాలు
- సీపీఐ గజ్వేల్ నియోజకవర్గం కార్యదర్శి శివలింగ కృష్ణ

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం : మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్మాణం కోసం తమ సొంత ఇళ్లు, సాగుభూములను త్యాగం చేసిన నిర్వాసిత గ్రామాల ప్రజల ఉనికి, గ్రామాల గుర్తింపునకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని సీపీఐ గజ్వేల్ నియోజకవర్గం కార్యదర్శి శివలింగ కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం గజ్వేల్ ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో

పార్టీ నాయకులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో శివలింగ కృష్ణ మాట్లాడుతూ... తరతరాలుగా కొనసాగుతున్న తమ గ్రామాల పేర్లను రికార్డుల నుంచి తొలగించి 'ముట్రాజ్‌పల్లి' అనే పేరును నమోదు చేయడం వల్ల గ్రామాల ఉనికి, సంస్కృతి, చారిత్రక గుర్తింపు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. గ్రామాల పేర్ల మార్పుతో ఆధార్, ఓటరు గుర్తింపు కార్డు, రేషన్ కార్డు, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు పొందడంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ పథకాలు, నష్టపరిహారాలు, ఇతర దరఖాస్తుల సమయంలోనూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం ఊళ్లను త్యాగం చేశామే తప్ప, తమ గ్రామాల గుర్తింపును కాదని స్పష్టం చేశారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి రెవెన్యూ రికార్డులతో పాటు ప్రజల అన్ని రకాల గుర్తింపు కార్డుల్లో పాత గ్రామాల పేర్లనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి కొండకింది పోచయ్య, పట్టణ కార్యదర్శి స్వర్గం రాజేశం, సీపీఐ నాయకులు వెంకటచారి, వెంకటేశం, పోతుల శంకర్, గూడూరి బాలనర్సు, మల్లన్నసాగర్ ముంపు గ్రామాల ప్రజలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు సంస్కృతి, టూరిజంపై అవగాహన కల్పించడమే యువ టూరిజం క్లబ్

ప్రజా వాయిస్ దౌల్తాబాద్, సెప్టెంబర్ 21: విద్యార్థులకు మన సంస్కృతి, పర్యాటక రంగం, చారిత్రక వారసత్వంపై అవగాహన పెంపొందించడమే యువ టూరిజం క్లబ్ ప్రధాన లక్ష్యమని మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు అన్నారు. సోమవారం దౌల్తాబాద్ జిల్లా పరిషత్

బాలుర ఉన్నత పాఠశాలలో యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో మండల స్థాయి పోటీలు నిర్వహించారు. మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన టూరిజం క్లబ్‌లకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. పాటలు, నాటికలు, ఉపన్యాసాల ద్వారా విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు మాట్లాడుతూ విద్యార్థులకు చిన్ననాటి నుంచే దేశ, రాష్ట్ర సంస్కృతి, పర్యాటక ప్రదేశాలు, చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపదపై అవగాహన కల్పించడం ద్వారా వాటి పరిరక్షణపై బాధ్యతను పెంపొందించవచ్చన్నారు. పోటీల్లో దౌల్తాబాద్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి, దౌల్తాబాద్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ బహుమతి, తిరుమలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ బహుమతి సాధించారు. విజేతలను ఈ నెల 23న నిర్వహించనున్న జిల్లా స్థాయి ప్రదర్శన పోటీలకు ఎంపిక చేసినట్లు మండల విద్యాధికారి తెలిపారు. న్యాయనిర్ణేతలుగా ప్రధానోపాధ్యాయులు అనిల్‌కుమార్, గోపాల్‌రెడ్డి, వెంకటలక్ష్మి, శ్రీనివాస్‌రెడ్డి, భూపతిరెడ్డి, సంజీవగౌడ్ వ్యవహరించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్‌తో కలిసి అర్జీదారుల

నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రెబ్బెన మండలం గోలేటికి చెందిన లావుడ్య మమత ఇందిరమ్మ ఇల్లు మంజూరు కోరుతూ, జైనూర్ మండలం జంగాంకు చెందిన కొడప అనుతారావు దివ్యాంగ పింఛన్ కోరుతూ, సిర్పూర్(టి) మండలం పారిగాంకు చెందిన దుర్కే విశ్వనాథ్ నిలిచిపోయిన పింఛన్ పునరుద్ధరణ కోరుతూ దరఖాస్తులు అందజేశారు. జిల్లా కేంద్రానికి చెందిన కాంబ్లే కీర్తికుమార్ ప్రభుత్వ వైద్య కళాశాలలో పొరుగుసేవల ఉద్యోగం కోరుతూ, సిర్పూర్(పి) మండల కేంద్రానికి చెందిన గద్దల రమేష్ విశ్వకర్మ పథకం రుణం కోరుతూ, చింతలమానేపల్లి మండలం బాబాసాగర్‌కు చెందిన పిప్పిరే బాబాజీ తన వాటా భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు కోరుతూ దరఖాస్తులు సమర్పించారు. వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

వాంకిడి ప్రజావాణిలో పలు సమస్యలపై ఫిర్యాదులు

ప్రజా వాయిస్ ఆసిఫాబాద్
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అభివృద్ధి పనుల బిల్లులు, పారిశుద్ధ్య సమస్యలపై ఫిర్యాదులు అందాయి. ఆకిని పరిధిలో రహదారి అభివృద్ధి పనులు పూర్తి చేసినా బిల్లులు చెల్లించడంలో జాప్యం జరుగుతోందని కాంట్రాక్టర్ మండోకర్ అనిల్ ఫిర్యాదు చేశారు. చెక్కుపై ఉప సర్పంచ్ సంతకం చేయకుండా పర్సంటేజీ అడుగుతున్నారని ఆరోపిస్తూ ఎంపీడీఓ పాటిల్ జ్యోష్ణకు లిఖితపూర్వకంగా దరఖాస్తు అందజేశారు. ఆరోపణలపై విచారణ జరిపి వాస్తవాలను తేల్చాలని కోరారు. మరోవైపు వాంకిడి గ్రామపంచాయతీ ఒకటో వార్డుకు చెందిన రాంటెంకి రశిక తమ ఇంటి పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్వాసన, పారిశుద్ధ్య సమస్యలు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను వార్డు సభ్యుడు, సర్పంచ్, కార్యదర్శి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని తెలిపారు. చెత్తను తొలగించి, ఇకపై తమ ఇంటి పరిసరాల్లో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రెండు ఫిర్యాదులపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డులు మరియు వాస్తవ పరిస్థితులను పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంది. కాంట్రాక్టర్ ఆరోపణలపై ఉప సర్పంచ్ వివరణ తెలియాల్సి ఉంది.

సజావుగా నిమజ్జనం జరపాలి

- అధికారులతో కథలాపూర్ ఎంపీడీవో సమీక్ష

ప్రజా వాయిస్, కథలాపూర్
వినాయక నిమజ్జనం అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా జరిగేలా చూడాలని ఎంపీడీవో కోరారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్, ఎస్ఐ, ఎంపీవో, వైద్యాధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్‌పీడీసీఎల్ ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిమజ్జన ప్రాంతాల్లో విద్యుత్ కాంతులు, తాగునీరు, రాకపోకల మార్గాల శుభ్రత, బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. నిమజ్జన వేదికల వద్ద ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు.

అక్రమ మట్టి తరలింపుపై చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో అంధుడు రాంరెడ్డి వినతి

ప్రజా వాయిస్ పెద్దపల్లి
జిల్లాలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో శాంతినగర్‌కు చెందిన సానికొమ్ము రాంరెడ్డి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన

మీడియాతో మాట్లాడుతూ.. తాను పూర్తిగా అంధుడినని, జిల్లాలో అక్రమ మట్టి తరలింపును అరికట్టేందుకు పలుమార్లు అధికారులకు పిటిషన్లు అందజేసినప్పటికీ ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోలేదని తెలిపారు. పాలకుర్తి, పెద్దపల్లి, ధర్మారం మండలాల తహసీల్దార్లకు ఫోన్ చేసినా స్పందించడం లేదని, ఫోన్ లిఫ్ట్ చేసిన సందర్భాల్లోనూ అక్రమ మట్టి తరలింపును అడ్డుకునేందుకు సిబ్బందిని పంపడం లేదని ఆరోపించారు. అదేవిధంగా పెద్దపల్లి రూరల్, ధర్మారం, బసంత్‌నగర్ ఎస్ఐలకు ఫోన్ చేసినా స్పందించడం లేదని, స్పందించిన సందర్భాల్లోనూ అక్రమ మట్టి తరలింపుపై తగిన చర్యలు తీసుకోవడం లేదని రాంరెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే పలుమార్లు పిటిషన్లు సమర్పించినా సమస్య పరిష్కారం కాలేదని, జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి అక్రమంగా మట్టిని తరలించే వారిపై చర్యలు తీసుకునేలా రెవెన్యూ, పోలీస్ శాఖలకు కఠిన ఆదేశాలు జారీ చేయాలని రాంరెడ్డి కోరారు.

ఎం పి యూ పి ఎస్ పాఠశాలనుదసందర్శించిన ఎస్ఐ రాజ్ కుమార్

శాలువాతో సన్మానించిన ఉపాధ్యాయులు

ప్రజా వాయిస్ కొత్తగూడ

ఎస్సై రాజ్ కుమార్ కొత్తగూడప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగ ఒకటవ తరగతి నుండి ఎనిమిదవ తరగతి వరకువిద్యార్థిని విద్యార్థుల నైపుణ్యాలను పరీక్షించి, విద్యార్థులను అభినందించారు. పాఠశాలకు మళ్లీ వస్తానని, పిల్లలందరూ క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని, ఉపాధ్యాయులు బోధించిన విషయాలను చక్కగా నేర్చుకోవాలని తెలియజేశారు పాఠశాల విద్యార్థులందరికీ స్వీటు పంపిణీ చేశారు. పాఠశాలను సందర్శించి క్రమశిక్షణలో, చదువులో విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ఎస్ఐ రాజ్ కుమార్ కి ఉపాధ్యాయ బృందం శాలువాతో చిరు సన్మానం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు గుమ్మడి లలిత, ఉపాధ్యాయులు చవుల సరస్వతి, నామాల మోహన్,తీగల రమేష్, చాట్ల బేబీ, కల్తీ రాధిక, గొగ్గల భారతి, ఆలూరి శంకర్ మరియువిద్యార్థులుతదితరులుపాల్గొన్నారు.

వరంగల్ ఎయిర్పోర్ట్ ఏపీజే అబ్దుల్ కలాం పేరు పెట్టండి:సలేశ్వరం

ప్రజా వాయిస్ **అచ్చంపేట** సెప్టెంబర్ 21

అబ్దుల్ కలాం మాజీ రాష్ట్రపతి పేరును నామకరణం చేయాలి ఐ ఎన్ టి యు అచ్చంపేట తాలూకా అధ్యక్షులు కోరారు ఆయన మాట్లాడుతూ రాష్ట్రపతిగా శాస్త్రవేత్తగా అనేక సేవలు అందుకే గుర్తించి వరంగల్ ఎయిర్పోర్ట్ కు అబ్దుల్ కలాం పేరు నామకరణం చేయాలని ఆయన కోరారు టౌన్ అధ్యక్షులు సలేశ్వరం ప్రధాన కార్యదర్శి అన్ని మండలాధ్యక్షులు తదితరులు ప్రజలు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

జిన్నారం ప్రజావాయిస్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం వారికి అవసరమైనటువంటి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని కౌన్సిలర్ దీనా ప్రవీణ్ అన్నారు సోమవారం జిన్నారం మున్సిపాలిటీ 18వ వార్డులో ప్రజల సమస్యలకు పరిష్కారం చూపే దిశగా డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఎన్నో రోజులుగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేలా పనులు చేపడుతున్నారు.వార్డు అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు కృషి చేస్తున్నామని 18వ వార్డు కౌన్సిలర్ ఎర్రవల్లి దీన ప్రవీణ్ తెలిపారు.ప్రజల సహకారంతో 18వ వార్డును మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తామని కౌన్సిలర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, నీలం నర్సింలు, శివరాజ్ ,అంజిరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, అనిల్, శ్రీనివాస్, చాకలి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పరిశుభ్రత కోసం కృషి

కౌన్సిలర్ కృష్ణ

జిన్నారం ప్రజా వాయిస్

పచ్చదనం పరిశుభ్రత కోసం కృషి చేస్తున్నామని గ్రామాన్ని ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దడం కోసం కృషి చేస్తున్నామని గడపడం మున్సిపల్ చైర్మన్ గద్దె సుష్మా గణేష్ స్థానిక కౌన్సిలర్ కృష్ణ లు అన్నారు సోమవారం నాడు గడ్డపోతారం మున్సిపాలిటీ 17 వ వార్డ్ లక్ష్మీపతిగూడెం బ్రాహ్మణ కుంట నుండి వైకుంఠ ధామం వరకు పచ్చదనం పరియావరణం లో భాగంగా 1500 మొక్కలు అందులో భాగంగా రాగి ,వేప ,జామ,అల్లనేరేడు పలురకాల మొక్కలు చైర్మన్ గద్దె సుష్మగణేశ్ , వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్ , కమిషనర్ మేడమ్ తన్యా సహకారం తో వార్డ్ కౌన్సిలర్ కుమారి కృష్ణ ఆధ్వర్యంలో విష్ణు కెమికల్ వారి సహకారం తో ఈ కార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఇట్టి కార్యక్రమం లో కంపెనీ ప్రతినిధి ఎ= శ్రీనివాస్ , గ్రామ పెద్దలు ఊపు వెంకట్ నర్సింలు, దుంపలి శెంకరయ్య ,అంబటి అంతయ్య, భవాని అశోక్ ,ఎం.డి . పాష మియా, బౌరంపేట మురళి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కీసరలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్

కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ, కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు కేవలం పార్టీ కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండే వేదికలుగా పనిచేయాలని సూచించిన వజ్రేష్ యాదవ్

ప్రజావాయిస్, కీసర :

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్, కీసర డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణతో పాటు నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కీసర డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామిడి స్వప్న విజయ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి, నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

ప్రజలకు అందుబాటులో పార్టీ కార్యాలయం

కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు కేవలం పార్టీ కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండే వేదికలుగా పనిచేయాలని వజ్రేష్ యాదవ్ సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలతో మమేకమై పనిచేస్తూ వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

కీసరలో పార్టీ బలోపేతానికి కృషి

కీసర డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని వజ్రేష్ యాదవ్ అన్నారు. పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.నూతన పార్టీ కార్యాలయం ప్రారంభం కావడంతో కీసర డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నెలకొంది. పార్టీ కార్యాలయం ద్వారా స్థానికంగా పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించడంతో పాటు ప్రజల సమస్యలపై నిరంతరం పనిచేయనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ మెంబర్ జైపాల్ రెడ్డి, జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహా యాదవ్, డీసీసీ ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, మాజీ కీసర మండల అధ్యక్షులు కోళ్ల కృష్ణ యాదవ్, డీసీసీ సెక్రటరీ నర్సింగ్ రావు, మేడ్చల్ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఖాజా మైనుద్దీన్,తదితరులు పాల్గొన్నారు. కీసర డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ అభిమానులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు...

అరటాకు భోజనం... సిద్ధి వినాయక సంప్రదాయం

25వ ఏట వైభవంగా సాగిన అన్నప్రసాదం అరటాకుల్లో ఆప్యాయ విందు హాజరైన రాజయోగి వెంకటస్వామిలి విశేష సంఖ్యలో పాల్గొని భక్తజనం

జిన్నారం ప్రజావాయిస్

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ, దైవ సేవయే మానవ సేవగా గుమ్మడిదలలో గత 24 ఏళ్లుగా సాగుతున్న పవిత్ర ఆనవాయితీ సిద్ధి వినాయక అన్నప్రసాద వితరణ. సిద్ధి వినాయక సంఘం ఆధ్వర్యంలో పాతికేళ్ల రజతోత్సవ మైలురాయిగా ఆదివారం రాత్రి నిర్వహించిన ఈ అన్నప్రసాద కార్యక్రమం ఆధ్యాత్మిక శోభ నడుమ అత్యంత వైభవంగా సాగింది... భక్తులు, దాతల సహకారంతో రెండు దశాబ్దాలకు పైగా నిరంతరాయంగా కొనసాగుతున్న ఈ కార్యక్రమానికి ఆదివారం రాత్రి భక్తజనం విశేష సంఖ్యలో తరలివచ్చారు. మన ప్రాచీన భోజన సంప్రదాయానికి పెద్దపీట వేస్తూ, అంతరాలు లేకుండా భక్తులందరినీ నేలపై ఒకే వరుసలో కూర్చోబెట్టి, పచ్చటి అరటి ఆకుల్లో ఆప్యాయంగా మహా అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ ఆధ్యాత్మిక మహోత్సవానికి ఆత్మానంద ఆశ్రమాధిపతి పూజ్యపాదులు రాజయోగి వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు దివ్య మంగళాశాసనాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. “సాటి మనిషికి ఆకలి తీర్చడమే నిజమైన దైవ ఆరాధన. పాతికేళ్లుగా సిద్ధి వినాయక సంఘం సభ్యులు మన సనాతన సంప్రదాయాన్ని కాపాడుతూ అరటాకుల్లో అన్నప్రసాదాన్ని అందించడం ఎంతో అభినందనీయం. నేలపై అందరూ సమానంగా కూర్చొని ఆరగించే ఈ ఆనవాయితీ సమాజంలో ఐక్యతను, ఆత్మీయతను పెంచుతుంది. వినాయకుడి కృపాకటాక్షాలతో గుమ్మడిదల గ్రామం, ఇక్కడి ప్రజలు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలి” అని ఆశీర్వదించారు.అనంతరం మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్యా గోవర్ధన్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాద వితరణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మాధవి సత్యనారాయణ, కత్తుల రమేష్, కిషన్, దేవాలయ కమిటీ అధ్యక్షులు మద్దుల బాల్రెడ్డి, స్థానిక పెద్దలు మండలి భాషయ్య, పడమటి లక్ష్మారెడ్డి, చెన్నంశెట్టి సత్యనారాయణ, తులసీదాస్, దేవేందర్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, సిద్ధి వినాయక సంఘం కమిటీ సభ్యులు సూర్యనారాయణ, మహేష్ కుమార్, కూరగాయల నర్సింలు, ఉదయ్ కుమార్, నర్సింగ్ సాగర్, కృష్ణ, రాము,రవి, నరేష్, నవీన్ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠధామాల్లో కనీస సౌకర్యాలు కరవు!

వైకుంఠధామాలకు మోక్షమెప్పుడు? తక్షణమే సౌకర్యాలు కల్పించాలి: బీజేపీ డిమాండ్ కేంద్ర నిధులతో నిర్మించి గాలికొదిలేశారు: బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ స్మశాన వాటికల్లో కరెంట్, నీటి వసతి, పరిసరాలను శుభ్రపరచాలి: తహసీల్దార్‌కు ఫిర్యాదు

ప్రజా వాయిస్ ఖమ్మం:

మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామాల దుస్థితిపై బీజేపీ నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వైకుంఠధామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండల తహసీల్దార్ రామ్ ప్రసాదుకు సోమవారం ఎంపిడిఓ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ ఆధ్వర్యంలో నాయకుల బృందం వినతిపత్రం అందజేసింది.ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ.. మండల పరిధిలోని వైకుంఠధామాలు సరైన నిర్వహణ లేక పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో అధ్వానంగా మారాయని మండిపడ్డారు. గ్రామాల్లోని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు వీటి నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఒక్కో వైకుంఠధామానికి లక్షలాది రూపాయల నిధులు వెచ్చించినప్పటికీ, ప్రస్తుతం అక్కడ తాగునీరు, విద్యుత్ వంటి కనీస వసతులు కూడా లేకపోవడంతో ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడకుండా నిరుపయోగంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంత్యక్రియలు నిర్వహించేందుకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే వైకుంఠధామాల పరిసరాలను శుభ్రపరచాలని, నిరంతర నీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు మల్లబోయిన గోవిందరావు, పురాణం దివాకర్, కొండ హర్షవర్ధన్, ధారావత్ వీరు నాయక్, గల్లా చక్రపాణి, పిట్టల సూరిబాబు, బానోతు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- తాగునీటి సరఫరాలో క్లోరినేషన్ తప్పనిసరి
- కోతులు, పిచ్చి కుక్కల బెడద నివారణకు కార్యాచరణ
- ఎంపీఓలు, డిఎల్పీఓలతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష

ప్రజా వాయిస్ పెద్దపల్లి

గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, అన్ని గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఎల్‌పీఓలు, ఎంపీఓలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, చెత్త పేరుకుపోకుండా వాహనాల ద్వారా డంపింగ్ యార్డులకు తరలించాలని స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నిల్వ నీటి ప్రాంతాల్లో దోమల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరాలో తప్పనిసరిగా క్లోరినేషన్ నిర్వహించి, క్రమం తప్పకుండా పరీక్షలు నమోదు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తీవ్రంగా ఉన్న కోతులు, కుక్కల బెడదపై స్పందిస్తూ... సమస్య తీవ్రత ఉన్న గ్రామాలను గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో ప్రజలకు ప్రమాదాలు తలెత్తకుండా నివారణ కార్యాచరణ అమలు చేయాలని ఆదేశించారు. పారిశుధ్య పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) శ్రీమాల, ఎంపీఓలు, ప్రజాసంబంధాల శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకోవాలి

భీమిని పీఎస్ తనిఖీలో డీసీపీ స్పష్టీకరణ

ప్రజా వాయిస్ / మంచిర్యాల క్రైమ్
మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గం భీమిని మండలంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్‌లో గల భీమిని పోలీస్ స్టేషన్‌ను మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తాండూర్ సీఐ దేవయ్య, భీమిని ఎస్ఐ కోటేశ్వర్ పుష్పగుచ్చాలు అందించి డీసీపీకి స్వాగతం పలికారు. అనంతరం డీసీపీ పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలను, వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ ఆవరణను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రిసెప్షన్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ రైటర్లతో మాట్లాడి ఆన్‌లైన్‌లో కేసుల వివరాల నమోదు, అప్‌లోడ్ ప్రక్రియ గురించి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల ఫైళ్లు, క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. నమోదైన కేసులు, వాటి దర్యాప్తు పురోగతి, పెండింగ్ వ్యవహారాలపై సీఐ దేవయ్య, ఎస్ఐ కోటేశ్వర్ లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీ ఎగ్గడి భాస్కర్ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరచూ సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలను పెంపొందించుకోవాలని, సమాచార వ్యవస్థను మరింత పటిష్ఠం చేసుకోవాలని సూచించారు. మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేకంగా కృషి చేయాలని తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని, వాటి అవసరం, ప్రాముఖ్యతపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందిస్తూ పోలీసు శాఖపై నమ్మకాన్ని మరింత పెంపొందించాలని డీసీపీ తెలిపారు.

శాంతియుత వాతావరణంలో గణేష్ నిమజ్జన వేడుకలు

- **నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు.**
- **మద్యం, అల్లర్లకు తావివ్వొద్దు**
- **ట్రాఫిక్, డీజే, విద్యుత్ భద్రతపై నిర్వాహకులకు డీసీపీ సూచనలు.**
- **పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్‌రెడ్డి**

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :
తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన గణేష్ ఉత్సవాలకు ముగింపు సందర్భంగా నిమజ్జన కార్యక్రమాన్ని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించాలని పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్‌రెడ్డి సూచించారు. భక్తి భావంతో ఉత్సవాలను నిర్వహిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని గణేష్ మండపాల నిర్వాహకులకు స్పష్టం చేశారు. సోమవారం సుల్తానాబాద్‌లోని యశోద నరహరి ఫంక్షన్‌హాల్‌లో సుల్తానాబాద్, కాల్వ శ్రీరాంపూర్, ఓదెల, ఎలిగేడు, జూలపల్లి మండలాల గణేష్ మండపాల నిర్వాహకులతో పోలీసులు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ నిమజ్జన ఊరేగింపులో నిర్వాహకులు, భక్తులు అప్రమత్తంగా వ్యవహరించాలని, పోలీసుల సూచనలు పాటిస్తూ ముందుకు సాగాలని కోరారు. మద్యం సేవించి ఊరేగింపులో పాల్గొనడం, అల్లర్లు సృష్టించడం, నిబంధనలు అతిక్రమించడం వంటి చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. నిమజ్జన ఊరేగింపులో డీజే వినియోగం, నిర్ణీత సమయాలు, శబ్ద పరిమితులు, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ భద్రత, ఊరేగింపు మార్గంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్వాహకులకు అధికారులు అవగాహన కల్పించారు. విద్యుత్ వైర్లు, ఇతర ప్రమాదకర ప్రాంతాల వద్ద అప్రమత్తంగా ఉండాలని, భక్తులు ఇబ్బందులకు గురికాకుండా ఊరేగింపును క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. నిమజ్జన ఏర్పాట్లలో పోలీసు, మున్సిపల్ శాఖతో పాటు సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తారని అధికారులు తెలిపారు. అనంతరం డీసీపీ భూక్య రామ్‌రెడ్డి అధికారులతో కలిసి నిమజ్జన ప్రదేశమైన పెద్దచెరువు కట్టను సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సమావేశంలో పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ పొన్నమనేని రంజిత్‌రావు, విద్యుత్ శాఖ డీఈ రామస్వామి, ఏఈ కిషోర్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ టి.రమేష్, ఎస్సైలు చంద్రకుమార్, సుధాకర్, సన్నత్‌రెడ్డి, మధుకర్‌తో పాటు వివిధ గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచొద్దు..

- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా.

ప్రజా వాయిస్, కరీంనగర్ (సెప్టెంబర్21): కరీంనగర్ కలెక్టరేట్‌లో ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన కలెక్టర్ చిత్రా మిశ్రా దరఖాస్తులను పెండింగ్ ఉంచకుండా సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించగా అదనపు కలెక్టర్లు శ్రీనివాసరెడ్డి , అశ్విని తానాజీ వాకడే, డీఆర్వో స్వామి, ఆర్డీవో షర్మిల, తదితర శాఖల అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 145 అర్జీలు రాగా అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 37, కరీంనగర్ నగరపాలక కు32 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మోతెలో ఘనంగా విగ్నేశ్వరుని పూజ....

మోతె సెప్టెంబర్21/ ప్రజా వాయిస్
మండల కేంద్రం లో సోమవారం కొత్త బస్ స్టాండ్ సెంటర్ వద్ద ఎనిమిదోవ రోజు రెండు జంటలు కూర్చొని ఘనంగా గణపతి పూజలు నిర్వహించడం జరిగింది 16 మంది మహిళలు లక్ష్మి దేవి చిత్ర పటానికి కుంకుమ పూజలు చేసి రంగు రంగుల పూలు సమర్పించారు పాల కాయలు కొట్టి పులిహోర లు పంచి పెట్టి పాల పాయసం భక్తులకు పంచి పెట్టారు ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ మెట్టు అలివేల నారాయణ రెడ్డి అప్పల లక్ష్మయ్య మల్లేశ్వరి సురకంటి లింగారెడ్డి నాగమ్మ కొండూరు అంజయ్య ప్రమీల బొడ్డు రామచంద్రయ్య మంగమ్మ సువర్ణ అనిత నాగమ్మ తదితరులు పాల్గొన్నారు

ఉద్యమ కారులకు దక్కనున్న గౌరవం

జిల్లా అధ్యక్షులు గుండె పంగు రమేష్

మోతె సెప్టెంబర్21/ ప్రజా వాయిస్
తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యం గా పని చేసిన ఉద్యమ కారులందరికి గౌరవం దక్కనున్నట్లు తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం జిల్లా అధ్యక్షులు గుండె పంగు రమేష్ అన్నారు సోమవారం మండల కేంద్రం లో ఏర్పాటు చేసిన మండల నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమం లో పాల్గొన్న అయన మాట్లాడుతూ 1969 తొలి 2001 మలి దశ తెలంగాణ ఉద్యమ సమయంలో నీళ్ళు నిధులు నియామకాలు అనే అంశం తొ ఆత్మ గౌరవ పోరాటం లో అలుపెరుగనిపోరాటం సాగించి తెలంగాణ రాష్ట్రం సాధించుకోవడం జరిగిందని చెప్పారు గడిసిన బి ఆర్ యస్ ప్రభుత్వం ఉద్యమ కారులను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు నాటి నుండి నేటి వరకు ఉద్యమ కారులను పట్టించుకోలేదని మండిపడ్డారు ఈ మధ్యకాలంలో కేక కమిటీ వేసి 250 గజాల ఇంటి స్థలం ఇవ్వనున్నట్లు ఉద్యమకారుల వివరాలను సేకరించడం జరుగుతుందని చెప్పారు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు చెప్పారు ఉద్యమ కాలంలో పనిచేసి అమరులైన కొందరు జైలుకుపోయిన మరి కొందరు బైండోవరైన కొందరు వికలాంగులైన వారు కొందరు జెండాలు పట్టుకొని ఉద్యమంలో భాగస్వామ్యమైన ప్రతి కార్యకర్తకు ఉద్యమ ఫలాలు అందించాలని డిమాండ్ చేశారు ప్రతి కార్యకర్తకు తెలంగాణ ఉద్యమ కారులుగా గుర్తించి నెలకు 25 వేల పెన్షన్ ఉచిత వైద్యము ఉచిత బస్సు సౌకర్యం అందించాలని కోరారు ఉద్యమకారులందరికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు అనంతరం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల కమిటీని ఎన్నుకొని నియామక పత్రం అందించారు ఈనెల 27 న యాదగిరి గుట్ట లో జరిగే ఉద్యమ కారుల సదస్సు కృతజ్ఞత సభ కు వేలాదిగా తరలి వచ్చి జయప్రదం చేయాలని తెలిపారు గౌరవ అధ్యక్షులుగా ఉన్నాం సత్యనారాయణ రావు మండల అధ్యక్షులుగా వీరండి నారాయణ ఉపాధ్యక్షులుగా ఇట్ట మల్ల ఎల్లయ్య ప్రధాన కార్యదర్శిగా పల్లెల రాము సహాయ కార్యదర్శిగా మైనంపాటి ప్రభాకర్ రెడ్డి గౌరవ సలహాదారులుగా సురకంటి లింగారెడ్డి హనుమకొండ సేనా రెడ్డి బొక్క వీరారెడ్డి లను ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరంనియోజకవర్గం నాయకులు ఏనుగుల ఎల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

శ్రీ గణేష్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం..

ప్రజా వాయిస్/అడ్డగూడూరు:
గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో శ్రీ గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఓం సాయిరాం పెయింట్స్ అధినేత ధర్మిశెట్టి లక్ష్మీప్రసన్న-సాయికుమార్ దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వినాయకుడి వద్ద కుటుంబ సభ్యులతో కలిసి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూజరి వనజ సైదులు గౌడ్, ఉప సర్పంచ్ లోకేష్, కమిటీ సభ్యులు రమేష్, నాగరాజు, మహేష్, పరమేష్, మచ్చ గిరి, మధు సోమన్న, మహేష్, వెంకన్న, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

టీపీఆర్టీయూ జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా రొట్టె శ్రీనివాస్

-నూతన పదవి బాధ్యతలు చేపట్టిన రొట్టె శ్రీనివాస్

ధర్మపురి, సెప్టెంబర్ 21 (ప్రజా వాయిస్) :
జగిత్యాల జిల్లాలోని బుగ్గారం మండలం లోని చిన్నాపూర్ గ్రామంలో గల స్థానిక మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల యందు స్కూల్ అసిస్టెంట్ హిందీ పండితుడిగా విధులు నిర్వహిస్తున్న రొట్టె శ్రీనివాస్ తెలంగాణ పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్ రెడ్డి హర్ష వర్ధన్ రెడ్డి చేతుల మీదుగా సంఘ సభ్యత్వంను స్వీకరించిన తధానంతరం జగిత్యాల జిల్లా నూతన అధ్యక్షుడిగా రొట్టె శ్రీనివాస్ ను నియమించారు. ఆదివారం రోజు సాయంత్రం వేళలో ధర్మపురి పట్టణ కేంద్రంలో జరిగిన ముఖ్య సమావేశం నందు కార్యక్రమాన్ని ఉద్దేశించి గాల్ రెడ్డి హర్ష వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు సంబందించిన పెండింగ్ డిఏ లను వెంటనే చెల్లించి పీఆర్సీని వెంటనే అమలు చేయాలి అని కార్యక్రమాన్ని ఉద్దేశించి తమ అమూల్యమైన సందేశాన్ని ఇచ్చారు. సోమవారం రోజు పలువురు రొట్టే శ్రీనివాస్ చేపట్టిన పదవి బాధ్యతల పట్ల తమ హర్షం వ్యక్తం చేస్తూ మున్ముందు మరెన్నో పదవి బాధ్యతలు చేపట్టి ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పట్ల కృషి చేయాలి అని వారు కోరారు. ఇట్టి కార్యక్రమంలో వారితో పాటు, టీపీఆర్టీయూ గౌరవ అధ్యక్షుడు పాతూరి రాజిరెడ్డి, కార్య నిర్వాహక అధ్యక్షుడు, చంద్ర శేఖర్ రావు, జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నరుకుల్ల శ్రీధర్ లతో పాటు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సంబందించిన నాయకులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘ నాయకులు, తదితరులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బిజెపి పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యం

తలకొండపల్లి మండల్ బిజెపి అధ్యక్షుడిగా ఎన్నికైన నీలకంఠం పాండు

ప్రజా వాయిస్ తలకొండపల్లి :
తెలంగాణ రాష్ట్రంలోని బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పోరాడాలని బూత్ స్థాయి నుంచి మండల అధ్యక్షుని వరకు వినలేని సేవలు బిజెపి పార్టీ అధికారం కోసం పనిచేయాలని కోరారు. అనంతరం నూతన తలకొండపల్లి మండల అధ్యక్షుడిగా నీలకంఠ పాండు కార్యకర్తలు ఏకగ్రీవ ఎన్నిక చేసిన. జిల్లా ప్రధాన కార్యదర్శి చేతుల మీదుగా గోరటి నర్సిహ్మ బీజేపీ కండువా వేసి ప్రకటించడం జరిగింది. తలకొండపల్లి మండల భారతీయ జనతా పార్టీ నూతన మండల అధ్యక్షుడిగా నీలకంఠ పాండు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు నీలకంఠ పాండుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ, నూతన అధ్యక్షుడు, నీలకంఠం పాండు, మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, కార్యకర్తల సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. ప్రతి గ్రామంలో గ్రామ కమిటీలు బలోపితం చేస్తూ సామాన్య కార్యకర్తకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూసుకుంటానని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, చెక్కల లక్షన్ మాజీ బీజేపీ అధ్యక్షులు రవి గౌడ్ వెంకట్రావు పెట్ సర్పంచ్ ఈ మహేష్ పోతూగంటి మహేష్ వెంకటేష్ శ్రీశైలం కార్యకర్తలు పాల్గొని నూతన మండల అధ్యక్షుడికి అభినందనలు తెలిపారు.

విజయాలను అందించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులు అందరిపై ఉండాలి

వినాయక ఉత్సవాల్లో మాద్రి పృథ్వీరాజ్

ప్రత్యేక పూజలు.. భక్తులకు అన్నప్రసాద వితరణ

పటాన్‌చెరు ప్రజావాయిస్
వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు పటాన్‌చెరు, జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను బీఆర్ఎస్ నాయకులు, వీణ= ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ సందర్శించారు. మండపాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని గణనాథుడిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. సింఫనీ పార్క్ హోమ్స్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొని ప్రతిభ కనబరిచిన వారికి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ, వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయని తెలిపారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.